దాశరథి సాహిత్యం-3
రూ.॥ 450/-
పేజీలు: 480


నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★

హైకోర్టుకు నలుగురు కొత్త న్యాయమూర్తులు
మరో ఆలయంలో తొక్కిసలాట
టెక్ కంపెనీలతో టచ్‌లో కేంద్రం
లోపలి పేజీల్లో

సంపుటి 08, సంచిక: 238 | మంగళవారం | 29-07-2025 | ఖమ్మం
Published from: **Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar**
పేజీలు: 12+8 | వెల రూ. 5.00

## బిసి కోటా బిల్లులపై
# 5న ఢిల్లీకి



- ఆమోదం కోరుతూ రాష్ట్రపతిని కలిసి విజ్ఞప్తి చేయాలని మంత్రివర్గం నిర్ణయం
- బిసి రిజర్వేషన్ల బిల్లుకు మద్దతునిస్తూ బిసి మేధావులు, బిసి సంఘాల ప్రతినిధులు ఢిల్లీకి రావాలని వినతి
- సిఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన క్యాబినెట్ భేటీ
- పంచాయతీ రాజ్ చట్టం అర్డినెన్స్, మెడికల్ సీట్లకు సంబంధించి జిఒ 33 జారీపై చర్చ
- మైక్రో బ్రూవరీస్ చట్టానికి పలు సవరణలు, రాష్టంలో ఉన్న అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులను రద్దు చేయాలని మంత్రివర్గంలో నిర్ణయం

ప్రజాపక్షం / హైదరాబాద్



తెలంగాణ రాష్ట్రంలో వెనుకబడిన తరగతుల (బిసి)కు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లులను వెంటనే ఆమోదించాలని కోరుతూ రాష్ట్రపతిని కలిసి విజ్ఞప్తి చేయాలని తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. బిసి రిజర్వేషన్లకు సంబంధించిన రెండు బిల్లులు వెంటనే ఆమోదించాలని రాష్ట్ర మంత్రివర్గం రాష్ట్రపతికి విజ్ఞప్తి చేయటంతో పాటు ఆగస్ట్ 5, 6, 7 తేదీల్లో జాతీయ స్థాయిలో అవసరమైన కార్యాచరణ చేపట్టాలని నిర్ణయం తీసుకుంది. బిసి రిజర్వేషన్ల బిల్లుకు మద్దతునిస్తూ బిసి మేధావులు, బిసి సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో ఢిల్లీకి రావాలని విజ్ఞప్తి చేసింది. రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సోమవారం సచివాలయంలో జరిగింది. రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్న బిసి రిజర్వేషన్ల రెండు బిల్లులు, అలాగే గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉన్న తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ చట్టం 2018 సవరణ ఆర్డినెన్స్ అంశంపై మంత్రివర్గం సుదీర్ఘంగా చర్చించింది. మెడికల్ సీట్లకు సంబంధించిన జిఒ 33 జారీ అంశంపై కూడా చర్చించారు. అయితే ఈ విషయంపై సుప్రీంకోర్ట్‌లో వాదనలు జరుగుతున్న నేపథ్యంలో న్యాయపరమైన సలహా నిమిత్తం తెలంగాణ రాష్ట్ర అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డితో చర్చించాలని మంత్రివర్గం వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు సూచించినట్టు సమాచారం. కోర్ తెలంగాణ అర్బన్ సిటీ ఏరియాతో పాటు రాష్ట్రంలోని అన్ని మున్సిపల్ కార్పొరేషన్స్‌లో మైక్రో బ్రూవరీస్ ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మైక్రో బ్రూవరీస్ చట్టానికి పలు సవరణలు చేస్తూ నిర్ణయం తీసుకుంది. రవాణా శాఖ కు సంబంధించి రాష్టంలో ఉన్న అంతర్రాష్ట్ర చెక్ పోస్టులను రద్దు చేయాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. "రాష్ట్ర సరిహదుల్లో మొత్తం 15 చెక్ పోస్టులు ఉన్నాయి. జాతీయ రహదారులపై రవాణాకు ఇబ్బంది లేకుండా చెక్ పోస్టులను తొలిగించాలని కేంద్ర ప్రభుత్వం కూడా అన్ని రాష్ట్రాలకు సూచించింది. చెక్ పోస్టులు సిబ్బంది కాకుండా ఇకపై వాహన్, అడ్వాన్స్ సిసి కెమెరాల ద్వారా మానిటరింగ్ కొనసాగుతుంది" అని తరువాయి 2లో

## ఆపరేషన్ సిందూర్ లక్ష్యం పాక్
# భూ భాగం కాదు

- పాకిస్థాన్ దుస్సాహసం చేస్తే 'సిందూర్' మళ్ళీ చేస్తాం..
- సైనికచర్య ఆపాలని ఎవ్వరూ ఒత్తిడి చేయలేదు: రాజ్‌నాథ్ సింగ్



**న్యూఢిల్లీ:** ఆపరేషన్ సిందూర్ ఉద్దేశ్యం సరిహద్దులు దాటి, అక్కడి(పాకిస్థాన్) భూభాగాన్ని స్వాధీనం చేసుకోవడం కాదని, ఉగ్రవాద సైనిక స్థావరాలను ధ్వంసం చేయడమే ఆపరేషన్ సిందూర్ లక్ష్యమని, దానిని పూర్తి చేస్తామని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. యుద్ధంలోకి లాగడం తమ ఉద్దేశ్యం కాదని, మన శక్తి ప్రదర్శనత ద్వారా శత్రువులు లొంగిపోయేలా ఒత్తిడి చేయడమే లక్ష్యమని చెప్పారు. ఆపరేషన్ సిందూర్ భారత రాజకీయ–సైనిక శక్తిసామర్థ్యాల ను చాటి చెప్పిందని చెప్పారు. ఆపరేషన్ సిందూర్‌పై సోమవారం మధ్యాహ్నం లోక్‌సభలో ప్రత్యేకచర్చను రక్షణమంత్రి ప్రారంభించారు. భారత సాయుధ బలగా లు అనుకున్నవిధంగా రాజకీయ–సైనిక లక్ష్యాలను సాధించిన తర్వాత ఆపరేషన్ సిందూర్‌కు విరామం ఇచ్చామని, సైనికచర్యను ఆపడంలో ఎవరి ఒత్తిడీ లేదని అన్నారు. పహల్గామ్‌లో దాడి తరాత ఉగ్రవాదులను తరువాయి 2లో

## ఆపరేషన్ సిందూర్‌కు
# వాణిజ్యంతో సంబంధం లేదు

- ఏ దశలోనూ అమెరికాతో సంభాషణ జరగలేదు
- విదేశాంగమంత్రి జైశంకర్ ప్రకటన



**న్యూఢిల్లీ:** ఆపరేషన్ సిందూర్ సైనికచర్యను ఆపేయడానికి, వాణిజ్యానికి ఎలాంటి సంబంధం లేదని భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ చెప్పారు. సైనికచర్య జరుగుతున్న సమయంలో ఏ దశలోనూ కూడా అమెరికాతో ఈ విషయం పై సంభాషణలు జరగలేదని ఆయన స్పష్టం చేశారు. లోక్‌సభలో సోమవారంనాడు ఆపరేషన్ సిందూర్‌పై జరిగిన చర్చలో మంత్రి జైశంకర్ జోక్యం చేసుకుని పైవిధంగా చెప్పారు. పాకిస్థాన్‌లో ఉన్న ఉగ్రవాదస్థావరాలపై భారత్ సైన్యం దాడులు చేయడానికి, వాటిని ఆపేయడానికి, అమెరికాతో వాణిజ్యానికీ ఎలాంటి సంబంధం లేదన్నారు. పాకిస్థాన్‌కు చెందిన డిజిఎంఒ స్వయంగా భారత్ డిజిఎంఒకు ఫోన్‌చేసి విజ్ఞప్తి చేశారని, ఆ మేరకు సంభాషణల తరువాయి 2లో

## ఇప్పుడు కాకపోతే
# ఇంకెప్పుడు?



యుద్ధం ఎందుకు ఆపారు
కాంగ్రెస్ లోక్‌సభ పక్ష ఉపనేత గౌరవ్ గొగోయ్

- పిఒకెను ఎందుకు స్వాధీనం చేసుకోలేదు?
- ప్రధాని మోదీ ఎవరికి లొంగిపోయారు?
- పహల్గామ్ ఘటనకు అమిత్ షాదే బాధ్యత

లోక్‌సభలో ఆపరేషన్ సిందూర్‌పై చర్చలో కాంగ్రెస్ నిలదీత

**న్యూఢిల్లీ:** ఆపరేషన్ సిందూర్‌లో తమ లక్ష్యం యుద్ధం కాదని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారని, యుద్ధం ఎందుకు కాకూడదని కాంగ్రెస్ లోక్‌సభ పక్ష ఉప నాయకుడు గౌరవ్ గొగోయ్ ప్రశ్నించారు. తమ లక్ష్యం పాకిస్థాన్ నుంచి భూమిని స్వాధీనం చేసుకోవడం కాదని అన్నారని, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ ఇప్పుడు తీసుకోకపోతే, ఇంకెపుడు తీసుకుంటారని నిలదీశారు. ఉరి, పుల్వామా దాడి తరువాత కూడా ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేశామని చెప్పారని, ఆ తరువాత కూడా పాకిస్థాన్ ఇంతటి దుస్సాహసానికి ఎందుకు పాల్పడిందని, 20 ఏళ్ళలో పహల్గామ్‌లో భారత పౌరులపై ఇంత దారుణానికి ఎందుకు ఒడిగడిందని విరుచుకుపడ్డారు. బిజెపి ప్రభుత్వ హయాంలోనే ఉరి, పుల్వామా, పహల్గామ్ ఘటనలు జరిగాయని విమర్శించారు. 'ఆపరేషన్ సిందూర్' పోరాటంలో మన యుద్ధ విమానాలు ఎన్ని కూలిపోయాయి? పాకిస్థాన్‌పై చేపట్టిన సైనికచర్యను నిలిపివేయడానికి ముందు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎవరికి లొంగిపోయారు? అని గొగోయ్ నిలదీశారు"ఐదు లేదా ఆరు యుద్ధ విమానాలు కూలిపోయాయని ట్రంప్ చెబుతున్నారు,ఒక్కొక్క యుద్ధ విమానం కోట్ల కోట్ల రూపాయలు ఖరీదు ఉంటుంది, అందుకే రక్షణ మంత్రి నోటి వెంట అసలు నిజాలు తెలుసుకోవాలనుకుంటున్నాం, ఎన్ని యుద్ధ విమానాలు కూలిపోయాయో మీరు దేశానికి సమాధానం చెప్పితీరాల్సిందే" అని కాంగ్రెస్‌పార్టీ డిమాండ్ చేసింది. పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడికి అవకాశం కల్పించిన భద్రతా వైఫల్యాలకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా బాధ్యత వహించాలని ఆపరేషన్ సిందూర్‌పై సోమవారం ప్రత్యేక చర్చ సందర్భంగా లోక్‌సభలో కాంగ్రెస్‌పార్టీ ఉప నాయకుడు గౌరవ్ గొగోయ్ డిమాండ్ చేశారు. "భారత్–పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ అమలు చేయడానికి తాను వాణిజ్యాన్ని ఒక ఆయుధంగా ఉపయోగించాను" అని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ 26 సార్లు చెప్పడాన్ని కూడా సభలో ప్రస్తావిస్తూ అధికారపార్టీని నిశితంగా విమర్శించారు. పాకిస్థాన్ గను క భారత్ ముందు మోకాళ్ళపై నిలబడేందుకు సిద్ధంగా ఉంటే మీరు ఎందుకు ఆపరేషన్ సిందూర్‌ను ఆపేశారు? ఈ ఆపరేషన్‌ను ఆపడానికి ముందు ఎవరికి మీరు లొంగిపోయారు? అనే విషయాలను దేశంలోని ప్రతిపక్షాలు ప్రధాన మంత్రి నోటి మాటలద్వారా తెలుసుకోవాలనుకుంటోందని అన్నారు. ప్రభుత్వం వద్ద చాలా సమాచారం ఉన్నాగానీ, పహల్గామ్‌లోకి ఉగ్రవాదులు ఏ విధంగా ప్రవేశించారో రక్షణమంత్రి చెప్పడంలేదని విమర్శించారు. 100 రోజులు దాటిపోయిన తర్వాత కూడా ఉగ్రవాదులను న్యాయస్థానం ముందు నిలబెట్టలేదని దేశం ఈ విషయాలన్నీ తెలుసుకోవాలనుకుంటోందన్నారు.'పహల్గామ్ ఉగ్రదాడికి దీటుగా బలమైన, విజయవంతమైన, నిర్ణయాత్మకమైన తరువాయి 2లో



## ప్రపంచ చెస్ రారాణి
# దివ్యా దేశ్‌ముఖ్

- మహిళల వరల్డ్ ఛాంపియన్‌షిప్ కైవసం చేసుకున్న అత్యంత పిన్న వయస్కురాలుగా, తొలి భారతీయ క్రీడాకారిణిగా రికార్డు
- తుది వరకూ పోరాడిన కోనేరు హంపికి రన్నరప్ ట్రోఫీ

**బటూమీ (జార్జియా):** భారత టీనేజ్ చెస్ సంచలనం విద్యా దేశ్‌ముఖ్ మహిళల ప్రపంచ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. మరో భారతీయురాలు, 'తెలుగు తేజం' కోనేరు హంపితో జరిగిన ఫైనల్‌లో అద్వితీయ ప్రతిభ కనబరచి, విజేతగా నిలిచింది. మహిళల వరల్డ్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకొన్న అతి పిన్న వయస్కురాలిగా, తొలి భారతీయురాలిగా చరిత్ర పుటల్లో చోటు సంపాదించింది. అంతేగాక, ఈ విజయంతో గ్రాండ్‌మాస్టర్ హోదాను కూడా అందుకుంది. నాగపూర్‌కు చెందిన దివ్యకు హంపి టైటిల్ పోరులో గట్టిపోటీనే ఇచ్చింది. ఫలితంగా, శని, ఆది వారాల్లో జరిగిన గేమ్‌లు డ్రా అయ్యారు. ఇద్దరూ సమవుజ్జీలుగా నిలవడంతో, ఫలితం కోసం టైబ్రేకర్ అనివార్యమైంది. ప్రపంచ చాంపియన్‌షిప్‌ను మినహాయించి, తరువాయి 12లో



## ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు
# ఉగ్రవాదులు హతం

- పహల్గామ్ ఉగ్రదాడి నిందితులను మట్టుబెట్టిన పారా కమాండర్లు
- 'ఎక్స్'లో ధృవీకరించిన ఆర్మీకి చెందిన 'చినార్ కోర్'

**శ్రీనగర్ :** కశ్మీర్‌లోని శివారులో శ్రీనగర్ అటవీ ప్రాంతంలో సోమవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో పహల్గామ్ ఉగ్రదాడి నిందితులు ముగ్గురు ఆర్మీలోని ఉన్నత శ్రేణి పారా కమాండర్ల చేతిలో హతం అయ్యా రు. ఈ విషయా న్ని ఇక్కడ అధికారులు వెల్లడించారు. అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం...ఏప్రిల్ 22న జరిగిన పహల్గామ్ ఉగ్రదాడిలో సూత్రధారియైన సులేమాన్ అలియాస్ ఆసిఫ్ భద్రతా బలగాలు చేపట్టిన ఆపరేషన్ కోడ్‌నేమ్ 'ఆపరేషన్ మహాదేవ్'లో మట్టుబెట్టారు. పహల్గామ్ ఉగ్రదాడి నిందితులు వినియోగిస్తున్న శాటిలైట్ సెల్‌ఫోన్ సాంకేతిక సిగ్నల్ ఆధారంగా జరిపిన అన్వేషణలో దొరికిపోయారు. సూత్రధారి సులేమాన్ అలియాస్ ఆసిఫ్‌తో పాటు మరణించిన మరో ఇద్దరు ఉగ్రవాదులు గత ఏడాది జరిగిన సోన్‌మార్గ్ టన్నెల్ దాడి లో నిందితులుగా ఉన్న జిబ్రాన్, హమ్జా ఆఫ్ఘానీ ఉన్నారు. పర్యాటక ప్రాంతమైన పహల్గామ్‌లోని బైసారన్ తరువాయి 2లో

## అటవీ హక్కులు, పోడు భూ పట్టాలపై
# ప్రత్యేక ఎస్‌టి కమిషన్

- నాయక్‌పోడులను ప్రత్యేక ట్రైబ్‌గా గుర్తింపు
- తెలంగాణ రాష్ట్ర 'గిరిజన సలహా మండలి' సమావేశం తీర్మానం



ప్రజాపక్షం/హైదరాబాద్

సామాజిక అటవీ హక్కులు,పోడు భూముల పట్టాల పంపిణీ విషయంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించాలని, ప్రత్యేక ఎస్‌టి కమిషన్‌ను ఏర్పాటు చేయాలని, నాయక పోడులను ప్రత్యేక ట్రైబ్‌గా గుర్తించాలని తెలంగాణ రాష్ట్ర 'గిరిజన సలహా మండలి' సమావేశం తీర్మానించింది. సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఆధ్వర్యంలో హైదరాబాద్, మాసబ్ ట్యాంక్‌లోని దామోదర సంజీవయ్య సంక్షేమ భవన్‌లో ఏడవ 'గిరిజన సంక్షేమ సలహా మండలి' సమావేశం సోమవారం జరిగింది. ఈ సమావేశంలో డిప్యూటీ స్పీకర్ రామచంద్రనాయక్, అదిలాబాద్ ఎంపి తరువాయి 12లో

# గొప్ప దార్శనికుడు జైపాల్ రెడ్డి

- తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆయన పాత్ర ఎనలేనిది
- వర్ధంతి సభలో కొనియాడిన మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి




ప్రజాపక్షం/హైదరాబాద్

దివంగత మాజీ కేంద్రమంత్రి ఎస్.జైపాల్ రెడ్డి గొప్ప దార్శనికుడని హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. నెక్లెస్ రోడ్‌లోని స్మృతి స్థలంలో ఎస్. జైపాల్ రెడ్డి 6వ వర్ధంతి సందర్భంగా ఆయన మెమోరియల్ వద్ద పుష్పగుచ్ఛాలు సమర్పించి, ఘనంగా నివాళులర్పించారు. జైపాల్ రెడ్డికి నివాళులు అర్పించిన వారిలో మంత్రులతో పాటు సిఎం సతీమణి గీత, పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, జైపాల్ రెడ్డి కుటుంబ సభ్యులు ఉన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో జైపాల్ రెడ్డి పాత్ర ఎనలేనిదన్నారు. అభివృద్ధే లక్ష్యంగా రాజకీయాలకు అతీతంగా గణనీయమైన సేవలందించారని కొనియడారు. ముఖ్యంగా యువతరానికి ఆయన ఆదర్శమన్నారు. విద్యార్థి దశ నుండి ఒక నాయకునిగా, కేంద్ర మంత్రిగా అందించిన తరువాయి 2లో

# ఆర్థిక సంక్షోభంలో జిహెచ్‌ఎంసి




- వేతనాలు, పెన్షన్‌లు, అప్పుల చెల్లింపులకు రూ.400 కోట్లు కావాల్సిందే
- వచ్చే ఆదాయం రూ.100 కోట్ల లోపే
- సర్కార్ చేయూతనిస్తే తప్ప బండి ముందుకు సాగని పరిస్థితి
- అప్పుల కుప్పగా మార్చిన బిఆర్ఎస్ సర్కార్

ప్రజాపక్షం/హైదరాబాద్

పీకల్లోతు ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన మహానగర పాలక సంస్థ(జిహెచ్‌ఎంసి)లో కాసుల కటకట నెలకొంది. ప్రతినెల మొదటి తేదీ వచ్చిందంటే సిబ్బందికి వేతనాలు, అప్పుల వాయిదాలు చెల్లించేందుకు గల్లాపెట్టే సర్దుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. గత బిఆర్ఎస్ ప్రభుత్వం మోపిన అప్పుల భారంతో జిహెచ్‌ఎంసి సతమతమవుతోంది. ఉమ్మడి రాష్ట్రంలో 2014 సంవత్సరానికి ముందు రూ.12 వందల కోట్ల బ్యాంకు డిపాజిట్లతో జిహెచ్‌ఎంసి ఖజానా ఎప్పుడు నిండుగా ఉండేది. బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జిహెచ్‌ఎంసి నిధులను జలమండలికి, ఆర్‌టిసికి ఫలహారంలా పంచిపెట్టింది. దీనికి తోడు ప్రభుత్వం చేపట్టాల్సిన ప్రధాన ప్రాజెక్టులైన వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి కార్యక్రమం(ఎస్‌ఆర్‌డిపి) తరువాయి 12లో

## థాయ్‌లాండ్–కాంబోడియా
# కాల్పుల విరమణకు ఓకె

- పుత్రజయ కేంద్రంగా ఇరు దేశాల నాయకుల మధ్య జరిగిన సంప్రదింపులు
- ఆదివారం అర్ధరాత్రి నుంచే కాల్పుల విరమణ ఒప్పందం అమలులోకి వచ్చినట్లు మలేషియా ప్రధాని ప్రకటన



**పుత్రజయ :** నాలుగు రోజులుగా సరిహద్దు ఘర్షణలతో ఉద్రిక్తతలు సృష్టించిన థాయ్‌లాండ్–కాంబోడియా దేశాలు బేషరతుగా తక్షణం కాల్పుల విరమణకు అంగీకరించాయి. మలేషియా దేశ నగరం పుత్రజయ కేంద్రంగా థాయ్–కాంబోడియా దేశాల నాయకులమధ్య కాల్పుల విరమణపై సంప్రదింపులు జరిగాయి. ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత కాల్పుల విరమణ ఒప్పందం అమలులోకి వచ్చిందని మలేషియా ప్రధాన మంత్రి అన్వర్ ఇబ్రహీం చెప్పారు. మలేషియాలో చర్చలు జరపడానికి రెండు దేశాల నాయకులు అంగీకరించారు. ఈ చర్చలు విజయవంతంగా పూర్తయ్యాయి. రెండు దేశాలూ తరువాయి 12లో

## అక్రమ సరోగసీ, గురకుల ఫుడ్ పాయిజనింగ్‌పై
# హెచ్‌ఆర్‌సి సుమోటో కేసులు

ప్రజాపక్షం/హైదరాబాద్



రాష్ట్రంలో తీవ్ర కలకలం రేపిన అక్రమ సరోగసి ఘటనతో పాటు నాగర్ కర్నూల్ జిల్లా ఉయ్యాలవాడ మహాత్మ జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలలో చోటు చేసుకున్న ఫుడ్ పాయిజనింగ్ సంఘటనను తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ సుమోటో కేసులను స్వీకరించింది. సికింద్రాబాద్‌లోని యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ , హైదరాబాద్, విజయవాడ , విశాఖపట్నం అంతటా ఉన్న అనుబంధ క్లినిక్‌లలో చట్టవిరుద్ధమైన అనైతిక పద్ధతులకు సంబంధించి ఈనెల 27 28, తేదీలలో వివిధ వార్తాపత్రికలలో తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## జర్మనీలో పట్టా తప్పిన రైలు
### ముగ్గురు మృతి : 50 మందికి గాయాలు



**బాన్:** జర్మనీ నైరుతి ప్రాంతంలో జరిగిన రైలు ప్రమాదంలో ముగ్గురు మరణించారు. మరో 50 మంది గాయపడ్డారు. వీరిలో 25 మంది తీవ్రంగా గాయపడ్డారు. మరణించినవారిలో ఇద్దరు రైల్వే కంపెనీ ఉద్యోగులే ఉన్నారు. బాడెన్–ఉర్టెంబర్గ్ ఫెడరల్‌స్టేట్‌లోని రీడ్లింగెన్ పట్టణ సమీపంలో రాత్రి 9.30 గంటలకు రైలు పట్టాలు తప్పింది. రెండు బోగీలు పట్టాలనుండి పక్కకు జారిపోవడంతో ప్రమాదం సంభవించింది. ఆ సమయంలో రైలులో 100 మంది ప్రయాణికులు ఉన్నారు. అత్యవసర బృందాలు, అగ్నిమాపకసిబ్బంది, సహాయబృందాలు తక్షణం ఆ ప్రాంతానికి చేరుకుని ప్రయాణికులకు సహాయం చేశాయి. వారిని బోగీల్లోంచి బయటకు తీశారు. బహుశా ఈ ప్రాంతంలో కొండచరియలు నుండి మట్టిపెళ్లలు విరిగి పడటంవల్లనే రైలు పట్టాలు తప్పి ఉండవచ్చునని పోలీసులు ప్రాథమిక అంచనావేశారు.

## ఒప్పందంలో అసమానత్వం : ఫ్రాన్స్ మంత్రి విమర్శ
# ఇయు సరుకులపై 15శాతం ట్రంప్ సుంకం

**బ్రెజెల్స్:** అమెరికా–యూరోపియన్ యూనియన్ మధ్య ఆదివారంనాడు వాణిజ్య ఒప్పందం కుదిరింది. యూరోపియన్ యూనియన్ నుండి అమెరికాకు వచ్చే సరుకులపై 15 శాతం టారిఫ్‌లు విధించేందుకు ఈ ఒప్పందం కుదిరింది. ఐతే ఈ ఒప్పందంలో సమానత్వం లేదని ఫ్రాన్స్ విమర్శించింది. అదే సమయంలో జర్మనీ కార్లకు పెనీలపై కూడా ఈ ఒప్పందం వల్ల సుంకాల భారం పడుతుంది. కానీ, "ఇది చాలా మంచి ఒప్పందం, ఈ ఒప్పందం వల్ల అందరికీ మేలు జరుగుతుంది" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. యూరోపియన్ యూనియన్ అధినేత్రి ఉర్సులా వోండర్‌లేయన్ కూడా ఈ ఒప్పందం ఎంతో బాగుందని ప్రశంసించారు. అదేవిధంగా ఈ ఒప్పందంతోపాటు అమెరికాలో యూరోపియన్ యూనియన్ 600 బిలియన్ డాలర్ల పెట్టుబడులు కూడా సమకూరుస్తుందని ట్రంప్ చెప్పారు. అదేవిధంగా మరో 150 బిలియన్ డాలర్ల మేరకు ఇంధన వనరుల కొనుగోళ్లు కూడా చేసేందుకు యూరోపియన్ యూనియన్ అంగీకరించింది. ఈ విధంగా అమెరికాకు అదనంగా మరో 750 బిలియన్ డాలర్ల లాభం కలిగింది. ఉర్సులా వోండర్ లేయన్ కూడా ట్రంప్‌తో రాజీపడ్డారన్న విమర్శలు చెలరేగాయి. ఐతే ఈ ఒప్పందం ఎంతో కీలకమైనదని, దీనివల్ల అటు యూరప్ దేశాలపై అమెరికా ఆంక్షలు, ఇటు ఇ.యు ప్రతీకార సుంకాల ప్రమాదం కూడా తప్పిపోయిందని, లేకపోతే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తీవ్ర అస్థిరతకు గురై ఉండేదని విశ్లేషకులు భాష్యం చెప్పారు. స్కాట్‌లాండ్‌లో ట్రంప్‌కు ఉన్న సొంత గోల్ఫ్‌కోర్స్ భవంతిలో ఉర్సులా వోండర్ లేయన్‌తో ఈ చర్చలు జరిగాయి.





### గాజా సంక్షోభం, వాణిజ్యంపై ట్రంప్–స్టార్మర్ భేటీ

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, బ్రిటన్ ప్రధాన మంత్రి కీవ్ స్టార్మర్ సోమవారం పొద్దుపోయాక పశ్చిమ స్కాట్‌లాండ్‌లోని ఒక లగ్జరీ గోల్ఫ్ రిసార్ట్‌లో సమావేశమయ్యారు. స్కాట్‌లాండ్ నైరుతి స్కాట్‌లాండ్‌లోని టర్న్‌బెర్రీ సమీపంలో ట్రంప్‌కు ఉన్న సొంత గోల్ఫ్ ప్రాపర్టీలోనే వీరి సమావేశం జరిగింది. స్టీలు ఉత్పత్తులు ఎగుమతులకు సంబంధించిన టారిఫ్‌లపై ఒప్పందంతోపాటు తొలుత కెనడాలో జి–7 సమావేశంలో చేసుకున్న వాణిజ్య ఒప్పందాన్ని ఏ విధంగా అమలు చేయాలో చర్చించారు. దీంతోపాటు గాజాలో సంక్షోభం ఈ రెండు అంశాలను వారు ప్రధానంగా చర్చించారు. ఆదివారం పొద్దుపోయాక యూరోపియన్ యూనియన్‌తో జరిగిన వాణిజ్య ఒప్పందాన్ని స్టార్మర్ ఆహ్వానించగలరని ట్రంప్ ఆశాభావం వ్యక్తం చేయగా ఈ విషయంలో తాను జోక్యం చేసుకోదల్చుకోలేదని స్టార్మర్ అన్నారు. స్టార్మర్‌ను కలిసేముందు ట్రంప్ మాట్లాడుతూ, ఆయనతో సమావేశం తనకు ఎంతో సంతోషంగా ఉంటుందన్నారు. బ్రిటన్ వాణిజ్య,వ్యాపారాలమంత్రి జోనాథన్ రేనాల్డ్స్ మాట్లాడుతూ, ట్రంప్‌తో సమావేశం ఒక అత్యంత అరుదైన అవకాశమని అన్నారు. ట్రంప్–స్టార్మర్ సమావేశం సందర్భంగా కట్టుదిట్టమైన భారీ భద్రత ఏర్పాట్లు చేశారు. సముద్ర తీరాల్లో భారీ భద్రత ఏర్పాట్లు చేశారు. హెలికాప్టర్ల ద్వారా సర్వే కార్యక్రమాలు నిరంతరం కొనసాగించారు. గాజాలో సంక్షోభం గురించి కూడా వారిద్దరూ చర్చించారు. పాలస్తీనా స్వయంప్రతిపత్తిని గుర్తించాలని స్టార్మర్‌పై లేబర్‌పార్టీ నాయకులు, ప్రతిపక్ష కన్జర్వేటివ్‌లు స్టార్మర్‌పై తీవ్ర ఒత్తిడి చేస్తున్నారు. 139 మంది లేబర్‌పార్టీ ఎంపీలతోపాటు మొత్తం 221 మంది ఎంపీలు పాలస్తీనాను గుర్తించాలని ఒత్తిడి చేస్తూ ఒక లేఖపై సంతకం చేశారు. వచ్చేవారం పాలస్తీనా సమస్యపై ఐక్యరాజ్యసమితి ప్రధాన సమావేశం నిర్వహిస్తున్న తరుణంలో ఈ లేఖ ప్రాధాన్యం సంతరించుకుంది. సెప్టెంబరునెలలో పాలస్తీనాను స్వతంత్ర రాజ్యంగా గుర్తిస్తామని మేక్రాన్ ఇప్పటికే ప్రకటించారు.

## దక్షిణ కొరియా సయోధ్య యత్నాలను తిరస్కరించిన ఉత్తర కొరియా

**ప్యాంగ్యాంగ్:** కొరియా దేశాలు రెండూ సయోధ్యతో మెలగాలని దక్షిణ కొరియా ఆకాంక్ష వ్యక్తం చేసింది. కొరియా యుద్ధం ముగిసి సరిగ్గా జులై 27వ తేదీ నాటికి 72 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా దక్షిణ కొరియా ఈ ఆకాంక్ష వ్యక్తం చేసింది. దక్షిణ కొరియా అధ్యక్షుడూ ఇటీవల బాధ్యతలు తీసుకున్న లీ–జే మ్యుంగ్ ఇచ్చిన సయోధ్య పిలుపును ఉత్తర కొరియా చాలా గట్టిగా వ్యతిరేకించింది. గతనెల నాలుగోతేదీన అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన లీ–జే మ్యుంగ్ పొరుగుదేశంతో సయోధ్యగా మెలిగేందుకు ఒక ప్రతిపాదన చేశారు. దక్షిణ కొరియాకు, అమెరికాకు మధ్య ఉన్న గాఢమైన భద్రతా–రక్షణపరమైన అనుబంధాన్ని ఉత్తర కొరియా నాయకుడు కిమ్ జోంగ్ ఉన్ సోదరి కిమ్ యో జోంగ్‌తోపాటు ఇతర ఉన్నతాధికారులు కూడా తీవ్రంగా విమర్శించారు. దౌత్య యత్నాలు పునరుద్ధరణపై తమకు ఎలాంటి ఆసక్తి లేదని ఉత్తర కొరియా నాయకులు తోసిపుచ్చారు. దక్షిణ కొరియాలో కరడుగట్టిన సంప్రదాయవాది యూన్ సుక్ యోల్ అధ్యక్ష బాధ్యతల నుండి పదవీచ్యుతుడైన తర్వాత ఎన్నికల్లో లీ–జే మ్యుంగ్ విజయం సాధించారు. ఉత్తర కొరియాతో తీవ్రంగా దెబ్బతిన్న సంబంధాలను పునరుద్ధరిస్తామని ఆయన ఎన్నికల సందర్భంగా ప్రతిజ్ఞచేశారు. ఈ ప్రయత్నాల్లో భాగంగా మ్యుంగ్ ఉత్తర కొరియాకు తాజా ప్రతిపాదన చేశారు. అనేక సంవత్సరాలుగా కొరియా దేశాలమధ్య ఉద్రిక్తతలు తీవ్రస్థాయిలో పెరుగుతూ వస్తున్నాయి. యూన్ సుక్ యోల్ పదవిలో ఉండగా ఈ ఉద్రిక్తతలు పరాకాష్ఠకు చేరాయి. ప్రతిపక్షంలో నాయకులు ఉత్తర కొరియాకు ఏజంట్లుగా పనిచేస్తున్నారని యూన్ సుక్ యోల్ తీవ్ర ఆరోపణలు చేశారు కూడా. ఆదివారంనాడు ఉత్తర కొరియా స్వాతంత్ర్య వేడుకలు చేసుకుంది. యావత్ జాతి కిమ్–2 సుంగ్, ఛైర్మన్ కిమ్ జోంగ్–2 విగ్రహాలవద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులు అర్పించారు. త చిత్త శుద్ధిని పునరుద్ఘాటించారు. పితృదేశ విముక్తిని గుర్తుచేసుకుంటూ కవాతులు నిర్వహించారు. అమరవీరుల సమాధులవద్ద నివాళులు అర్పించారు.

# అమెరికా–చైనా మధ్య కీలక వాణిజ్య చర్చలు



**స్టాక్‌హోం:** ప్రపంచంలో రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలైన అమెరికా–చైనా ఉన్నతాధికారుల మధ్య స్టాక్‌హోంలో కీలకమైన వాణిజ్య చర్చలు సోమవారంనాడు జరిగాయి. రెండు దేశాలమధ్యా దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న వాణిజ్య సమస్యలపై ఈ సమావేశంలో చర్చించారు. కనీసం ప్రస్తుతం ఉన్నస్థాయిలోనే టారిఫ్‌లను కొనసాగించాలని దాదాపు ఒక నిర్ణయానికి వచ్చారు. ఐతే అమెరికా–చైనా దేశాధ్యక్షులు ట్రంప్–జీ జిన్‌పింగ్ ఈ ఏడాది చివరినాటికి ముఖాముఖీ సమావేశంలో తుది నిర్ణయం తీసుకుంటారు. స్వీడన్ రాజధాని స్టాక్‌హోంలో ఈ రెండు దేశాలమధ్యా ఈ ఏడాది ఇలా సమావేశం జరగడం ఇది మూడో సారి. చైనా నుండి వచ్చే దిగుమతులపై 145 శాతం మేరకు భారీ ఎత్తున సుంకాలు విధించి ట్రంప్ ప్రపంచ వాణిజ్యంలో పెద్ద సమస్య తీసుకు వచ్చారు. యూరోపియన్ యూనియన్‌తో వాణిజ్య చర్చలకు స్కాట్‌లాండ్‌కు వెళ్ళేముందుగా శుక్రవారంనాడు ట్రంప్ మాట్లాడుతూ, చైనాతో ఒప్పందం ముగిస్తామన్నారు. ఈ నేపథ్యంలో చైనా ఉప ప్రధానమంత్రి హే లీఫెంగ్, అమెరికా కోశాధికారి స్కాట్ బెస్సెంట్‌మధ్య స్టాక్‌హోంలో చర్చలకు రంగం సిద్ధమైంది. గత ఏడాది చైనాతో జరిగిన వాణిజ్యంలోఅమెరికాకు 295.5 బిలియన్ డాలర్ల లోటు ఏర్పడిందని స్కాట్ బెస్సెంట్ చెప్పారు. ఈ లోటును భర్తీచేసుకోవాల్సి ఉందన్నారు. ట్రంప్ అధికారంలోకి వచ్చినప్పటినుండీ ఈ రెండు దేశాలమధ్యా నువ్వా–నేనా అన్నరీతిలోవాణిజ్య యుద్ధం కొనసాగుతోంది. ట్రంప్ సుంకాలు విధిస్తే చైనా కూడా వెనక్కు తగ్గకుండా అదేస్థాయిలో అమెరికాపై ఎదురుదాడిచేసి సుంకాలు విధించింది. దీంతో ట్రంప్ కొంత రాజీ ధోరణి పాటించారు. ఈ వ్యవహారంపై ఈ జూన్ నెలలో ప్రాథమికంగా చర్చల్లో ఒక ఒప్పందం కుదిరింది. తర్వాత ట్రంప్ ఆగస్టు 12వ తేదీలోపు టారిఫ్‌లపై తుది ఒప్పందం జరగాలని షరతు విధించారు. చైనా ఉప ప్రధానమంత్రి హే లీఫెంగ్ నాయకత్వంలో ఒక బృందం జులై 27 నుండి మూడు రోజులపాటు స్వీడన్ రాజధాని స్టాక్‌హోంలో మకాంవేసి ఈ చర్చలపైనే దృష్టి సారించింది. ఇందులోభాగంగా సోమవారం అమెరికా–చైనా ఉన్నతస్థాయి ప్రతినిధులమధ్య చర్చలు జరిగాయి. వాణిజ్య చర్చల్లో రెండు దేశాలమధ్య పరస్పర సమాన గౌరవం ఉండాలని ఈ సందర్భంగా చైనా ఉప ప్రధానమంత్రి హే లీఫెంగ్ అమెరికా బృందానికిమరోసారి స్పష్టం చేశారు. సమానత్వం –బహుళప్రయోజనాలప్రాతిపదికపైనే ఏ ఒప్పందమైనాజరగాలనిచైనాప్రతినిధిబృందం వెల్లడించిది. ఈనిర్ణయంతోనే చైనా బృందం చర్చలకు వచ్చింది.

## బ్యాంకాక్ మార్కెట్‌లో కాల్పులు: ఆరుగురు మృతి

**బ్యాంకాక్:** థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లోని ఒక మార్కెట్‌లో సోమవారం సాయుధ దుం డగుడు కాల్పులు జరిపారు.ఐదుగురు భద్రతా సిబ్బందితోపాటు గన్‌మెన్ కూడా మరణించాడు. మెట్రోపాలిటన్ పోలీస్ బ్యూరో డిప్యూటీ కమీషనర్ ఛారిన్ గోపట్టా మాట్లాడుతూ, కాల్పులు జరిపిన సాయుధుడు తుపాకీతో తన ప్రాణం తీసుకున్నాడని చెప్పారు. కాల్పులు జరిపిన వ్యక్తి ఎవరు? ఉగ్రవాదా? ఇంకెవరైనానా? అనే విషయంపై పోలీసులు ఆరా తీస్తున్నారు. కాల్పులకు పాల్పడినవ్యక్తి ఆచూకీ,అతడివివరాలు సేకరించే పనిలో నిమగ్నమైనట్లు గోపట్టా చెప్పారు. కాల్పుల్లో మరణించినవారంతా మార్కెట్ సెక్యూరిటీ గార్డులేననీ, మార్కెట్లో ఉన్న పర్యాటకులు ఎవ్వరూ మరణించలేదు, గాయపడలేదని చెప్పారు. థాయ్‌లాండ్‌కు పర్యాటకులే ప్రాణం. వారివల్లనే థాయ్‌లాండ్‌కు భారీగా ఆర్థిక వనరులు సమకూరుతున్నాయి.



అందువల్ల పర్యాటకుల శ్రేయస్సును ప్రధానంగా అక్కడి ప్రభుత్వం ఎంచుకుంది. తుపాకీ కాల్పులు గానీ, సొంతంగా తుపాకీలు ఉంచుకోవడంగానీ థాయ్‌లాండ్‌లో చాలా సాధారణమైన విషయం. 2023 అక్టోబరులో కూడా సెంట్రల్ బ్యాంకాక్‌లోని ఒక లగ్జరీ మాల్‌లో 14 ఏళ్ళ బాలుడు మోడిఫైడ్ గన్‌తో ఇద్దరిని కాల్చి చంపాడు. మరో ఐదుగురిని గాయపరిచాడు. తూర్పు థాయ్‌లాండ్‌లోని ఒక నర్సరీలో ఒక మాజీ పోలీసు అధికారి కూడా తుపాకీతో, కత్తితో దాడులు చేసి 22 మంది పిల్లలు సహా 36 మందిని చంపేశాడు.

## వాణిజ్యంతో సంబంధం లేదు
(మొదటి పేజీ తరువాయి)

ద్వారా దాడుల విరామం జరిగిందన్నారు.పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడుల తర్వాత భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌ను ప్రపంచంలో ఉన్న 190 దేశాలలో కేవలం మూడు దేశాలు మాత్రమే ఐక్యరాజ్యసమితిలో వ్యతిరేకించాయని కూడా ఆయన చెప్పారు. ఉగ్రవాదులు దాడిచేస్తే ఏ దేశమైనా తమను తాము రక్షించుకునే హక్కు ఉందన్న విషయాన్ని అన్నిదేశాలూ సమర్థించాయన్నారు. భారతదేశ దౌత్య కార్యకలాపాలకు అన్నిదేశాల నుండీ మద్దతు లభించిందని చెప్పారు. భారత్ హద్దులు దాటి వచ్చి మితిమీరి ప్రవర్తిస్తే ఎలాంటి పరిణామాలు సంభవిస్తాయో అందరికీ తెలిసేవిధంగా చాలాస్పష్టమైన సందేశాన్ని పహల్గామ్ దాడి అనంతర చర్యలద్వారా ప్రపంచానికి భారత ప్రభుత్వం తెలియజేసిందని ఆయన అన్నారు. భారతదేశం తీసుకున్న దౌత్య చర్యల కారణంగానే "ద రెసిస్టెన్స్ ఫ్రంట్ (టిఆర్ఎఫ్)ను అమెరికా ఒక ఉగ్రవాద సంస్థగా ప్రకటించిందన్నారు. పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడి తర్వాత భారతదేశం ఎంతో ప్రశంసనీయమైనరీతిలో దౌత్య చర్యలు తీసుకుందని జైశంకర్ చెప్పారు. ఆపరేషన్ సిందూర్ చేసిన తర్వాత ఆ విషయాలను ప్రపంచానికి స్పష్టంగా తెలియజేయడానికి అన్ని విధాలుగా దౌత్యమార్గాలలో చర్యలు తీసుకున్నామన్నారు. ఈ దౌత్యచర్యలవల్ల ఐక్యరాజ్యసమితిలో ఉన్న 190 సభ్యదేశాలలో మూడు దేశాలు మాత్రమే వ్యతిరేకించాయని, మిగిలిన అన్నిదేశాలూ భారత్ చర్యలను సమర్థించాయని, ఆ విధంగా దేశం దౌత్యవిజయం సాధించిందన్నారు."ఉగ్రవాదాన్ని సహించేదిలేదు, ఏ దేశంమీద దాడి జరిగినా ఆ దేశం తనను తాను రక్షించుకునేందుకు హక్కు ఉందనే విషయానికి ప్రపంచవ్యాప్తంగా బ్రహ్మాండమైన గుర్తింపు వచ్చింది, భారతదేశం ఈ విషయంలో స్పష్టమైన సందేశాన్ని ప్రపంచానికి చాటిచెప్పింది, ఆపరేషన్ సిందూర్ ప్రారంభించినప్పుడు మనం లక్ష్యాలు నిర్దేశించుకుని దాడులు చేశాం, ఉగ్రవాదులు పాకిస్థాన్‌లో నిర్మించుకున్న మౌలిక సదుపాయాలను ధ్వంసం చేసేందుకు కట్టుబడ్డాం, పాకిస్థాన్ ఆక్రమించిన కశ్మీరు భూభాగంలో ఉన్న లక్ష్యాలను గురిచూసి నాశనం చేశాం, సామాన్య ప్రజలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండాబాధ్యతాయుతంగాచర్యలు తీసుకున్నాం"అని జైశంకర్ చెప్పారు.

## ఉగ్రవాదులు హతం
(మొదటి పేజీ తరువాయి)

పచ్చిక మైదానాల్లో ప్రకృతిరమణీయ దృశ్యాలను ఆస్వాదిస్తున్న సమయంలో అక్కడకు చేరుకున్న ఉగ్రవాదులు 26మంది టూరిస్టులను అత్యంత అమానుషంగా కాల్చి చంపారు. ఈ నేపథ్యంలో మే 7న 'ఆపరేషన్ సిందూర్'ను ప్రారంభించిన భారత భద్రతా బలగాలు పాకిస్థాన్‌లోని ఉగ్రస్థావరాలను ధ్వంస చేసిన విషయం తెలిసిందే. కాగా, ఈ ప్రాంతంలో మరొక ఉగ్రవాద బృందం ఉన్నట్లు ఆర్మీ అదనపు బలగాలు, ఇతర భద్రతా బలగాలు సూచించిన నిఘా ఇన్‌పుట్స్ ఆధారంగా పారా కమాండర్లు హుటాహుటిన అక్కడకు చేరుకున్నట్లు అధికారులు చెప్పారు. 2024 అక్టోబర్‌లో గంగన్‌గిర్‌లో వద్దనున్న సోన్‌మార్గ్ టన్నెల్ ప్రాజెక్ట్‌పై జరిపిన దాడులలో జిబ్రాన్ పాల్గొని ఒక డాక్టర్ సహా ఏడుగురిని చంపారు. ఎం4 కార్బన్ రైఫిల్, రెండు ఎకెరైఫిల్స్, ఇతర ఆయుధాలను ఎన్‌కౌంటర్ స్థలంలో స్వాధీనం చేసుకున్నారు. హతమైన ఉగ్రవాదుల మృతదేహాలను గుర్తించే ప్రక్రియ, చట్టపరమైన లాంఛనాలు, అంతిమకర్మ కోసం స్థానిక పోలీసులకు అప్పగించారు. అధికారులు తెలిపిన ప్రకా రం... రాత్రి 1130గంటల సమయంలో 24రాష్ట్రీయ రైఫిల్స్, 4పారా యూనిట్లకు చెందిన సిబ్బందితో కూడిన ఒక పార్టీ ముగ్గురు ఉగ్రవాదుల బృందాన్ని కనిపెట్టింది. ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (కశ్మీర్ జోన్) వికె.బిర్దీ మాట్లాడుతూ చివరి నివేదికల వరకు చూస్తే ఇది సుదీర్ఘకాలిక ఆపరేషన్ అన్నారు.దీనికిముందు శ్రీనగర్‌కు చెందిన 'చినార్ కార్ప్స్' ఒక 'ఎక్స్' పోస్ట్‌లో 'ఆపరేషన్ మహాదేవ్' కింద ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారని తెలిపింది. తీవ్రమైన కాల్పుల్లో ముగ్గురు ఉగ్రవాదులు తారసపడ్డారు. ఎదురుకాల్పుల్లో మరణించారు. ఆపరేషన్ కొనసాగుతోంది అని ఆర్మీకి చెందిన చినార్‌కార్ప్స్ తెలిపింది.

## భూ భాగం కాదు
(మొదటి పేజీ తరువాయి)

మట్టుపెట్టడానికి తీసుకున్న చర్యలను, ప్రభుత్వ వైఖరిని ఆయన వివరించారు. ఎవరో ఒత్తిడిచేస్తే భారత ప్రభుత్వం సైనికచర్య ఆపేసిందని చెప్పడం లేదా అలాంటి మాటలు నమ్మడం నిరాధారమైనదీ, పూర్తిగా అసత్యాలని రాజ్‌నాథ్‌సింగ్ పదే పదే చెప్పారు. సైనిక దాడులు ఆపేయాలని పాకిస్థాన్ మిలిటరీ ఆపరేషన్ డైరెక్టర్ జనరల్ స్వయంగా భారత్ సైనిక డైరెక్టర్ జనరల్‌కు ఫోన్ చేసి విజ్ఞప్తి చేశారని చెప్పారు. యుద్ధం తానే ఆపానని ట్రంప్ పదే పదే చేస్తున్న ఉద్ఘాటనలకు జవాబుగా ఆయన పై సమాధానం చెప్పారు.
ఒకవేళ పాకిస్థాన్ గనుక మళ్ళీ తాజాగా దుస్సాహసానికి పాల్పడితే, మళ్ళీ 'ఆపరేషన్ సిందూర్' పునఃప్రారంభమవుతుందన్నారు. ప్రత్యేకచర్చ ప్రారంభంలోనే రక్షణమంత్రి ఈ విషయాన్ని స్పష్టం చేశారు. భారత సాయుధ బలగాలు సరిహద్దుల్లో రెప్పమూయకుండా ఎంతో అప్రమత్తంగా వ్యవహరిస్తున్నాయని చెప్పారు. ఆపరేషన్ సిందూర్ సైనిక కార్యకలాపాలు ఎంతో క్రియాశీలంగా, సమర్థవంతబంగా, ఎంతో గొప్ప సమన్వయంతో జరిగాయన్నారు. ఏడు ఉగ్రవాద శిబిరాలను పూర్తిగా నాశనం చేశామని, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీరు భూభాగంలో భారత్ చేసిన ఈ దాడులు, వినాశనానికి సంబంధించిన సాక్ష్యాధారాలు కూడా ఉన్నాయని చెప్పారు. ఈ మొత్తం ఆపరేషన్ సిందూర్ 22 నిమిషాల వ్యవధిలో భారత సైన్యం పూర్తిచేసి పహల్గామ్‌లో హత్యలకు ప్రతీకారం తీర్చుకుందని చెప్పారు. ఈ దాడుల వల్ల నిర్దేశిత లక్ష్యాలను మాత్రమే ధ్వంసం చేశాం తప్ప ఇతరత్రా ఎలాంటి విస్తారమైన నష్టం ఆ ప్రాంతాలలో జరగలేదని, ప్రజలకు ఎలాంటి నష్టం, ప్రమాదం జరగకుండా పాకిస్థాన్ భూభాగంలోకి వెళ్ళి దాడులు పూర్తిచేసి ఉగ్రవాదులను భారతసైన్యం హతమార్చిందని చెప్పారు. ఆపరేషన్ సిందూర్‌ను అమలుచేసే ముందుగా సాయుధ బలగాలు అన్ని కోణాల లోంచీ ప్రతి విషయాన్నీ చాలా క్షుణ్ణంగా అధ్యయనం చేసిందని చెప్పారు. ఉగ్రవాదులకు గరిష్ఠస్థాయిలో నష్టం జరిగేవిధంగా,పౌర ప్రాంత ప్రజలకు, అమాయకులకు ఎలాంటి నష్టం జరగకుండా ప్రణాళిక అమలు చేశారన్నారు.
సరిహద్దులు దాటి వెళ్ళడమో, వారి భూభాగాలను ఆక్రమించుకోవడమో భారతదేశ లక్ష్యంకాదని, ఉగ్రవాదుల స్థావరాలను, వారి శిబిరాలను సర్వనాశనం చేయడమే భారత సాయుధ బలగాల సైనికచర్య ప్రధానలక్ష్యమని చెప్పారు. మన సైనిక కేంద్రాలను పాకిస్థాన్ ఏమీ చేయలేకపోయిందని, ఎలాంటి దాడులూ మన సైనిక కేంద్రాలపై జరగలేదని చెప్పారు. మనదేశ సైనిక వ్యవస్థకు చెందిన ముఖ్యమైన ఆస్తులను వారు ఏమీ చేయలేకపోయారన్నారు. పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీరులో భారత్ చేసిన దాడులకు సంబంధించిన సాక్ష్యాధారాలను కూడా దేశం సంపాదించగలిగిందన్నారు. "ఆపరేషన్ సిందూర్ మన బలానికి చిహ్నం, భారతదేశ పౌరులకు నష్టం గానీ, హానిగానీ జరిగితే దేశం మౌనంగా ఉండబోదని చెప్పడానికి ఇదే సంకేతం, భారతదేశం ముందు స్నేహ హస్తం అందిస్తుంది, ఐతే ఒకవేళ ఎవరైనా ద్రోహం చేస్తే భారత్ స్నేహాన్ని అందుకున్న ఆ చేతిని ఎలా మెలితిప్పాలో కూడా దేశానికి తెలుసు" అని రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు.

## దార్శనికుడు
(మొదటి పేజీ తరువాయి)

సేవలు నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తాయని తెలిపారు.
**జైపాల్ రెడ్డికి భారత రత్న ఇవ్వాలి : మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి**
రోడ్లు భవనాల శాఖమంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ అజాతశత్రువు ఎస్. జైపాల్‌రెడ్డి అన్నారు. కేంద్రమంత్రిగా, ఉత్తమ పార్లమెంట్ సభ్యులుగా ఎన్నో సేవలు అందించారని గుర్తుచేశారు. హైదరాబాద్ మెట్రోరైల్, అండర్ గ్రౌండ్ డ్రైనేజికి ఎంతో కృషి చేశారన్నారు. కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడు తెలంగాణలో వివిధ అభివృద్ధి పనులకు రూ.10వేల కోట్లను, నల్లగొండ జిల్లాకు రూ.400 కోట్లను కేటాయించడం జరిగిందన్నారు. విశిష్ట సేవలు అందించిన వ్యక్తిగా జైపాల్‌రెడ్డిని కేంద్రప్రభుత్వం గుర్తించి, భారతరత్న అందించాలని కోరారు.
**రాజకీయాల్లో మచ్చలేని నేత జైపాల్ రెడ్డి : మంత్రివివేక్‌వెంకటస్వామి ...**రాష్ట్ర కార్మికశాఖమంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ జైపాల్‌రెడ్డి ప్రజాసేవకు నిలువెత్తు సాక్ష్యం అన్నారు. రాష్ట్ర అవతరణలో ఆయన పోషించిన పాత్ర కీలకమని చెప్పారు. విద్యార్థి నాయకుని నుంచి కేంద్ర మంత్రి వరకు అటు దేశానికి ఇటు తెలంగాణకు ఎన్నో విలువైన సేవలు అందించారని కొనియడారు. విలువలకు ఎంతోప్రాధాన్యమిచ్చేవారన్నారు. ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు అందుకోవటం ఆయన గొప్పతనానికి నిదర్శనమన్నారు. రాజకీయాల్లో మచ్చలేని మనిషిగా ఎదిగారని నేటితరం ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు.
**జైపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించిన స్పీకర్, మండలి చైర్మన్‌లు...**
జైపాల్‌రెడ్డి కుటుంబాన్ని శాసనసభ స్పీకర్, శాసనమండలి చైర్మన్, మంత్రులు, ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు పరామర్శించారు. స్మృతి స్థల్‌లో జైపాల్ రెడ్డి ఘాట్‌లో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రి వాకిటి శ్రీహరి, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్ర మాజీ మంత్రి పల్లం రాజు, సుప్రీంకోర్టు రిటైర్డ్ జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు కె.కేశవరావు, రైతు కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి, తెలంగాణ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చెన్నారెడ్డి, బిసి కమిషన్ చైర్మన్ నిరంజన్, మాజీ మంత్రులు సంబాని చంద్రశేఖర్, మాజీఎంపిలు హనుమంతరావు, రవీంద్రనాయక్, మధు యాష్కీగౌడ్ ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ, ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులు, వివిధ కార్పొరేషన్‌ల చైర్మన్‌లు, నివాళులర్పించారు.

## 5న ఢిల్లీకి
(మొదటి పేజీ తరువాయి)

మంతివర్గం స్పష్టం చేసింది. రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను మంత్రులు కొండా సురేఖ, వాకిటి శ్రీహరిలతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాకు వెల్లడించారు. రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్న రెండు బిసి రిజర్వేషన్ల బిల్లులను ఆమోదించుకునేందుకు ఆగస్టు 5,6,7వ తేదీన మంత్రివర్గం, ఎంపిలు, ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు ఢిల్లీకి వెళ్తున్నామని, రిజర్వేషన్ల అమలు విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉన్నదని పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. స్థానిక సంస్థల్లో 42 శాతం బిసిలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని ఈ ఏడాది మార్చిలోనే అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం బిల్లును ఆమోదించిందని, విద్యా ఉద్యోగ అవకాశాల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ మరో బిల్లును అదే రోజున ఆమోదించిందని, బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌ను కల్పించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కట్టుబడి ఉన్నదని మంత్రి చెప్పారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను ఆశించేవారంతా ఢిల్లీకి రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎంపి ఆర్. కృష్ణయ్య మౌనంగా ఉండొద్దని, బిజెపికి చెందిన ఐదుగురు ఎంపిలను ఢిల్లీకి తీసకురావాలని, ఆయనే నాయకత్వం వహించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. బిసిలు, బిసి మేథావుల సలహా మేరకు కుల గణన గడువు పెంచిందని, ఆన్‌లైన్, మిస్‌కాల్ విధానంలో కూడా కుల గణన చేపట్టామని గుర్తు చేశారు. ఇడబ్ల్యుఎస్ 10 శాతం రిజర్వేషన్ అమలుతోనే రిజర్వేషన్లు 50 శాతం మించవద్దనే పరిమితి నిబంధన తొలగిపోయిందని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రాల వద్ద కులాల వారిగా వివరాలు ఉంటే, రిజర్వేషన్ల విషయంలో రాష్ట్రాలు ముందుకు వెళ్లవచ్చని ఇందిరాసహాని కేసులో తీర్పు స్పష్టం చేస్తుందని పొన్నం గుర్తు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలకు కోర్ట్ విధించిన గడువు దగ్గరపడుతుందని, మరోవైపు గ్రామాలకు కేంద్రం నుంచి రావాల్సిన నిధులను కేంద్రం ప్రభుత్వం ఇవ్వడం లేదని, అలాగే రాష్ట్రపతి వద్ద బిసి రిజర్వేషన్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. రాజకీయాలకు అతీతంగా బిసి బిల్లులను ఆమోదించుకునేందుకు అన్ని రాజకీయ పార్టీలు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. మరోవైపు గతంలో పదేండ్లు తెలంగాణకు ముఖ్యమంత్రిగా ఉన్న కెసిఆర్ బిసిలకు తీరని ద్రోహం చేశారని విమర్శించారు. అన్ని సామాజిక వర్గాల రిజర్వేషన్ల పరిమితి 50 శాతం దాటకూడదని 2018లో పంచాయతీరాజ్ చట్టంలో ప్రత్యేక నిబంధనను పొందుపరిచారని, కేసీఆర్ తెచ్చిన ఈ చట్టం బీసీల రిజర్వేషన్ల పెంపునకు ప్రధాన అడ్డంకిగా మారిందన్నారు. కేసీఆర్ బీసీలకు చేసిన ద్రోహాన్ని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జరిగిన కేబినేట్ మీటింగ్‌లో ఆ చట్టాన్ని సవరించాలని నిర్ణయం తీసుకుందన్నారు.
**అసెంబ్లీలో ఆమోదించిన బిజెపి...ఇప్పుడు ఎందుకు వద్దంటుంది?**
శాసనసభలో బిసి బిల్లులను ఆమోదించి, ఇప్పుడు బిల్లులను ఎందుకు వ్యతిరేకిస్తున్నారని, ఇందుకు రాంచందర్‌రావు లేదా అప్పుడు మద్దతు ఇచ్చిన బిజెపికి చెందిన ప్రజాప్రతినిధులు రాజీనామా చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. బిసి రిజర్వేషన్లపై బిజెపి తన వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. బిసిల గురించి మాట్లాడే అర్హ త బిజెపికి లేదని మండిపడ్డారు. కేంద్రం మంత్రి కిషన్ రెడ్డి తన మంత్రి పదవికి రాజీనామా చేయాల్సిన అసవరం లేదని, ఆయన బిసిలకు మద్దతు ఇస్తే సరిపోతుందని సూచించారు.
**ప్రజాప్రతినిధుల కార్యాచరణ...** పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్నందున ఆగస్ట్ 5వ తేదీన బీసీల రిజర్వేషన్ల బిల్లుల ఆమోదంలో జరుగుతున్న జాప్యానికి నిరసన తెలిపేందుకు పార్లమెంట్‌లో పార్టీ ఎంపిల ద్వారా వాయిదా తీర్మానం ఇవ్వాలని మంత్రివర్గం నిర్ణయించినట్లు సమాచారం. ఆగస్ట్ 6వ తేదీన రాష్ట్రంలోని మంత్రులు, ఎంపిలు, ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు, ప్రజా ప్రతినిధులందరితో ఛలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహించి జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేయాలని నిర్ణయం తీసుకుంది. మరుసటి రోజున ఆగస్ట్ 7వ తేదీన ముఖ్యమంత్రితో పాటు మంత్రులు, పార్టీ ఎంపిలు, ఎంఎల్‌సిలు దాదాపు 200 మంది ప్రతినిధులతో రాష్ట్రపతిని కలిసి బిల్లుల ఆమోదం కోరుతూ వినతి పత్రం అందించాలని మంత్రివర్గం నిర్ణయించింది.

## ఇంకెప్పుడు?
(మొదటి పేజీ తరువాయి)

ఆపరేషన్ సిందూర్" అనే అంశంపై జరిగిన చర్చలో గౌరవ్ గొగోయ్ పాల్గొంటూ, "ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీరు భూభాగాన్ని వెనక్కు తీసుకుంటాం? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పాకిస్థాన్ అధీనంలో ఉన్న భూభాగాన్ని ఆక్రమించే ఉద్దేశం భారత్‌కు లేదని ప్రభుత్వం చెప్పిన మాటపై ఆయన పైవిధంగా నిలదీశారు. యూరీలో, పుల్వామాలో ఉగ్రవాదులు దాడులుచేసి దారుణ హింస సృష్టించినప్పటినుండీ ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మీ ఇంట్లోకి ప్రవేశించి మిమ్మల్ని చంపుతాం" అని ప్రచారం చేస్తున్నారని, పహల్గామ్‌లో ఉగ్రవాదులు దాడి చేసిన తర్వాత ఇప్పుడు కూడా మోదీ అదే ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.
"ఆపరేషన్ సిందూర్ ఇంకా పూర్తి కాలేదని, పాకిస్థాన్ ఇదే పని మళ్ళీ చేస్తుందని వారు ఇప్పటికీ చెబుతున్నారు, మరి అలాంటప్పుడు ఆపరేషన్ సిందూర్‌లో మనం ఎలా విజయం సాధించినట్లవుతుంది? యుద్ధం చేయడం మా ఉద్దేశం కాదని వారంతట వారే చెబుతున్నారు, యుద్ధం ఎందుకు చెయ్యలేదు? ఆ భూభాగాన్ని వెనక్కు లాక్కోవడం మా ఉద్దేశం కాదంటున్నారు, మరి పాకిస్థాన్ ఆక్రమించిన కశ్మీరు భూభాగాన్ని ఎప్పుకు వెనక్కు తీసుకువస్తారు? ఈ రోజు కాకపోతే...మరి ఇంక ఎప్పుడు తీసుకువస్తారు? మీ ప్రభుత్వ హయాంలో అత్యంత భయానకమైన ఉగ్రవాద దాడులు జరిగాయి" అని గౌరవ్ గొగోయ్ మోదీ ప్రభుత్వాన్ని దునుమాడారు.
**అసలు నిజం ఏమిటి?**అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఐదు లేదా ఆరు యుద్ధ విమానాలు కూలిపోయాయని చెబుతున్నారని, అసలు నిజం ఏమిటని గౌరవ్ గొగోయ్ లోక్‌సభలో ప్రశ్నించారు. మనదేశంలో కేవలం 35 రాఫెల్ యుద్ధ విమానాలు మాత్రమే ఉన్నాయని, వీటిల్లో కొన్ని విమానాలు కూలిపోయాయంటే అది దేశానికి చాలా చాలా పెద్ద నష్టమే అవుతుందని ఆయన అన్నారు. ఈ సమాచారం, ఈ నిజం కేవలం భారత పౌరులకోసం మాత్రమేకాదు, దేశ సైనికులకు కూడా ఇది చాలా ముఖ్యమైన సమాచారం, వారితో కూడా అబద్ధాలాడిస్తున్నా రు" అని విమర్శించారు. భారత రక్షణ దళాల ప్రధానాధిపతి జనరనల్ అనిల్ చౌహాన్ ఒక ఇంటర్వ్యూలో చెప్పిన విషయాన్ని గొగోయ్ గుర్తుచేశారు. పాకిస్థాన్ లోలోపలకు వెళ్ళిన భారత వాయుసేన విమానాలు ఆపరేషన్ సిందూర్‌లో నష్టాలు చవిచూసిన తర్వాత, భారతదేశం తన ఎత్తుగడలను, యుద్ధ వ్యూహాలను పునఃసమీక్షించుకోవాల్సిన అవసరం ఉందని ఆ ఇంటర్వ్యూలో చౌహాన్ చెప్పారని గుర్తుచేశారు. ఇండోనేసియాలో భారత రక్షణ దౌత్యవేత్త, గ్రూప్ కెప్టెన్ శివ్‌కుమార్, సాయుధ బలగాల ఉప ప్రధానాధిపతి లెఫ్టినెంట్ జనరల్ రాహుల్ ఆర్.సింగ్ చేసిన వ్యాఖ్యలను కూడా గొగోయ్ లోక్‌సభ దృష్టికి తీసుకువచ్చి ప్రభుత్వాన్ని ఇరకాటంలో పడేశారు. సైనిక చర్యల సమయంలో అనేక ఆటంకాలు వచ్చాయని కెప్టెన్ కుమార్ చెప్పారని, అదేవిధంగా ఆపరేషన్ సిందూర్ సందర్భంగా చైనాకు వ్యతిరేకంగా కూడా పోరాడాల్సి వస్తుందని భారత్ భావించిందని లెఫ్టినెంట్ జనరల్‌సింగ్ చెప్పారని లోక్‌సభకు గుర్తుచేశారు.
**అమిత్‌షా, అజిత్ దోవల్‌నైతిక బాధ్యత వహించాలి**
రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఆపరేషన్ సిందూర్‌పై చర్చ సందర్భంగా చైనా పేరు ఎందుకు ప్రస్తావించలేదని ప్రశ్నించారు. ఏప్రిల్ 22న పహల్గామ్‌లో ఉగ్రవాదుల దుశ్చర్య తర్వాత భారత్ సైనికచర్య చేసినప్పుడు చైనానుండి పాకిస్థాన్‌కు ఎంతమేరకు సహాయం లభించిందో కూడా రక్షణమంత్రి చెప్పాలని డిమాండ్ చేశారు. పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడికి ఎవరు బాధ్యత తీసుకుంటారు? జమ్మూ కశ్మీరు లెఫ్టినెంట్ జనరల్ బాధ్యత తీసుకుంటారా? లేక కేంద్ర హోంమంత్రి బాధ్యత తీసుకుంటారా? లెఫ్టినెంట్ గవర్నర్ చాటున మీరు ఏదీ దాచిపెట్టలేరు, ఈ ప్రభుత్వం పిరికిపంద ప్రభుత్వం, చివరకు పహల్గామ్‌కు పర్యాటకులను తీసుకువెళ్ళిన సంస్థలపై ఆరోపణలు చేసినా కూడా చేస్తుంది" అని విమర్శించారు. పర్యాటకుల భద్రతకు సంబంధించిన వ్యవస్థకు సంబంధించి నిర్ణయాలు తీ సుకునేవారు నిర్లక్ష్యంగా వ్యవహరించారని, ఎవ్వరూ తమను ప్రశ్నించలేరన్న తలబిరుసుతో వ్యవహరించారన్నారు. హోం మంత్రి అమిత్‌షా, జాతీయ భద్రతాసలహాదారు అజిత్ దోవల్ ఇద్దరూ పహల్గామ్‌లో ఉగ్రవాద దాడులకు నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. దేశం కోరుకుంటున్నదని ఆపరేషన్ సిందూర్‌ను కాదని, ఆపరేషన్ తందూర్‌ను(బాధ్యులైన ఉగ్రవాదులను మంటల్లో మాడ్చి మసిచేయడం)దేశం కోరుకుంటోందని సమాజ్‌వాదీపార్టీ ఎంపి రమాశంకర్ అ న్నారు. ప్రభుత్వం నిర్ణయాత్మకంగా వ్యవహరించడం లో విఫలమైందని విమర్శించారు. బాధ్యులైన ఉగ్రవాదులను మట్టుబెట్టడంలో ఎందుకు జాప్యం జరిగిందని ప్రశ్నించారు. మూడురోజుల తర్వాత చేపట్టాల్సిన సైనిక చర్యను17రోజుల తర్వాత చేపట్టారని విమర్శించారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## రాష్ట్రంలో వర్షాలకు కాస్త బ్రేక్!

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గత వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు కాస్త బ్రేక్ పడింది. వారం నుంచి పది రోజులు పాటు రాష్ట్రంలో వర్షాలు కురిసే అవకాశం లేదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ప్రస్తుతం పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనాలు, ద్రోణులు కనిపించడం లేదన్నారు. దీంతో రాష్ట్రంలో వర్షాలకు కాస్త బ్రేక్ పడినట్లైంది. ఎండ తీవ్రత మళ్ళీ పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారుల అంచనా. ఎండల వల్ల క్యూమిలోనింబస్ మేఘాలు ఏర్పడి సాయంత్రం సమయంలో అక్కడక్కడ చిరుజల్లులు పడే అవకాశం ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో దాదాపు లోటు తీరినట్లైంది. అత్యధికంగా కుమ్రం భీం జిల్లా బెజ్జూరులో 23.7 సెంటీమీటర్ల వర్షం కురిసింది. ములుగు జిల్లా వెంకటాపురంలో 21.9, కరీంనగర్ జిల్లా పోచంపల్లిలో 14.5, కరీంనగర్‌లో 12.6, ములుగు జిల్లా మంగపేటలో 12.5, మల్లంపల్లిలో 11.9, హనుమకొండ జిల్లా మరిపల్లిగూడెంలో 11.3 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది.

# చైల్డ్ ట్రాఫికింగ్ నేరస్తులపై పిడి యాక్ట్

### ఎఐవైఎఫ్ రాష్ట్ర సమితి డిమాండ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సరోగసీ పేరుతో చైల్డ్ ట్రాఫికింగ్‌కు పాల్పడుతున్న వారిపై పిడి యాక్ట్ నమోదు చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ అనుమ తి లేకుండా నడుస్తున్న సరోగసీ, సంతానోత్పత్తి (ఇన్‌విట్రో ఫెర్టిలైజేషన్) కేంద్రాలపై చర్యలు తీసుకోవడంతో పాటు వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సంతానోత్పత్తి కేంద్రాలను తనిఖీలు నిర్వహించాలన్నారు. ఈ మేరకు సోమవారం ఎఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో కోఠిలోని ప్రజా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అడిషనల్ డైరెక్టర్ ఆర్.పుష్ప కు ఎఐవైఎఫ్ బృందం వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్ లు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సరోగసీ, సంతానోత్పత్తి (ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్) కేంద్రాలు ప్రభుత్వ అనుమతులు లేకుండా విచ్చలవిడిగా నడుస్తున్నాయన్నారు. ఇటీవల హైదరాబాద్ నగరంలో సృష్టి ఫెర్టిలిటీ సెంటర్‌లో సరోగసీ పేరుతో అనధికారికంగా పిల్ల లు లేని దంపతులకు సరోగసీ ద్వారా సంతానోత్పత్తి చేస్తామని చెప్పి రూ.30–50 లక్షలు వసూళ్లుచేసి దంపతులను మోసంచేయడం సిగ్గుచేటు అన్నా రు. రాష్ట్రంలో వీర్య కణాల సేకరణ కేంద్రాల్లో ఈ అక్రమ దందాలు జరుగుతున్నా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. అండ పిండ అరాచకానికి హైదరాబాద్‌లోని కొన్ని ప్రైవేట్ సంతానోత్పత్తి కేంద్రాలు దందాల కు తెరలేపడం సరి కాదన్నారు. అక్రమ సరోగసీ, స్పెర్మ్, చిన్నారుల ట్రాఫికింగ్ రాకెట్‌పై పోలీసులు ఉక్కుపాదం మోపి, దుర్మార్గులపై పిడి యాక్ట్ నమోదు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ నిర్వాహకురాలు డాక్టర్ నమ్రత అరెస్టు అనంతరం బాగోతాలు ఒక్కొక్కటిగా బయట పడటం చూస్తే... సృష్టి ఆసుపత్రి వెనుక పలు పెద్ద ఆసుపత్రులు కూడా ఈ నీచ దందాకు పాల్పడుతున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సరోగసీ కార్య కలపాలపై సమగ్ర విచారణ జరిపించి అక్రమాలకు పాల్పడుతున్న వారిపై కఠినచర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.సత్య ప్రసాద్, శ్రీమాన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్.బాలకృష్ణ, శివకుమార్, రాష్ట్ర సమితి సభ్యులు షేక్ మహమూద్, కళ్యాణ్,రాజేందర్, మధుకర్, విష్ణు పాల్గొన్నారు.

### మధ్యాహ్న భోజన కార్మికులకు నెలకు
# రూ.10వేల వేతనం

### యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీందర్ డిమాండ్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** మధ్యాహ్న భోజన పథకం వంట కార్మికుల కు ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు రూ.10వేల వేతనం వెంటనే చెల్లించాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయం సత్యనారాయణరెడ్డి భవన్‌లో సోమవారం కా.ప్రేమ్ పావని అధ్యక్షతన రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జంపాల రవీందర్ మాట్లాడుతూ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం వంట కార్మికులకు కాంగ్రెస్ ప్రభు త్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు రూ.10వేల వేతనం వెంటనే చెల్లించడంతో పాటు గ్యాస్ సిలిండర్లు, కోడిగుడ్లు పూర్తిగా ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. నిత్యావసర వస్తువులు రోజురోజుకు పెరుగుతున్నందున వాటిని ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. గత ప్రభుత్వంలో ప్రారంభమైన అల్పాహారం బిల్లులు ఈ ప్రభుత్వంలో కూడా కొన్ని నెలలు అందించినా ఆ మొత్తం బిల్లులు పెండింగుతో పాటు వేతనాల బకాయిలను సైతం ప్రభుత్వం వెంటనే చెల్లించాలని కోరారు. అదేవిధంగా అన్ని రకాల బిల్లులను గ్రీన్ చానల్ ద్వారా నేరుగా చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థులకు చెల్లించే మెనూ చార్జీలు సరిపో యే విధంగా లేనందున ప్రతీ విద్యార్థికి రూ.25లను అదనంగా చెల్లించాలన్నారు. అలాగే చిన్నచిన్న కారణాలతో, రాజకీయ కారణాలతో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా కూడా వంట కార్మికులను వేధింపులు గురిచేస్తున్నారని, వారి ఆధిపత్యం లేకుండా చేయాలని కోరారు. తమ సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించకపోతే సమ్మెకు కూడ వెనకాడబోమని రవీందర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో సత్తెనపల్లి విజయలక్ష్మి, తోపునూరి చక్రపాణి, ఎం.లక్ష్మ ణ్, బోయిణి ప్రసాద్, నిమ్మటూరి రామకృష్ణ , పోలపోలు వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఖరీఫ్‌కు పుష్కలంగా విద్యుత్

### వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులకు రాష్ట్ర ఇంధనశాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ ఆదేశాలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** గతేడాదితో పోల్చుకుం టే ఈ వర్షాకాలంలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరుగుతున్నదని, రానున్న రోజుల్లో మరింతగా పెరిగే అవకాశమున్నందున విద్యుత్ అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ విద్యుత్ అధికారులను ఆదేశించారు. దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణి సంస్థ (టిజిఎస్‌పిడిసిఎల్) అధికారులతో చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీతో కలిసి నవీన్ మిట్టల్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నదని, విద్యుత్ సరఫరాపై నిరంతర పర్యవేక్షణ చేస్తున్నారని తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ నగరంలో పారిశ్రామిక, వాణిజ్య రంగాలతో పాటు గృహ రంగంలో కూడా భారీ వినియోగం నమోదవుతుందన్నారు. దీనికి తోడు, వ్యవసాయానికి నిరంతర విద్యుత్ అందుబాటులో ఉండటంతో లక్షలాది మోటర్లు నిరంతరం నడుస్తున్నాయి. ఫలితంగా వర్షాల సీజన్‌లో కూడా భారీగా డిమాండ్ నమోదవుతున్నదన్నా రు. గతేడాది (2024) జులై 31న 13,541 మెగావాట్లుగా నమోదయిన గరిష్ట డిమాండ్ ఈ ఏడాది జులై 16న 14.05 శాతం పెరిగి 15,443 మెగావాట్లు గా నమోదైందని వివరించారు. పుష్కలంగా వర్షాలు పడుతుండటంతో నీటి లభ్యత బాగా పెరిగిందని, వరినాట్లు జోరందుకోవడంతో రానున్న రోజుల్లో విద్యుత్ డిమాండ్ భారీగా పెరిగే అవకాశముందన్నారు. ఈ నేపథ్యంలో సిఎండి స్థాయి నుండి కింది స్థాయి సిబ్బంది వరకు అప్రమత్తంగా ఉండాలని, ఎలాం టి అవాంతరాలు ఉత్పన్నం కాకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా ఈ వర్షాల సీజన్‌లో అధికారులు, సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని, వర్షాలు కురిసేటప్పుడు తప్పనిసరిగా తమ కార్యాలయాల్లో అందుబాటులో ఉంటూ సరఫరా పర్యవేక్షించాలని నవీన్ మిట్టల్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో టిజిఎస్‌పిడిసిఎల్ డైరెక్టర్లు డాక్టర్ నర్సింహులు, చక్రపాణి, కృష్ణా రెడ్డి, చీఫ్ ఇంజినీర్లు, సూపెరింటెండింగ్ ఇంజినీర్లు, డివిజనల్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

# సన్నబియ్యం పంపిణీ నిర్ణయం హర్షణీయం

### నియోజకవర్గవ్యాప్తంగా 4,500 రేషన్ కార్డులు
### ఎమ్మెల్యే కూనంనేని



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఎన్నికల హామీమేరకు తెల్లరేషన్ కార్డు లబ్దిదారులకు సన్నబియ్యం పంపిణీ పథకం హర్షణీయమని, సన్నబియ్యం నాణ్యతను మరింత పెంచి పేదలు కడుపునిండా తినేవిధంగా ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకోవాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్ మండలాలకు సంబంధించిన లబ్దిదారులకు మంజూరైన రేషన్ కార్డులను సోమవారం వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ ఇప్పటికే చాలా జాప్యం జరిగిందని, ప్రభుత్వం కొత్తరేషన్ కార్డుల జారీతో చేతులు దులుపుకుంటే సరిపోదని, తక్షణమే బియ్యం కేటాయించాలన్నారు. ఎన్నికల హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని నిత్యవసర సరుకులు పంపిణీ చేయాలన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 8వేలమంది కుటుంబ సభ్యుల చేర్పింపుతో 4500 కొత్త రేషన్ కార్డులను అందిస్తున్నామని, కార్డుల ప్రక్రియ నిత్యం కొనసాగేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని, ఇందిరమ్మ ఇండ్లు , రేషన్ కార్డులు, పెన్షన్లు అర్హులైన ప్రతీ ఒక్కరికీ అందేలా చూస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ వేణుగోపాలరావు, చుంచుపల్లి డిఎస్ఒ రుక్మిణి, సుజాతనగర్, లక్ష్మీదేవిపల్లి తహశిల్దార్లు రామకృష్ణ, ప్రసాద్, శిరీష, ఎంపిడిఒలు శుభాషిణి, భారతి, అంకుబాబు, హన్మంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, దస్రు, కుమారి హన్మంతరావు, వాసిరెడ్డి మురళీ, దీటి లక్ష్మీపతి, జక్కుల రాములు, చిరుమమిళ్ల వెంకటేశ్వరరావు, తాళ్ల వెంకటేశ్వర్లు, పొలమూరి శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు నాగ సీతారాములు, తూము చౌదరి, చింతలపూడి శేఖర్, ధర్మరాజు, గోపి తదితరులు పాల్గొన్నారు.

# చారిత్రక ప్రదేశాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం

### మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావులు అధికారులకు ఆదేశం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉన్న వివిధ చారిత్రక ప్రదేశాలను అభివృద్ధి చేయడం ద్వారా టూరిజం సెక్టార్‌ను బలోపేతం చేయాల ని వ్యవసాయ శాఖ మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, జూపల్లి కృష్ణారావులు అధికారులను ఆదేశించారు. సోమవా రం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర పర్యాటక, ప్రొబిషన్, ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, టూరిజం కార్పొరేషన్ ఎం.డి. వల్లూరి క్రాంతి, జనరల్ మేనేజర్ ఉపేందర్‌రెడ్డిలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో ఎకో, టెంపుల్ టూరిజంలను అభివృద్ధికి ప్రణాళికలను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. పాలేరు రిజర్వాయర్, నేలకొండపల్లి వద్ద ఉన్న బౌద్ధస్థూపం, పర్ణశాల, భద్రాచలం టెంపుల్, కిన్నెరసాని ప్రాజెక్టు, కొత్తగూడెం వద్ద హరితహోటల్, కనిగిరిహిల్స్, వైరా రిజర్వాయర్, వెలుగుమట్ల అర్బన్ పార్కు, ఖమ్మం ఖిల్లా వద్ద రోప్‌వే, ఖమ్మంలో కొత్తగా ఒక హరిత హోటల్‌ల ను నిర్మించేందుకు ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో పర్యాటక రంగం అభివృద్ధికి అనువైన వాతావరణం, ప్రదేశాలు, చారిత్రక కట్టడాలు, ఆలయాలు ఉన్నాయని, వాటిని ప్రజలకు అందుబాటులోకి తేవాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో ప్రసిద్ధిగాంచిన భద్రాచలం రామాలయంను మరింత అభివృద్ధిపరిచి భక్తులకు మెరుగైన వసతులు కల్పించాలని, ఇందుకు టూరిజం డిపార్టుమెంట్, కార్పొరేషన్‌లు కృషి చేయాలని మంత్రు లు తెలిపారు. అందుకు కావాల్సిన నిధు లు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా గాని, ప్రైవేట్ భాగస్వామ్యంలో గాని వెంటనే మంజూ రు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. జిల్లాలో టూరిజం శాఖ అధికారులు, జిల్లా కలెక్ట ర్ క్షేత్రస్థాయిలో పర్యటించి తగిన కార్యాచరణను రూపొందించాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వచ్చే నెలలో ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారని, టూరిజం ప్రాజెక్టులకు సంబంధించిన ప్రదేశాలను సందర్శించే అవకాశం ఉన్నందున, తగు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

ఖమ్మం పట్టణ సమీపంలో సుమారు 500 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న అటవీ ప్రదేశంలో ఏకో టూరిజంకు సంబంధించిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.



# సింగరేణి జెఎసి నాయకులపై కేసులు

**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** సింగరేణి సంస్థలో ప్రైవేటికరణకు వ్యతిరేకంగా సింగరేణి ప్రాంతంలో ఉన్న కోల్ బ్లాకులను తెలంగాణ రాష్ట్ర మనుగడకై సింగరేణికే కేటాయించాలని జరిగిన సమ్మెలో సింగరేణిలో జాతీయ కార్మిక సంఘాలు లైన ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ, సీఐటీయూ,టీబిజికేయస్, బిఎంయస్, ఇఫ్టు, సంఘాలు 2020లో కోవిడ్ సమయంలో సింగరేణి ప్రధాన కార్యాలయం ముందు ధర్నా చేపట్టిన సందర్భంలో కొత్తగూడెం 1 టౌన్ పోలీస్ కోవిడ్ రూల్స్ కు వీరుద్ధం గా వ్యతిరేకించారని 18 మంది జేఏసీ నాయకులు, కార్యకర్తల మీద కేసు పెట్టడం జరిగింది. 1టౌన్ పోలీస్ వారు గత నెలలో ఈ 18 మందికి సమన్లు పంపి కోర్టుకు హాజరుకమ్మని కోరి నారు. వీరు లాయర్ ద్వారా మెమోను కోర్టు కు అందించగా కోర్టు పిలుపుపై సోమవారం జేఏసీ నాయకులు కోర్టు వాయిదాకు హాజరుకావడం జరిగింది. మరల ఈ కేసును కోర్టు తదుపరి వాయిదా సెప్టెంబర్ 3 కు వేయడం జరిగిందని నాయకులు తెలిపారు. బొగ్గురంగ పరిశ్రమలో కార్మికుల నిరంతర హక్కులకై బొగ్గు పరిశ్రమను ప్రైవేటీకరించకుండా పోరాటాలు చేస్తున్న జేఏసీ నాయకుల మీద కేసులు బనాయించి ఇబ్బదులకు గురిచేస్తున్న ప్రభుత్వ, సింగరేణి యజమాన్యా విధానాలను జేఏసీ నాయకులు ఖండించారు.


పోలీస్ కేసులు అరెస్టులు తమ పోరాటాలను ఆపలేవని, తాము నిత్యం కంపెనీ, కార్మికుల శ్రేయస్సుకి పాటుపడతామని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో డి.శేషయ్య, వంగా వెంకట్, గుత్తుల సత్యానారాయణ, ఎర్రగని కృష్ణయ్య, కాలం నాగభూషణం, సంజీవ్, మాధవ్ నాయక్, మొగిలి రవి, గౌసే, బి. వెంకట స్వామి, అశోక్, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి ఉన్నతాధికారులతో ఎమ్మెల్యే కూనంనేని భేటీ

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం:** సింగరేణి ఉన్నతాధికారులతో కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు సోమవారం సంస్థ ప్రధాన కార్యాలయంలో భేటీ అయ్యారు. చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం, డైరెక్టర్ పా గౌతంతో కొత్తగూడెం నియోజకవర్గాభివృద్ధి, మౌళిక సదుపాయాలపై సుదీర్ఘంగా చర్చించారు. సింగరేణి సంస్థ నిర్వహణలో కూరగాయల మార్కెట్, షాపింగ్ కాంప్లెక్స్ త్వరితగతిన అభివృద్ధి పరచాలని కోరారు. సిఎస్ఆర్ నిధులు పెద్ద మొత్తంలో కేటాయించి నియోజకవర్గ పరిధిలో ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పించాలని, జిల్లా కేంద్రంగా ఉన్న కొత్తగూడెం బస్టాండ్ పునఃనిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. కొత్తగూడెం ప్రధాన సింగరేణి వైద్యశాలను కార్పోరేట్ స్థాయి వైద్యశాలగా మార్చాలని, వైద్యుల కొరతను నివారించడంతో పాటు నిపుణులైన డాక్టర్లను నియమించాలని సూచించారు. కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని, వారు నివసించే క్వార్టర్లలో సదుపాయాలు కల్పించాలని కోరారు. ప్రజలకు కావాల్సిన ప్రభుత్వభవనాలు నిర్మించేందుకు లీజులో ఉన్న స్థలాలను కేటయించాలని కోరారు. కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని, నిబంధనల ప్రకారం వారికి సౌకర్యాలు కల్పించేందుకు తగిన ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడు తూ నియోజకవర్గాభివృద్ధి అంశాలపై సంస్థ ఉన్నతాధికారులతో చర్చలు జరిపామని, ప్రధానంగా సిఎస్ఆర్ నిధులు, నూతన బస్టాండ్ నిర్మాణం, కూరగాయల మార్కెట్ సమీపంలో సంస్థ, కాంప్లెక్స్ నిర్మాణం, సంస్థ కార్మికుల సంక్షేమం, కాంట్రాక్టు కార్మికులపై చర్చించామని, ఇందుకు అధికారులు సానుకూలంగా స్పందించారని కూనంనేని తెలిపారు. ఆయన వెంట సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, గుర్తింపు సంఘం ఏఐటియూసి నాయకులు వంగ వెంకట్, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# 'సిగాచి'పై క్రిమినల్ కేసు పెట్టాలి

✻ మృతుల కుటుంబాలకు రూ.కోటి అందించాలి
✻ సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు



**ప్రజాపక్షం/సంగారెడ్డి:** సిగాచి యాజమాన్యం పై క్రిమినల్ కేసు పెట్టాలని, మృతుల కుటుంబాలకు రూ.కోటి అందించాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు డిమాండ్ చేశారు. సిగాచి పరిశ్రమలో ప్రమాదం జరిగి నెల రోజుల దాటిపోయినా కంపెనీ యాజమాన్యంపై ఎందుకు చర్యలు తీసుకోలేదని, సిగాచి పరిశ్రమతో సిఎం రేవంత్ లాలూచీ ఎందుకు పడ్డాడో అర్థం కావడం లేదని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. సోమవారం సిగాచి పరిశ్రమ బాధితులతో కలసి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీష్‌రావు మాట్లాడుతూ 54 మంది మృతికి కారణమైన యాజమాన్యంపై క్రిమినల్ కేసు పెట్టాలని డిమాండ్ చేశారు. ఘటన జరిగి నెల రోజులవుతున్నా ప్రమాదం కారణాలపై ముఖ్యమంత్రి రివ్యూ చేశారా అని ప్రశ్నించారు. ప్రమాదం కారణాలపై ముఖ్య మంత్రి రివ్యూ చేశారా అని ప్రశ్నించారు. ప్రమాదంలో గాయపడిన వారిని కార్పోరేట్ ఆసుపత్రులలో చేరిస్తే మరికొందరి ప్రాణాలు దక్కేవని విమర్శించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు సునితా లక్ష్మారెడ్డి, చింతా ప్రభాకర్, మానిక్‌రావు, మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ ,నాయకులు మఠం బిక్షపతి ,ఎర్రోళ్ల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# హైకోర్టుకు నలుగురు కొత్త న్యాయమూర్తులు

- రాష్ట్రపతి ఆమోదం
- నోటిఫికేషన్ జారీ చేసిన కేంద్రం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర హైకోర్టుకు కొత్తగా నలుగురు న్యాయవాదులు అదనపు న్యాయమూర్తులుగా నియమితులయ్యారు. రాష్ట్ర హైకోర్టు కొలీజియం సిఫార్సులను సుప్రీంకోర్టు కొలీజియం ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి నివేదించింది. కేంద్ర ప్రభుత్వ సిఫార్సులకు రాష్ట్రపతి ఆమోదముద్ర వేశారు. దీంతో సోమవారం కేంద్ర న్యాయ శాఖ గెజిట్ నోటిఫికేషన్‌ను జారీ చేసింది. న్యాయవాదులు గౌస్ మీరా మొహినుద్దీన్, సుద్దాల చలపతిరావు, వాకిటి రామకృష్ణారెడ్డి, గాడి ప్రవీణ్ కుమార్ అదనపు న్యాయమూర్తులుగా నియమితులయ్యారు. వీరంతా ప్రమాణస్వీకారం చేసినప్పటి నుంచి రెండేళ్లపాటు అదనపు న్యాయమూర్తులుగా కొనసాగారు. ఆ తర్వాత పూర్తిస్థాయి న్యాయమూర్తులుగా పదోన్నతి లభించింది.

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్ గవాయ్ నేతృత్వంలోని కొలీజియం కేంద్రానికి గతంలో సిఫార్సు చేసింది. ఈనెల 1, 2 తేదీ ల్లో కొలీజియం సమావేశమై దేశంలోని ఎనిమిది హైకోర్టులకు 36 మంది న్యాయమూర్తుల నియామకానికి సిఫార్సు చేసింది. వారిలో తెలంగాణకు నలుగురి విషయంలో రాష్ట్రపతి ఆమోదముద్ర వేయడంతో గెజిట్ ప్రచురణ జరిగింది.

**గౌస్ మీరా మొహినుద్దీన్**



హైదరాబాద్, బాలానగర్‌కు చెందిన మొహినుద్దీన్ 1969 జులై 15వ తేదీన జన్మించా రు. ఎపిలోని నెల్లూరు విఆర్ లా కాలేజీలో 5 ఏండ్ల లా పూర్తి చేశారు. ఉస్మానియాలో ఎల్ ఎల్ఎం చేశారు. 1993 మార్చి 17న ఉమ్మడి ఎపి బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. ఉమ్మడి ఎపి బార్ కౌన్సిల్, తెలంగాణ బార్ కౌన్సిల్‌లకు స్టాండింగ్ కౌన్సిల్‌గా పనిచేశారు. సివిల్, రాజ్యాంగపరమైన కేసులు వాదించిన అనుభవం ఉంది. తండ్రి మహమ్మద్ ఇస్మాయిల్ హెచ్‌ఎంటీ మేనేజర్‌గా పనిచేసి రిటైర్ అయ్యారు.

**సుద్దాల చలపతిరావు**



జిల్లా కేంద్రం జనగాం లో 1971 జూన్ 25 న జన్మిచారు. 1998లో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యా రు. సీనియర్ న్యాయవాది వై.S రామారావు వద్ద జూనియర్ ప్రాక్టీస్ మొదలుపెట్టారు. సివిల్, క్రిమినల్ కేసుల్లో రాణించిన అనుభవం ఉంది. జయశంకర్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ స్టాండింగ్ కౌన్సిల్ పనిచేస్తున్నారు.

**వాకిటి రామకృష్ణారెడ్డి**

యాదాద్రి భువనగిరి జిల్లా కొండమడుగు మండలంలో 1970 సెప్టెంబరు 14న జన్మించారు. బీకాం, ఎల్ఎల్బీ చేశాక 1998 ఏప్రిల్ 2న న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. సీనియర్ అడ్వొకేట్ ఎ. అనంతరెడ్డి వద్ద జూనియర్‌గా ప్రాక్టీస్ మొదలుపెట్టారు. హైకోర్టు, లోయర్ కోర్టుల్లో ప్రాక్టీస్ చేశారు. రాజ్యాంగ, క్రిమినల్, రెవెన్యూ, టాక్స్ కేసుల్లో అనుభవం ఉంది. పలు ప్రైవేటు కంపెనీలు, బ్యాంకులకు స్టాండింగ్ కౌన్సిల్‌గా చేశారు.



**గాడి ప్రవీణ్ కుమార్**

నిజామాబాద్ జిల్లా భీంగల్ లో 1971 ఆగస్టు 28న పుట్టారు. ఉస్మానియాలో ఎంఏ ఆర్ట్స్, కాకతీయ యూనివర్సిటీలో లా, ఉస్మానియా యూనివర్సిటీలో లా మాస్టర్స్ చేశారు. 1999 లో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యాక హైకోర్టు న్యాయవాది జయప్రకాశ్ రావు వద్ద జూనియర్‌గా చేరారు. హైకోర్టు, అడ్మినిస్ట్రేటివ్ ట్రైబ్యునల్, లేబర్ కోర్టులో ప్రాక్టీస్ చేశారు. రాజ్యాంగం, సర్వీస్, కాంట్రాక్ట్, లేబర్, సివిల్, క్రిమినల్ లా కేసులను వాదించిన అనుభవం ఉంది. పలు ప్రభుత్వ రంగ సంస్థలకు స్టాండింగ్ కౌన్సిల్‌గా గతంలో చేశారు. ఇప్పుడు డిప్యూటీ సొలిసిటర్ జనరల్‌గా చేస్తున్నారు.



hmda
హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ
7వ అంతస్తు, స్వర్ణజయంతి కాంప్లెక్స్, సంజీవరెడ్డి నగర్ రోడ్, అమీర్‌పేట్, హైదరాబాద్ - 500082.

బహిరంగ ప్రకటన

సంగారెడ్డి జిల్లా, పటాన్‌చెరు మండలం, రామేశ్వరం బండ గ్రామంలో సర్వే నెం.లు: 6, 110 నుండి 115 వరకు రెవెన్యూ విలేజ్ మ్యాప్ ప్రకారం మాస్టర్ ప్లాన్ 2031లో చేర్చబడలేదు. ఈ సర్వే నెంబర్లను ఇప్పుడు ఎండిపి-2023లో రెవెన్యూ విలేజ్ మ్యాప్ ప్రకారం సరిదిద్దబడ్డాయి.

సం/- మెట్రోపాలిటన్ కమిషనర్

DIPR R.O. No. : 5687-PP/CL/ADVT/1/2025-26, Date: 28-07-2025

## పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించినట్లు మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాస్ అన్నారు. సోమవారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆస్తి, నీటి పన్నుల వసూళ్లకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏండ్ల తరబడి పన్నులు చెల్లించకుండా ఉన్న మొండి బకాయిదారులకు నోటీసులు అందిస్తున్నామన్నారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంతోపాటు పచ్చదనం పెంపుకు చర్యలు చేపట్టామన్నారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నర్సరీలు ఏర్పాటు చేయనున్నామని, అందుకు స్థలాలను గుర్తిస్తున్నట్లు తెలిపారు. ఇంకుడు గుంతల ఏర్పాటు, మైదానాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. నూతన దంపింగయార్డు ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని అన్వేషిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట డీఈ వెంకన్న తదితరులు ఉన్నారు.

## 30న నల్లగొండలో మినీ జాబ్ మేళా

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** నల్లగొండ జిల్లాలోని నిరుద్యోగ యువతి యువకులకు పలు ప్రైవేటు (శ్రీనీ అగ్రి లాబ్స్, భారత్ ఫైనాన్షియల్ ఇన్క్లూజన్ లిమిటెడ్,కె ఎల్ గ్రూప్, హైర్ ల్యాబ్ కన్సల్టెంట్, హిప్పో క్లౌడ్ టెక్నాలజీస్) కంపెనీలలో ఉద్యోగాలు కల్పించుటకు ఈనెల 30న, ఉదయం 10:30 గంటలకు జిల్లా ఉపాధి కల్పన కార్యాలయము, ఐటిఐ క్యాంపస్, నల్లగొండలో జాబ్ మేళ నిర్వహించనున్నట్లు నల్లగొండ జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎన్. పద్మతెలిపారు. ఇట్టి జాబ్ మేళా లో ఎంపిక కాబడిన వారు నల్లగొండ, హైదరాబాద్ పరిసర ప్రాంతాలలో పనిచేయవలసి వుంటుంది, వారికి నెల జీతం నెలకు రూ.10,000 నుండి 25,000 వరకు ఉంటుందన్నారు.ఇట్టి ఉద్యోగాలకు ఎస్ఎస్‌సినుండి ఏదైనా డిగ్రీ డిప్లామా (అగ్రికల్చర్, హార్టికల్చర్) చదివిన 1830 సంవత్సరాల వయసు గల వారు అర్హులు. ఆసక్తి గల అభ్యర్థులు తమ యొక్క బయో డేటా ఓరిజినల్ సర్టిఫికేట్స్ తీసుకోని జిల్లా ఉపాధికల్పన కార్యాలయము, ఐ టి ఐ క్యాంపస్, నల్లగొండకు హాజరు కావాలన్నారు.

## రేషన్ డీలర్ల ఖాళీలను భర్తీ చేయాలి

### సిపిఐ మండల కార్యదర్శి అనంతుల రామచంద్రయ్య

**ప్రజాపక్షం/గుండాల:** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల వ్యాప్తంగా రేషన్ దుకాణా డీలర్ల ఖాళీలను భర్తీ చేయాలని సిపిఐ మండల కార్యదర్శి అనంతుల రామచంద్రయ్య ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో సన్న బియ్యం పథకం ప్రవేశపెట్టిన నేపథ్యంలో, నూతన రేషన్ కార్డులు మంజూరు చేసిన నేపథ్యంలో ఇప్పుడున్న రేషన్ దుకాణాలలో సరిపడా డీలర్లు లేకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు నెలకొనే పరిస్థితి. ప్రస్తుతం బయోమెట్రిక్ ద్వారా బియ్యాన్ని సరఫరా చేస్తున్నారని, డీలర్ కూడా బయోమెట్రీక్ వేయాల్సిన ఉండగా ఎవరి పేరుతో షాపు ఉందో వారు మాత్రమే బయోమెట్రిక్ చేస్తేనే ఆన్‌లైన్ ప్రారంభమవుతుంది. ఇంచార్జీగా ఉన్న గ్రామాలతో పాటు, రెగ్యులర్‌గా ఉన్న గ్రామాల్లో ఒకే వ్యక్తి బయోమెట్రిక్ సిస్టమ్ ద్వారా బియ్యం పంపిణికి ఆలస్యం అవుతుందని, ఇంచార్జీగా ఉన్న దుకాణాలకు ఒకటి రెండు రోజులు మాత్రమే రేషన్ ఇస్తున్న నేపథ్యంలో అప్పుడు వచ్చిన లబ్దిదారులకు మాత్రమే రేషన్ అందుతున్నదని లేని వారికి రేషన్ అందడం లేదు అని అన్నారు. స్థానికంగా డీలర్ ఉంటే ఉదయం నుండి సాయంత్రం వరకు లబ్దిదారులకు బియ్యం పంపిణి చేసే వీలుంటుందని ఆయన అన్నారు. తక్షణమే రేషన్ డీలర్ల ఖాళీలను భర్తీ చేయాలని, రేషన్ డీలర్లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కమిషన్ సకాలంలో అందే విధంగా చర్యలు తీసుకోవాలని, రేషన్ డీలర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, వారి సమస్యలను పరిష్కరించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## పట్టణాభివృద్ధిలో ప్రతిపౌరుడి పాత్రా కీలకమే




**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** ప్రజల భాగస్వామ్యం లేకుండా పట్టణాభివృద్ధి సాధ్యపడదని, ప్రతి నివాసితుడు తన వంతు బాధ్యతను నిర్వర్తించాలని మున్సిపల్ కమిషనర్ హన్మంతరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక 48వ వార్డులో 100 రోజుల ప్రణాళికలో భాగంగా మున్సిపల్ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సహకారంతోనే పారిశుద్ధ్య నిర్వహణ, కాంతివ్యవస్థ, చెత్త సేకరణ వంటి అంశాల్లో మెరుగుదల సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఇంటి వద్ద చెత్తను తడి, పోడి చెత్తగా వేరుచేసి ఇంటిముందుకు వచ్చే మున్సిపల్ వాహనాలకు అందించాలని కోరారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేదించాలని, కాలనీలో ఉన్న ప్రధాన సమస్యలను ప్రజల నుండి స్వయంగా అడిగి తెలుసుకున్నారు. పట్టణం మనందరిది. దీని అభివృద్ధికి మేం పనిచేశాం. మీరు భాగస్వామ్యం కావాలని కమిషనర్ వ్యాఖ్యనించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ వెలుగు వెంకన్న, మున్సిపల్ అధికారులు డిఈ సత్యారావు, సానిటరీ ఇన్స్‌పెక్టర్ సారుగండ్ల శ్రీనివాస్, ఎఇ తిరుమల్లయ్య, ఆర్ఐ లు గౌసుద్దీన్, ఇండ్ల మనోజ్, వార్డు అధికారి యశ్వంత్, టిఎంసి శ్వేత, శివప్రసాద్, సయ్యద్ సమ్మి, మహిళలు పాల్గొన్నారు.

## సెవన్ స్టార్‌హోటల్‌పై కమిషనర్ ఆకస్మిక తనిఖీ

### నిల్వ పదార్థాలపై కఠిన చర్యలు: కమిషనర్ హెచ్చరిక



**ప్రజాపక్షం/సూర్యాపేటరూరల్:** మున్సిపల్ కమిషనర్ పట్టణంలోని ప్రముఖ సెవన్‌స్టార్ హోటల్‌ను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హోటల్‌లో పారిశుద్ధ్య పరిస్థితులు, నాణ్యత ప్రమాణాలు, నిల్వ ఆహార పదార్థాల పరిస్థితిని సమీక్షించారు. ప్రజలకు నాణ్యమైన ఆహారమే అందాల్సిన బాధ్యత హోటల్ యాజమాన్యంపై ఉందని ఆయన పేర్కొన్నారు. తనిఖీ సందర్భంగా కమిషనర్ హన్మంతరెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని విస్మరించి వ్యాపారా లాభాల కోసం గడువు ముగిసిన పదార్థాల లేదా శుభ్రతలేని వంట గదులు వాడితే ఆహార భద్రత చట్టాల కింద కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. హోటల్ వంటగదీ స్టోరేజీ ప్రాంతాల్లో పరిశుభ్రత, చెత్త నిర్వహణ, శుభ్రంగా వాడాల్సిన కిచెన్‌ను యుటెన్సిల్స్ , పనివారి హెల్త్ హైజీన్‌ను సమీక్షించారు. చిన్నపాటి లోపాలను గుర్తించి హోటల్ యాజమాన్యానికి తగిన సూచనలు చేశారు. తప్పిదాలు జరిగితే హోటల్ లైసన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం మున్సిపల్ విభాగం తరచుగా అకస్మిక తనిఖీలు నిర్వహిస్తుందని అన్నారు.

## రోస్టర్ విధానాన్ని సవరించాలి

**ప్రజా పక్షం/నల్లగొండ టౌన్ :** ఎస్‌సి వర్గీకరణ, రోస్టర్ పాయింట్ల కేటాయింపుల్లో మాలలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, రోస్టర్ విధానాన్ని వెంటనే సవరించాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు లకుమాల మధుబాబు డిమాండ్ చేశారు. ఎస్‌సి వర్గీకరణ అనంతరం చేసిన రోస్టర్ విధానం సరిగా లేదని వెంటనే సవరించాలని కోరుతూ సోమవారం నల్లగొండ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట మాల మహానాడు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపి అనంతరం జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన సూచనలను పట్టించుకోకుండా 2011 జనాభా లెక్కలను తీసుకొని ఎంఫరికల్ డేటా లేకుండానే జస్టిస్ శమీ మక్తల్ ఇచ్చిన తప్పుడు నివేదిక ఆధారంగా ఎస్సీల ను కులాల వారిగా వర్గీకరించి మాలలతో పాటు మరో 25 కులాలను గ్రూప్ 3 లో చేర్చి ఐదు శాతం రిజర్వేషన్ లను కల్పించడం తీవ్ర అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి జంగాల భిక్షం, రాష్ట్ర మహిళా కార్యదర్శి పాలపాటి సుమలత, నల్లగొండ జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు రాయల మౌనిక,జిల్లా కార్యదర్శి బూరుగు శ్రీలత, నాగార్జునసాగర్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి జంగాల శ్రీనివాస్,మండల అధ్యక్షుడు సల్వాది ప్రభాకర్,యూత్ అధ్యక్షుడు సల్వాది రజినీకాంత్ ఉన్నారు.



## నేడు సాగర్‌లో మంత్రుల పర్యటన

### తెరవనున్న ప్రాజెక్ట్ క్రస్ట్ గేట్లు

**ప్రజాపక్షం/నందికొండ:** నిండుకుండలా మారిన నాగార్జునసాగర్ రిజర్వాయర్ క్రస్ట్ గేట్లను తెరవడానికి నేడు భారీ నీటిపారుల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి,షెడ్యూల కులాలు, తెగలు మైనార్టీ శాఖ మంత్రి, అడ్లూరి లక్ష్మణ్,రోడ్డు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి నాగార్జున్ సాగర్‌కు రానున్నారు. వీరు ఉదయం 9 గంటలకు బేగంపేట విమానాశ్రయం చేరుకొని అక్కడ నుండి హెలికాప్టర్ ద్వారా ఉదయం 10 గంటలకు నాగార్జునసాగర్ చేరుకుంటారు అందుకు స్థానిక మహాత్మ జ్యోతి బాపూలే బి సి గురుకుల పాఠశాల గ్రౌండ్‌లో హెలిపాడ్‌ను సిద్ధం చేశారు. ఆ తర్వాత కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట మధ్య స్యాగర్ ప్రాజెక్ట్ క్రస్ట్ గేట్లను తెరిచే కార్యక్రమంలో పాల్గొంటారు. అందుకు మంత్రులచేత నాగార్జునసాగర్ డ్యాం క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని విడుదల చేయడానికి ఎన్ఎస్పీ అధికారులు అన్నీ ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆ తరువాత మంత్రులు పెద్ద ఊరలో కొత్త రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు.

**సాగర్‌కు భారీ వరద :** కర్ణాటక, మహారాష్ట్రలో విస్తారంగా కురుస్తున్న వర్షాలతో కృష్ణమ్మ ఉప్పొంగి ప్రవహిస్తున్నది. శ్రీశైలానికి భారీగా వరద ప్రవాహం కొనసాగుతుండగా, ఇప్పటికే పూర్తిస్థాయి నీటినిల్వను చేరుకోవడంతో, నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్ రిజర్వాయర్‌కు శ్రీశైలం నుంచి 147195 క్యూసెక్కుల భారీ ఇన్‌ఫ్లో వస్తుండటంతో సాగర్ ప్రాజెక్టు నిండుకుండను తలపిస్తుంది. సాగర్ ప్రాజెక్టు గరిష్ట నీటిమట్టం 590 అడుగులకు గాను సోమవారం సాయంత్రానికి సాగర్ ప్రాజెక్టు గరిష్ట నీటిమట్టం 590 అడుగులకు గాను సోమవారం సాయంత్రానికి 584.70 అడుగులుగా ఉన్నది నీటి నిల్వ సామర్థం 312.0450 టీఎంసీలకు గాను 296.5695 టీఎంసీలుగా ఉన్నది.



# అర్హులకు రేషన్ కార్డులు ఇస్తాం

### కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్



**ప్రజాపక్షం/తుంగతుర్తి (అర్వపల్లి, నాగారం):** అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్‌కార్డులు అందజేస్తామని జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ అన్నారు. సోమవారం జిల్లాలోని నాగారం, జాజిరెడ్డిగూడెం లో నూతన రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమంలో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలుతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పారదర్శకంగా రేషన్‌కార్డుల పంపిణీ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. అర్హులైన వారికి మాత్రమే రేషన్‌కార్డులు మంజూరు చేస్తామన్నారు. నాగారం గ్రామంలో కొత్తగా 429 నూతన రేషన్ కార్డులు మంజూరయ్యాయని, కార్డులలో కొత్త వారి చేర్పులు 919 మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో లబ్ధిదారులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇల్లు కట్టుకోవాలని, ఇంటికి కావాల్సిన ఇసుకను ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుందని తెలిపారు. వర్ధమానుకోట కెజిబివి ప్రారంభించడం జరిగిందని, ఉన్నత చదువులకు ఎంతగానో ఉపయోగపడుతుందని, తమ పిల్లలను కెజిబివిలో చేర్పించి మంచిగా చదువు చెప్పించాలని కలెక్టర్ తెలిపారు. జాజిరెడ్డిగూడెం గ్రామ పంచాయతీ భవనాన్ని తర్వగా పూర్తి చేసుకుని వినియోగంలోకి తెచ్చుకోవాలని, దీని ద్వారా గ్రామ అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించి గ్రామాభివృద్ధికి తోడ్పడాలని అన్నారు. తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి కోసం ఇప్పటి వరకు 1400 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసినట్లు తెలిపారు. నాగారంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు నూతన రేషన్‌కార్డు పొందిన లబ్ధిదారులకు తమ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్లు కరెంట్ వినియోగం, ఇందిరమ్మ ఇండ్లు, నూతన రేషన్‌కార్డులు పంపిణీ మంజూరు చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి యాదగిరి, పిఏసిఎస్ చైర్మన్లు గుడిపాటి సైదులు, చంద్రశేఖర్, సురేందర్‌రెడ్డి, తహసిల్దార్ శ్రీకాంత్, నాగారం తహసిల్దార్ హరికృష్ణ, ఎంపీడీఓ మారయ్య, సీనియర్ అసిస్టెంట్ షఫి పాల్గొన్నారు.

### చదువుకున్న పాఠశాలకు సేవ చేయడం అదృష్టం

**ప్రజాపక్షం/చివ్వెంల:** ప్రభుత్వ పాఠశాలలో చదువుకుని జీవితంలో స్థిరపడి చదువుకున్న పాఠశాలకి సేవ చేయడం అదృష్టమని జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ అన్నారు. సోమవారం చివ్వెంల మండలం కొండలరాయిని గూడెం గ్రామం ప్రభుత్వ పాఠశాలలో చదువుకుని జీవితంలో స్థిరపడిన ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు మండల ప్రాథమిక పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు షూ, టీషర్ట్స్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. 2వ తరగతికి చెందిన వినయ్ కలెక్టర్ అడిగిన ప్రశ్నలకి ఇంగ్లీష్‌లో సమాధానం చెప్పారు. అలాగే 5వ తరగతికి చెందిన శ్రీనిధి తెలుగు చదివించగా స్పష్టంగా చదవటంతో కలెక్టర్ విద్యార్థులని అభినందించారు. అంగన్‌వాడీ కేంద్రం సందర్శించి పిల్లలలో ముచ్చటించారు. వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు.



## ప్రతిష్టాత్మక హామీల అమలుతో స్థానిక సంస్థల్లో తిరుగులేని విజయం

### భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** కాంగ్రెస్ ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రతి హామీని అమలు చేసి నెరవేర్చిన ఘనత కాంగ్రెస్ పార్టీని ప్రజలు విశ్వాసంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో తిరుగులేని విజయాన్ని అందిస్తారని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సోమవారం ఆయన పోచంపల్లి మండలంలోని అంతమ్మ గూడెం ధోతి గూడెం జిబ్లక్ పల్లి కనుముకుల దంతూరు వంక మామిడి ధర్మారెడ్డి పల్లె గ్రామాలలో మౌలిక సదుపాయాల కల్పన కోసం హెచ్ఎండిఏ నిధుల ద్వారా మంజూరైన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ప్రజలకు ఇచ్చిన హామీలే కాకుండా ప్రజా అవసరాల కోసం సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ కనీవిని ఎరుగని రీతిలో కీలక నిర్ణయాలు తీసుకుని ప్రతిష్టాత్మకంగా ప్రజల కోసం సన్న బియ్యం పంపిణీ, రేషన్ కార్డులు మంజూరు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ, చేనేత రంగానికి ఇతర అన్ని వర్గాల ప్రజల కోసం పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తూ అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షులు కళ్లెం రాఘవరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తడక వెంకటేశ్వర్లు, మండల పార్టీ అధ్యక్షుడు పాక మల్లేష్ యాదవ్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు మర్రి నర్సింహారెడ్డి, పిఏసిఎస్ వైస్ చైర్మన్ సామ మోహన్ రెడ్డి, ఉపాధ్యక్షులు అనిరెడ్డి జగన్ రెడ్డి, ఫకీరు నర్సిరెడ్డి, కాసుల అంజయ్య గౌడ్, ప్రధాన కార్యదర్శి తోట శ్రీనివాసులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సుర్వి వెంకటేశం గౌడ్ ఉన్నారు.

# ఆపదలో ఉన్నాం ఆదుకోండి సారూ..

### ప్రజావాణిలో బాధితుల వినతుల వెల్లువ

### అధిక సంఖ్యలో తరలివచ్చిన బాధితులు



**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్ :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారం కోసం ప్రతిష్టాత్మకంగా ప్రజావాణి కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంతో పాటు డివిజన్,మండల కార్యాలయంలోని ఎంపీడీవో,తహసీల్దార్ తదితర కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి వాటి పరిష్కారానికి మార్గం చూపుతున్నారు.ఈ నేపథ్యంలో నల్లగొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున బాధితులు తరలివచ్చి తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి వాటిని పరిష్కరించాలని తమ గోడును వెలగక్కారు. జిల్లాలో పేదలు,నిరుపేదలు తమకు పింఛన్లు రావడం లేదని ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని అదేవిధంగా భూ సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరించాలని కోరారు.అయితే సోమవారం 130 మంది బాధితులు ఫిర్యాదు చేయగా అందులో 61 జిల్లా అధికారులకు, 69రెవెన్యూశాఖకు ఫిర్యాదులు రావడం జరిగింది.

### ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి: ఏర్పుల మారయ్య



తాను వికలాంగుడనని తనకు ఎవరూ లేరని గత కొన్ని సంవత్సరాలుగా ఇల్లు లేక చెట్ల కింద తల దాచుకుంటూ జీవనం కొనసాగిస్తున్నానని ప్రభుత్వం స్పందించి తమకు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని నల్లగొండ పట్టణ పరిధిలోని చర్లపల్లి గ్రామానికి చెందిన ఏర్పుల మారయ్య కోరారు. ప్రభుత్వం స్పందించి తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కలెక్టర్‌ను కోరారు.

### బ్యాటరీ ట్రై సైకిల్‌ను ఇప్పించండి: గబ్బిలాల సైదులు



నిరుపేద కుటుంబానికి చెందిన వికలాంగుల దుని తను ఎటు కదల్లేక పోతున్నానని తనకు బ్యాటరీ ట్రై సైకిల్ ని ఇప్పించాలని మిర్యాల గూడ మండలం తక్కెళ్ళపాడు గ్రామానికి చెందిన గబ్బిలాల సైదులు పజావాణిలో దరఖాస్తు చేసుకున్నారు.90శాతం వికలాంగుడిని పనిచేసుకోవడానికి ఇబ్బందిగా మారిందని సొంత పైసలతో బ్యాటరీట్రై సైకిల్ కొనలేని పరిస్థితిలో ఉన్నానని ప్రభుత్వం స్పందించి తనకు బ్యాటరీ ట్రై సైకిల్ ఇప్పించాలని కోరారు.

### పట్టా భూమిని ఆక్రమించుకున్నరు :షేక్ ఖాజా అమినుల్లా



తన సొంత పట్టా భూమిని ఆక్రమించు కొనిన వ్యక్తులపై ప్రభుత్వపరంగా తగు చర్య తీసుకొని, తనభూమి తనకు ఇప్పించి న్యాయం చేయాలని అనుముల మండలం పంగవాని కుంట కు చెందిన షేక్ ఖాజా అమినుల్లా అధికారులను కోరారు. కొత్తపల్లి రెవిన్యూ గ్రామ శివారులో సర్వెనెం 52 లో 10 గుంటల భూమిని మెగావత్ రాయమల్లు అనే వ్యక్తి ఆక్రమించుకొని భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని వారు పై చట్టపరమైన చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని కోరారు.



## ప్రజావాణిలో 146 దరఖాస్తులు

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** సీజనల్ వ్యాధులపై ప్రజలకి అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ పి.రాంబాబుతో కలిసి కలెక్టర్ ప్రజల నుండి అర్జిలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షకాలంలో గ్రామాలలో వార్డులలో ఎప్పటికప్పుడు శానిటేషన్ పనులు చేయాలని అన్నారు. ప్రజవాణిలో అర్జిలకు అధిక ప్రాధాన్యత నివ్వాలని ప్రతి అర్జికి సంబంధించి ఖచ్చితమైన సమాధానంతో కూడిన కాఫిని అర్జిదారునికి పంపాలని తెలిపారు. అలా చేయకపోతే ప్రజలు ఒకే సమస్యకి మరల దరఖాస్తు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రజావాణిలో భూ సమస్యలకి సంబంధించి 107 దరఖాస్తులు, పంచాయతీరాజ్ శాఖకి 11 దరఖాస్తులు, మున్సిపల్ కమిషనర్లకి 9 దరఖాస్తులు వచ్చాయని,ప్రజావాణిలో మొత్తం 146 దరఖాస్తులు వచ్చాయని వాటిని పరిష్కరించేందుకు సంబంధిత అధికారులకు పంపించటం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పిడి వివి అప్పారావు, ఎఫ్‌వో సతీష్‌కుమార్, డిఈవో అశోక్, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్‌రెడ్డి, డిసివో పద్మ, డిఎస్‌వో మోహన్‌బాబు, సంక్షేమ అధికారులు దయానందరాణి, శ్రీనివాసనాయక్, శంకర్, జగదీశ్వర్‌రెడ్డి, ఎవో సుదర్శన్‌రెడ్డి, సాయిగౌడ్, సంతోష్, కిరణ్ పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులకు పరిష్కారం

### యాదాద్రి జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి




**ప్రజాపక్షం/యాదాద్రి :** ప్రజావాణిలో వచ్చిన అర్జీలకు సత్వర పరిష్కారం కోసం చర్యలు చేపట్టాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల ప్రజల నుండి 81 అర్జీలను, జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరా రెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు కలసి అర్జీలను స్వీకరించారు. సంబంధిత అధికారులు దరఖాస్తులను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవెన్యూ శాఖ 59, జిల్లా పంచాయతీ శాఖ 9, జిల్లా సంక్షేమ శాఖ 3, మున్సిపాలిటీ 3, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ 2, జిల్లా విద్యా శాఖ 2, సర్వే ల్యాండ్స్, అటవీ శాఖ, విద్యుత్ శాఖలకు ఒక్కొకటి చొప్పున వచ్చాయని తెలియజేశారు. వివిధ శాఖలకు వచ్చిన దరఖాస్తులను తక్షణమే పరిశీలించి ప్రజల సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ శోభా రాణి, హౌసింగ్ పి.డి విజయ సింగ్ పాల్గొన్నారు.

## జీతాలులేక పస్తులు ఉంటున్నాం...

### ఉపాధి హామీ అధికారుల దయనీయస్థితి

**ప్రజాపక్షం/ఉండవెల్లి :** నెల నెల జీతాలు ఇస్తేనే కుటుంబం గడిపే పరిస్థితిలో ఉన్న అధికారులు జీతాలు రాక నాలుగు నెలల నుంచి ఇబ్బందులతో కుటుంబాలు నెట్టుకుంటూ సాగిస్తున్న దుస్థితి నేడు ఉపాధి హామీ పథకంలో పనిచేసే అధికారులకు ఏర్పడింది. కూలీలకు పనులు కల్పించేందుకు ప్రభుత్వం ఏపీఓలను టెక్నికల్ సిబ్బందిని ఫీల్డ్ అసిస్టెంట్లను ఏర్పాటు చేసింది. అధికారుల ద్వారా కూలీలకు పనులు కల్పించి ఉపాధి చూపేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చొరవ తీసుకోవడం జరిగింది. ప్రతి సంవత్సరంలో ఉన్నతాధికారులు టార్గెట్ ఉపాధి అధికారులకు విధించి పనులు చేయించాలని ఒత్తిడి పెట్టుతున్న సహనంతో అధికారులు అనుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు సమయానికి భోజనాలు లేకున్నా పస్తులతో పనులు చేయించి ప్రభుత్వం అధికారుల యొక్క లక్ష్యాన్ని చేరుకునేందుకు విశ్వప్రయత్నం చేస్తున్నారు. ప్రస్తుతం ఇప్పుడు వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా విరివిరిగా మొక్కలు నాటేందుకు క్షేత్రస్థాయిలో అధికారులు పనిచేస్తున్నారు. మండలానికి ఇచ్చిన టార్గెట్ పూర్తిస్థాయిలో చేసేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో పనిచేసే పరిస్థితి ఏర్పడింది. ఉన్నతాధికారుల పర్యవేక్షణలో తనిఖీలు నిర్వహించినప్పుడు ఎటువంటి లోటుపాట్లు లేకుండా ఉపాధి హామీలోని పనులన్నీ సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. జీతాలు లేకపోవడం వలన అసంతృప్తితో ఉంటూ కాలం చెల్లిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రభుత్వం వెంటనే ఉపాధి హామీ పథకంలో పనిచేసే అధికారులకు జీతాలు విడుదల చేయాలని ఉపాధి హామీ సిబ్బంది కోరుతున్నారు.





# జాతీయం
NATIONAL & GENERAL NEWS


## ఆక్సిజన్ సరఫరా తగ్గి ముగ్గురు రోగులు మృతి

**జలంధర్ :** పంజాబ్ లోని జలంధర్‌లో ప్రభుత్వ ఆస్పత్రిలో ఆదివారం సాయంత్రం ఆక్సిజన్ సరఫరా తగ్గి ముగ్గురు రోగులు ప్రాణాలు కోల్పోయారు. ఆస్పత్రిలో ఆక్సిజన్ సరఫరా మార్చేటప్పుడు సాంకేతిక లోపం తలెత్తింది. ఆక్సిజన్ ప్రెజర్ పడిపోవడంతో సరఫరా తగ్గి వెంటిలేటర్‌పై ఉన్న ముగ్గురు రోగుల ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. సాంకేతిక సమస్య వల్ల ఆక్సిజన్ సరఫరా కొద్దిగా తగ్గిన వెంటనే బ్యాకప్ సిలిండర్లను ప్రారంభించడంతోపాటు ప్రధాన ఆక్సిజన్ ప్లాంట్ లోని సాంకేతిక లోపాన్ని కూడా సరిదిద్దినట్టు సీనియర్ మెడికల్ ఆఫీసర్ విజయ్ ఆనంద్ విలేకరులకు చెప్పారు.

# పార్లమెంట్‌లో వాయిదాల పర్వం

## మధ్యాహ్నం 2గంటల వరకు ఉభయసభలు మూడుసార్లు వాయిదా

## 'ఎస్ఐఆర్'పై చర్చ చేపట్టాలని ప్రతిపక్ష ఎంపిల ఆందోళన



**న్యూఢిల్లీ :** పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో వాయిదాల పర్వం కొనసాగుతూనే ఉంది. సోమవారం లోక్‌సభ, రాజ్యసభ మధ్యాహ్నం 2 గంటల నాటికే మూడుసార్లు వాయిదా పడ్డాయి. వారం రోజుల అవాంతరాలు, ప్రతిష్టంభన అనంతరం పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సోమవారం తిరిగి ప్రారంభయ్యాయి. 11 గంటలకు లోక్‌సభ, రాజ్యసభ ప్రారంభం కాగానే విపక్ష సభ్యులు ఆందోళనకు దిగారు. బిహార్‌లో 'సర్' పేరుతో ఇసి చేపట్టిన ఓటర్ల జాబితా సవరణపై నిరసన తెలిపారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఎస్ఐఆర్‌ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లోక్‌సభలో ఎస్ఐఆర్ అంశంతో పాటు ఆపరేషన్ సిందూర్‌పై చర్చ ప్రారంభం ఆలస్యం కావడంతో ప్రతిపక్ష ఎంపిలు ఆందోళనకు దిగారు. కాగా, ఉదయం సభ ప్రారంభం కాగానే ఆపరేషన్ సిందూర్‌పై చర్చ తర్వాత, బిహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఆఆర్) ఓటర్ల జాబితాపై చర్చకు ప్రభుత్వం నుండి హామీ కోరుతూ ప్రతిపక్ష సభ్యులు లోక్‌సభ వెల్‌లోకి దిగి నినాదాలు చేశారు. దీంతో ఎస్ఐఆర్‌పై చర్చకు హామీ ఇవ్వడానికి ముందస్తు షరతు పెట్టడం ద్వారా ఆపరేషన్ సిందూర్‌పై చర్చను ప్రారంభించాలనే తమ నిబద్ధతను ప్రతిపక్ష సభ్యులు వెనక్కి తీసుకుంటున్నారని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా పేర్కొన్నారు. సభను మధ్యాహ్నం 1 గంట వరకు వాయిదా వేశారు. ఈ అంశాలపై ఇంకా సమావేశం కాకపోవడంతో, స్పీకర్ సభ మధ్యాహ్నం 1 గంటలకు సమావేశమైనప్పుడు మళ్ళీ మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. గత వారం పార్లమెంటులోని అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లతో జరిగిన సమావేశంలో ప్రతిపక్ష నాయకులు ఎస్ఐఆర్‌పై చర్చ కోరాల్సిందని స్పీకర్ అన్నారు. ఆపరేషన్ సిందూర్ పై చర్చ కావాలంటే సభ్యులు తమతమ సీట్లకు తిరిగి వెళ్లాలని, వెల్‌లోకి వచ్చి ఏ అంశంపైనా చర్చను డిమాండ్ చేయలేరన్నారు. సభ నియమ నిబంధనల ప్రకారం నడుస్తుందని చెప్పుకొచ్చారు. మరోవైపు రాజ్యసభలనూ వాయిదాల పర్వం కొనసాగింది. బిహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియపై ప్రతిపక్ష ఎంపిలు నిరసన కొనసాగించడంతో సభకు తీవ్ర అంతరాయం కలిగింది. భోజనానికి ముందు సమావేశాలు రెండుసార్లు వాయిదా పడిన తర్వాత, మరోసారి మధ్యాహ్నం 2 గంటల తర్వాత మంగళవారానికి వాయిదా పడింది. జీరో అవర్ సమయంలో డిప్యూటీ చైర్మన్ హరివంశ్ మాట్లాడుతూ, ఎస్ఐఆర్, ఇతర రాష్ట్రాల్లో బెంగాలీ వలస కార్మికులపై వివక్ష చూపుతున్నారని ఆరోపిస్తూ వివిధ అంశాలపై చర్చించాలని కోరుతూ రూల్ 267 కింద తనకు 26 నోటీసులు వచ్చాయని చెప్పారు. వాయిదా నోటీసులన్నింటినీ ఆయన తిరస్కరించారు. సుధా మూర్తి (నామినేట్ చేయబడిన సభ్యురాలు) జీరో అవర్‌లో ప్రస్తావించాలని పిలుపునిచ్చారు. అయితే, టిఎంసి, కాంగ్రెస్ సభ్యులు సహా ప్రతిపక్షసభ్యులు చైర్మన్ నిర్ణయాన్ని నిరసిస్తూ నిలబడ్డారు. 'ఓట్ కి చోరీ బంద్ కరో' (ఓటు దొంగతనం ఆపండి) వంటి నినాదాలు చేశారు. దీంతో చైర్మన్ మధ్యాహ్నం 12 గంటల వరకు కార్యకలాపాలను వాయిదా వేశారు. మధ్యాహ్నం 12 గంటలకు ప్రశ్నోత్తరాల సమయం కోసం సభ తిరిగి సమావేశమైన వెంటనే, వివిధ ప్రతిపక్ష ఎంపిలు లేచి నిలబడ్డారు, సుష్మితా దేవ్ (టిఎంసి) వెల్‌లోకి దూసుకెళ్లి వివిధ అంశాలను లేవనెత్తడానికి ప్రయత్నించారు. గందరగోళం కొనసాగుతుండగా, కార్యకలాపాలు మళ్ళీ మధ్యాహ్నం 2గంటల వరకు వాయిదా పడ్డాయి. ఎగువ సభ మధ్యాహ్నం 2 గంటలకు సమావేశమైనప్పుడు, ది క్యారేజ్ ఆఫ్ గూడ్స్ బై సి బిల్లు 2025పై చర్చను కొనసాగించడానికి చైర్మన్ ప్రయత్నించారు. అయితే, ప్రతిపక్ష ఎంపిలు ఎస్ఐఆర్ అంశంపై చర్చ చేపట్టాలని, దానిని నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేస్తూనే ఉన్నారు. ఆ సమయంలో కొంతమంది ఎంపిలు సభ వెల్‌లోకి దూసుకెళ్లారు. కోలాహలం మధ్య, చైర్మన్ సభను మంగళవారానికి వాయిదా వేశారు. ముందుగా, సభ సమావేశమైనప్పుడు, కొత్తగా ఎన్నికైన రాజ్యసభ సభ్యులు ఐఎస్ ఇన్బాదురై, ఎం ధనపాల్ ప్రమాణ స్వీకారం చేశారు.

## ప్రజల హక్కుల కోసం గళాన్ని వినిపిస్తూనే ఉంటాం : ఖర్గే




**న్యూఢిల్లీ :** బిహార్‌లో ఎన్నికల కమిషన్ ఓటర్ల జాబితా సవరణకు వ్యతిరేకంగా కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీతో సహా ఇండియా కూటమి పార్టీలకు చెందిన పలువురు ఎంపిలు సోమవారం పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో నిరసనతెలిపారు.ఓటర్లజాబితా సవరణ ప్రక్రియను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో కార్యకలాపాలకు ముందు, సోనియా గాంధీ, ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా, సమాజ్‌వాదీ పార్టీ అఖిలేష్ యాదవ్, టిఎంసికి చెందిన డెరెక్ ఓ'బ్రెయిన్, సాగరికా ఘోష్, డిఎంకెకు చెందిన కనిమొళి, ఎ రాజా, ఇతరులు బిహార్‌లో ఓటర్ల జాబితాల ప్రత్యేక ఇంటెన్సివ్ సవరణ (ఎస్ఐఆర్)కు వ్యతిరేకంగా నినాదాలు చేసి నిరసన తెలిపారు. పార్లమెంట్ మకర్ ద్వారం మెట్లపై, సమీపంలో వరుసగా ఐదవ రోజు కూడా వారు వరుసలో నిలబడి 'ఎస్ఐఆర్ ప్రజాస్వామ్యంపై దాడి' అని రాసి ఉన్న భారీ బ్యానర్ ప్రదర్శించారు. 'స్టాప్ ఎస్ఐఆర్' ప్లకార్డులతో, కాంగ్రెస్, డిఎంకె, టిఎంసి, సమాజ్ వాదీ పార్టీ, ఆర్‌జెడి, వామపక్ష పార్టీలతో సహా ప్రతిపక్షాలకు చెందిన అనేక మంది ఎంపిలు నిరసనలో పాల్గొని నినాదాలు చేశారు. 'పార్లమెంటులో ఇండియా కూటమి ప్రజల హక్కుల కోసం గళాన్ని వినిపిస్తూనే ఉంటుంది. బలహీన వర్గాల ఓటు హక్కులను క్రమపద్ధతిలో హరించడానికి దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ అమలు చేయడాన్ని సహించము'అని ఖర్గే ఎక్స్‌లో పోస్టు చేశారు. ఆర్ఎస్ఎస్, బిజెపి మనువాది మనస్తత్వం ప్రజాస్వామ్యం, రాజ్యాంగంపై ఆధిపత్యం చేయడానికి తాము అనుమతించమన్నారు.

టిసిఎస్‌లో 12 వేల మంది ఉద్యోగుల తొలగింపు

## టెక్ కంపెనీలతో టచ్‌లో కేంద్రం

**న్యూఢిల్లీ:** ప్రముఖ ఐటి దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్) ఈ సంవత్సరం తన గ్లోబల్ వర్క్‌ఫోర్స్‌లో దాదాపు 12,000 మంది ఉద్యోగులను తొలగిస్తున్నట్లు ఇదివరకే ప్రకటించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో తమ ఉద్యోగుల్లో రెండు శాతం, అంటే దాదాపు 12 వేలకు పైగా ఉద్యోగాల కోత విధించనున్నట్లు వెల్లడించింది. అయితే ఈ నిర్ణయంపై కేంద్ర ఐటి మంత్రిత్వ శాఖ దృష్టిసారించినట్లు తెలుస్తోంది. మొత్తం పరిస్థితిని కేంద్రం నిశితంగా గమనిస్తోందని, టెక్ కంపెనీతో టచ్‌లో ఉన్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఉపాధిలో వృద్ధి కేంద్ర ప్రభుత్వ కీలక ప్రాధాన్యంగా ఉందని, ఉపాధి ఆధారిత ప్రోత్సాహకం (ఇఎల్ఐ) వంటి కార్యక్రమాలతో ఉద్యోగావకాశాలను ఎలా పెంచవచ్చనే అంశంపైనా దృష్టి సారించినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. నైపుణ్య శిక్షణ, పునః నైపుణ్య శిక్షణకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుత పరిస్థితులను ఐటీ మంత్రిత్వశాఖ గమనిస్తోందని, టెక్ సంస్థ టిసిఎస్‌తో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలుస్తోంది. ఈ నిర్ణయం వెనుక ఉన్న కారణాలను తెలుసుకునేందుకు లోతుగా అధ్యయనం చేయనున్నట్లు సమాచారం. ఆర్థిక సంవత్సరం (2025–26)లో 12,261 మంది ఉద్యోగులను అంతర్జాతీయంగా తొలగించడానికి సన్నాహాలు ఏర్పాటు చేస్తున్నట్లు టిసిఎస్ సిఇఒ కె.కృతివాసన్ ఓ ప్రకటనలో వెల్లడించారు. కొత్త సాంకేతికతలను ముఖ్యంగాకృత్రిమమేధ(ఎఐ)టెక్నాలజీ,అంతర్జాతీయఅనిశ్చితుల మార్పుల కారణంగానే ఈ తొలగింపులు చేయాల్సి వస్తున్నట్లు తెలిపారు. 'భవిష్యత్తు కోసం సిద్ధమయ్యే ప్రయాణంలో సంస్థ ఉంది. ఇందుకోసం సిబ్బందికి నూతన సాంకేతికతల్లో శిక్షణ ఇస్తున్నాం. ప్రత్యామ్నాయం కల్పించలేని పరిస్థితుల్లోనే కొంత మందిని తొలగించాలని నిర్ణయించాం. 6,13,069 మంది ఉద్యోగుల్లో వీరు 2 శాతానికి సమానం. ప్రధానంగా మధ్య, సీనియర్ స్థాయి మేనేజర్లపై ఈ ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉంది' అని ఒక అధికార ప్రకటనలో టీసీఎస్ పేర్కొంది. 30 జూన్ 2025 నాటికి టిసిఎస్ ఉద్యోగుల సంఖ్య 6,13,069గా ఉంది. ఇటీవల ముగిసిన ఏప్రిల్‌జూన్ త్రైమాసికంలో ఐదు వేల మందిని పెంచుకుంది.

## చికెన్ పేరుతో గబ్బిలాల మాంసం అమ్మకం

**సేలం :** గబ్బిలాలను వేటాడి మాంసం వండుతారు. ఆ మాంసాన్ని చికెన్ అని చెప్పి విక్రయిస్తారు. ఇద్దరు వ్యక్తులు చాలారోజులుగా ఈ వ్యవహారం నడిపిస్తున్నారు. తమిళనాడు సేలం జిల్లాలో ఈ దారుణ ఘటనకు సంబంధించిన సమాచారం తాజాగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు నిందితులు ఇద్దరినీ అరెస్ట్ చేశారు. సేలం జిల్లాకు చెందిన ఇద్దరు వ్యక్తులు ఒమలూర్ సమీపంలోనిడానిష్‌పేట్టైవద్ద గబ్బిలాలను వేటాడి, వాటిని వండుతున్నారు. అలా వండిన మాంసాన్ని చికెన్ పేరు చెప్పి విక్రయిస్తున్నారు. తోప్పూర్ రామస్వామి అటవీ పరిధిలో పలుమార్లు గన్‌షాట్‌ల శబ్దాలు వినిపించినట్టు తాజాగా అటవీ అధికారులకు సమాచారం అందింది. ఫారెస్ట్ రేంజర్ విమల్ కుమార్‌నేతృత్వంలోని ఒక బృందం ఎంక్వయిరీ చేపట్టింది. ఇద్దరు వ్యక్తులు ఫ్రూట్ బ్యాట్‌ల (పండ్లు తినే గబ్బిలాలు)ను వేటాడి, వాటిని వండి, చికెన్‌లా విక్రయిస్తున్నట్లు విచారణలో తేలింది.ఆ ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. ఒకరి పేరు కమల్, మరొకరి పేరు సెల్వం అని గుర్తించారు.

# మరో ఆలయంలో తొక్కిసలాట



**ఇద్దరు మృతి, 32 మందికి గాయాలు, కొందరి పరిస్థితి విషమం**

**ఉత్తర్‌ప్రదేశ్‌లోని అవసనేశ్వర్ ఆలయంలో ఘటన**

**బారాబంకి :** ఉత్తర్‌ప్రదేశ్ హరిద్వార్‌లోని కొండపై ఉన్న మానసాదేవి ఆలయం వద్ద తొక్కిసలాట జరిగి ఆరుగురు ప్రాణాలు కోల్పోయిన ఘటన నుంచి తేరుకోకముందే రాష్ట్రంలోని మరో ఆలయం వద్ద తొక్కిలాట జరిగింది. ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందారు. మరో 32 మంది గాయపడ్డారు. సోమవారం తెల్లవారుజామున బారాబంకిలో ఉన్న ఆలయంలో కోతులు విద్యుత్‌వైర్‌ను కొరికివేసి కింద పడేయంతో భక్తులు భయంతో ఒక్కసారిగా పరుగులు తీశారని, దీంతో ప్రమాదం జరిగినట్లు అధికారులు తెలిపారు. శ్రావణ మాసం సందర్భంగా హైదర్‌గఢ్ ప్రాంతంలోని అవసనేశ్వర్ ఆలయంలో భక్తులు 'జలాభిషేకం' (ఒక ఆచారంగా నీటిని సమర్పించడం) కోసం ఆలయానికి భారీగా తరలిరావడంతో ఈ సంఘటన జరిగింది. తీగ తెగిపోవడంతో విద్యుత్ ప్రవాహం టిన్ షెడ్ గుండా వ్యాపించి, ఆలయ ప్రాంగణంలో భయాందోళనలు మరియు తొక్కిసలాటకు దారితీసింది. లోనికాత్ర పోలీస్ స్టేషన్ పరిధిలోని ముబారక్‌పురా గ్రామానికి చెందిన ప్రశాంత్ (22), త్రివేదిగంజ్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సిహెచ్‌సి)లో చికిత్స పొందుతూ మరో 30 ఏళ్ల భక్తుడు మరణించారని అధికారులు తెలిపారు. గాయపడిన 10 మందిని త్రివేదిగంజ్ సిహెచ్‌సికి తరలించారు. వారిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉండటంతో వారిని ఉన్నత వైద్య కేంద్రాలకు తరలించారు. క్షతగాత్రులైన మరో 26 మంది భక్తులు హైదర్‌గఢ్ సిహెచ్‌సిలో చికిత్స పొందుతుండగా, వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉండటంతో వారిని అధునాతన చికిత్స కోసం తరలించారు. ఈ సంఘటన తర్వాత, ఆలయం మరియు పరిసర ప్రాంతాలలో గందరగోళం నెలకొంది. జిల్లా, పోలీసు అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని నియంత్రించడానికి తీవ్రంగా ప్రయత్నించారు. ఘటనకు గల కచ్చితమైన కారణాన్ని తెలుసుకోవడానికి దర్యాప్తు జరుగుతోంది. జలాభిషేకం కోతులు విద్యుత్ తీగను కొరికివేశాయని, దీని వల్ల ఆలయ సముదాయంలోని మూడు టిన్ షెడ్‌ల ద్వారా విద్యుత్ ప్రవహించిందని బారాబంకి జిల్లా మేజిస్ట్రేట్ శశాంక్ త్రిపాఠి తెలిపారు. ఫలితంగా జరిగిన తొక్కిసలాటలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారని, రెండు డజన్ల మందికి పైగా గాయపడ్డారని ఆయన తెలిపారు. తరువాత భక్తులు ఆలయంలో తమ పూజలను తిరిగి ప్రారంభించారు. ప్రాణనష్టం పట్ల ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపాన్ని తెలిపారు.

# విచారణ కమిటీ ముందు ఎందుకు హాజరయ్యారు?

**నివేదిక వచ్చేవరకు ఎందుకు ఆగారు..**

**జస్టిస్ యశ్వంత్‌వర్మకు ప్రశ్నలు సంధించిన 'సుప్రీం'**

**30కి విచారణ వాయిదా**



**న్యూఢిల్లీ :** ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేస్తున్న సమయంలో తన అధికారిక నివాసం నుంచి కాలిన నగదు నోట్ల కట్టలు భారీమొత్తంలో కనుగొన్న ఘటనపై అంతర్గత విచారణ కమిటీ తనపై ఇచ్చిన నివేదిక రద్దుచేయాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు సోమవారం జస్టిస్ యశ్వంత్‌వర్మను ప్రశ్నించింది. 'మీరు విచారణ కమిటీ ముందు అప్పుడు ఎందుకు హాజరయ్యారు?. ఆ వీడియో తొలగించాలని మీరు కోర్టుకు వచ్చారా? విచారణ కమిటీ విచారణను పూర్తి చేసి నివేదికను విడుదల చేసేంతవరకూ మీరు ఎందుకు వేచిఉన్నారు? ముందుగా అక్కడ అనుకూలమైన ఉత్తర్వు వస్తుందని అవకాశం తీసుకున్నారా?'అని న్యాయమూర్తులు జస్టిస్ దీపాంకర్ దత్త, ఎజి.మాసిహ్‌లతో కూడిన డివిజన్ బెంచ్ జస్టిస్ యశ్వంత్‌వర్మ తరపున ప్రాతినిథ్యం వహించిన సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్‌ను అడిగింది. తన పిటిషన్‌లో ఏ పార్టీలను దాఖలు చేశారనే విషయాన్ని సుప్రీంకోర్టు మరింత లోతుగా ప్రశ్నించింది.ఆయన తన పిటిషన్‌తో పాటు తప్పకుండా అంతర్గత విచారణ నివేదికను కూడా దాఖలు చేయాలని ధర్మాసనం సూచించింది. ఆర్టికల్ 124 (సుప్రీంకోర్టు స్థాపన, రాజ్యాంగం) కింద ఒక ప్రక్రియ ఉందని, న్యాయమూర్తి ప్రజాచర్చకు సంబంధించిన అంశంగా ఉంటారు అని కపిల్ సిబల్ సమర్పించారు.'సుప్రీం కోర్టు వెబ్‌సైట్‌లో వీడియో విడుదల రాజ్యాంగం స్కీమ్ ప్రకారం... ప్రజల ఆగ్రహం, న్యాయమూర్తులపై మీడియా ఆరోపణలు నిషేధించబడ్డాయి' అని సిబల్ జోడించారు. ఒక పేజీ బుల్లెట్ పాయింట్లతో వచ్చి పార్టీల మెమోను సవరించాలని అత్యున్నత న్యాయస్థానం కపిల్ సిబల్‌ను కోరింది. అనంతరం ఈ అంశంపై తదుపరి విచారణను జులై 30కు వాయిదా వేసింది. మే 8న అప్పటి భారత ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా తనపై అభిశంసన ప్రక్రియను ప్రారంభించాలని పార్లమెంట్‌ను కోరుతూ చేసిన సిఫారసును రద్దు చేయాలని జస్టిస్ యశ్వంత్‌వర్మ కోరారు. తనపై మోపబడిన అభియోగాలను దర్యాప్తు చేసి 'నిరూపించాల్సిన రుజువు భారాన్ని విచారణ తిప్పికొట్టింది' అని అతని పిటిషన్‌లో పేర్కొన్నారు. అంతర్గత విచారణ కమిటీ ఫలితాలు ముందస్తు కథనం ప్రకారం ఉన్నాయని జస్టిస్ వర్మ ఆరోపించారు. విచారణ కాలక్రమాలు (టైమ్ లైన్స్) చాలా నెమ్మదిగా సాగుతోందని, విచారణను త్వరగా ముగించాలని అభ్యర్థించారు.

## ఈసారి సాధారణం కంటే 7శాతం ఎక్కువగా వర్షాలు : ఐఎండి

**న్యూఢిల్లీ:** దేశంలో రుతుపవనాలు ప్రారంభమైనప్పటి నుంచి సాధారణం కంటే 7 శాతం ఎక్కువగా వర్షపాతం నమోదు అయినట్లు భారత వాతావరణ శాఖ (ఐఎండి) తెలిపింది. అయితే కొన్ని రాష్ట్రాల్లో ఎక్కువగా వర్షాలు పడితే, మరికొన్ని రాష్ట్రాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదు అయ్యిందని పేర్కొంది. రుతుపవనాలు మొదలైనప్పటి నుంచి దేశంలో 447.8 మి.మీ వర్షం కురిసిందని చెప్పింది. వాస్తవానికిమనదేశంలోసాధారణవర్షపాతం 418.9 మి.మీ ఉంటుంది. రాజస్థాన్,లడాఖ్,నాగాలాండ్,మణిపూర్, సిక్కింలలో ఎక్కువగా వర్షాలు పడ్డాయి. సాధారణంగా రాజస్థాన్‌లో 220.4 మి.మీ వర్షపాతం ఉంటుంది. కానీ ఈసారి 92శాతంఅధికంగా 384.7మి.మీ మేర వర్షపాతం నమోదు అయ్యింది. సాధారణంగా తక్కువ వర్షపాతం నమోదయ్యే లడాఖ్‌లో ఈసారి 10.7 మి.మీకి బదులుగా 30 మి.మీ వర్షపాతం నమోదైంది.అంటే 181శాతం ఎక్కువ ఇక్కడ వర్షాలు పడ్డాయి. నాగాలాండ్‌లో 514.5 మి.మీ, మణిపూర్‌లో 557.9 మి.మీ వర్షపాతం నమోదైంది. సాధారణంగానూ ఇక్కడ ఇదే రేంజ్‌లో వర్షం పడుతూ ఉంటుంది. అయితే సిక్కింలో 598.4 మి.మీ వర్షం పడింది. ఇది సాధారణం కంటే 78 శాతం ఎక్కువ. అధిక వర్షపాతం (2059 శాతం ఎక్కువగా) వర్షపాతం నమోదైన రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోమధ్యప్రదేశ్,గుజరాత్,దాద్రాఅండ్ నగర్ హవేలీ, దమన్ అండ్ దీవ్, జార్ఖండ్, అసోం ఉన్నాయి. మధ్యప్రదేశ్‌లో 418.4 మి.మీలకు బదులుగా 645.8 మి.మీ వర్షపాతంనమోదైంది.ఇది సాధారణం కంటే 54 శాతం ఎక్కువ. గుజరాత్‌లో 463.2 మి.మీ (35 శాతం ఎక్కువ) వర్షపాతం నమోదైంది.ఇక కేంద్రపాలిత ప్రాంతాలైన దాద్రా అండ్ నగర్ హవేలీ,దమన్‌అండ్ దీవ్‌ల్లో 1153.8 మి.మీలకు బదులుగా1466.1మి.మీ వర్షం కురిసింది. ఇది సాధారణం కంటే 27 శాతం ఎక్కువ. కాగా ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ, హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, ఢిల్లీ, హరియాణా, మహారాష్ట్ర, కర్ణాటక, కేరళ, తమిళనాడు, ఒడిశా, గోవా, త్రిపుర, మిజోరం, బంగాల్, జమ్ముకశ్మీర్, ఛత్తీస్‌గఢ్, పుదుచ్చేరి సహా అండమాన్, నికోబార్ దీవుల్లో సాధారణ వర్షపాతం నమోదైంది.

## బిహార్‌లో ముసాయిదా

## ఓటర్ల జాబితా ప్రచురణపై 'స్టే' ఇవ్వలేం

**న్యూఢిల్లీ :** ఎన్నికలు జరుగనున్న బిహార్‌లో ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణపై మధ్యంతర స్టే విధించచడానికి సోమవారం సుప్రీంకోర్టు నిరాకరించింది. ఎన్నికల కమిషన్‌కు సంబంధించిన 'ప్రత్యేక ముమ్మర సవరణ' (ఎస్ఐఆర్) ఓటర్ల జాబితాకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లు అన్నింటినీ ఒకేసారి నిర్ణయిస్తామని స్పష్టంచేసింది. న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జోయ్‌మాల్యా బాగ్చి నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం మాట్లాడుతూ ఈ విషయమై తుది విచారణను జులై 29 (మంగళవారం)న ఖరారు చేయనున్నట్లు తెలిపింది. ఎన్‌జిఓ తరపున హాజరైన సీనియర్ న్యాయవాది గోపాల్ శంకరనారాయణన్ తన వాదనలు వినిపిస్తూ ఓటర్ల జాబితాను ఖరారు చేయవద్దని, ముసాయిదా జాబితా ప్రచురణపై తాత్కాలిక స్టే విధించాలని కోరారు. పిటిషనర్లు మధ్యంతర ఉత్తర్వు కోసం ఒత్తిడి చేయలేదని, అందువల్ల ఇప్పుడు చేయలేమని, ఈ విషయాన్ని ఒకేసారి అర్థం చేసుకుంటామని ధర్మాసనం తెలిపింది. బిహార్‌లో ప్రత్యేక ముమ్మర సవరణ ప్రక్రియ కోసం ఆధార్‌ను ఐడిగా అంగీకరించడం కొనసాగించాలని ఎన్నికల సంఘాన్ని కోరింది. రెండు పత్రాలు నిజమైనవని ముందస్తు అంచనా ఉందని, ఆ ఆదేశానికి అనుగుణంగా నడుచుకోవాలని ధర్మాసనం చెప్పింది. కోర్టు స్పందిస్తూ తన ప్రాథమిక విచారణలో అత్యున్నత న్యాయస్థానం ఆదేశాన్ని అంగీకరిస్తున్నామని ఎన్నికల సంఘం (ఇసి) చెప్పిందని, ఇసి తన కౌంటర్ అఫిడవిట్‌లో ఆధార్, ఓటర్ కార్డులు, రేషన్‌కార్డులను అవసరమైన పత్రాలుగా అంగీకరిస్తామని తెలియజేసిందని గుర్తుచేసింది. రేషన్ కార్డుల విషయానికి వస్తే నకిలీ కార్డులను సులభంగా పొందవచ్చని మనం చెప్పవచ్చు. కానీ ఆధార్‌కార్డు, ఓటర్ కార్డులు కొంత పవిత్రత ఉందని, అవి నిజమైనవిగా భావిస్తున్నారని, మీరు ఆ డాక్యుమెంట్లను అంగీకరించడాన్ని కొనసాగించండని ధర్మాసనం చెప్పింది.


ఫారం-7

(చట్టం - 30/2013 లోనిసెక్షన్ 19(1) లోని సబ్ రూల్ (1) రూల్ 25 ప్రకారం)

తెలంగాణ ప్రభుత్వం

రెవిన్యు (భూసేకరణ) శాఖ

రూఢీ ప్రకటన

G/49/2025 తేది: 18.07.2025

ఫైల్ నెం. సి/38/2023 తేది: .07.2025

తెలంగాణ ప్రభుత్వం/జిల్లా కలెక్టర్, నల్లగొండ గారి ఆదేశానుసారం **నల్లగొండ జిల్లా, కట్టంగూర్ మండలం, కట్టంగూర్** గ్రామంలో భూమి విస్తీర్ణం ఎ. **16.18½ గుం.** పట్టాభూమిని ప్రజాప్రయోజనార్థం **ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్ట్ యందుగల ఉదయ సముద్రం లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌లో** భాగంగా డి-8, కుడి ప్రధాన కాలువ కిమీ. 17.200 నుండి కిమీ. 18.535 & డి-7 కిమీ. 14.291 నుండి కిమీ. 14.900 & 27ఎల్ మైనర్ కాలువ కిమీ. 0.685 నుండి కిమీ. 1.240 మరియు 24ఎల్ మైనర్ కాలువ కిమీ. 0.000 నుండి కిమీ. 1.025 వరకు కాలువ కోసం సర్వే నెంబర్లలో 31, 35, 37, 38, 40, 43, 66, 67, 65, 64, 307, 309, 553, 554, 552, 568, 567, 434, 420, 419, 415, & 416 ఈ దిగువ చూపిన భూమి అవసరము అయి ఉన్నదని భావించినారు.

కావున ఈ ప్రాజెక్టు క్రింద **నల్లగొండ జిల్లా, కట్టంగూర్ మండలం, కట్టంగూర్** గ్రామంలో విస్తీర్ణం ఎ. **16.18½ గు.లు** భూమి ఈ క్రింద చూపిన విధముగా భూసేకరణ నిమిత్తం రూఢీ ప్రకటన జారిచేయనైనది.

షెడ్యూల్

గ్రామం: కట్టంగూర్ మండలం: కట్టంగూర్ జిల్లా: నల్లగొండ

| [illegible] | సర్వే నెం. భూమి స్వభావం ఖుష్కి/తరి | భూసేకరణ చేయు విస్తీర్ణం ఎ.గుం. | భూమిని కోల్పోయే రైతు / అనుభవదారు పేరు తండ్రి / భర్త పేరు | ప్రదేశముపై ఉన్న చెట్లు నిర్మాణములో ఉన్న ఇతరములు |
|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 |
| | | రీచ్ డి-8 కుడి ప్రధాన కాలువ కి.మీ. 17.200 నుండి 18.535 | | |
| 1 | 31 ఖుష్కి / పట్టా 2.03 1/2 | 0.20 | చింతల ఎల్లయ్య తండ్రి నర్సయ్య | -- |
| 2 | | 0.07 | రూపాని బిక్షం తండ్రి ఈదయ్య | -- |
| 3 | | 0.07 | రూపాని సైదులు తండ్రి లింగయ్య | |
| 4 | | 0.16 1/2 | ఐతగొని సైదులు తండ్రి వెంకులు | బోరు,పైప్‌లైన్, 8 నిమ్మ చెట్లు |
| | | 0.16 1/2 | ఐతగొని ఎల్లయ్య తండ్రి వెంకులు | 48 నిమ్మ చెట్లు |
| | | 0.16 1/2 | ఐతగొని జానయ్య తండ్రి వెంకులు | 49 నిమ్మ చెట్లు |
| 5 | 35 ఖుష్కి / పట్టా 0.31 1/2 | 0.04 1/4 | ఐతగొని నగేష్ తండ్రి అంజయ్య | పైప్ లైన్ |
| | | 0.04 1/2 | ఐతగోని సైదులు తండ్రి అంజయ్య | -- |
| | | 0.04 1/4 | ఐతగోని లక్ష్మీ నారాయణ తండ్రి అంజయ్య | -- |
| 6 | | 0.18 1/2 | పచ్చవ లక్ష్మ మ్మ భర్త వెంగయ్య | 20 రాతి కడీలు |
| 7 | 37 ఖుష్కి / పట్టా 0.17 1/2 | 0.09 | పొగుల అచ్చమ్మ భర్త నారయ్య | హెచ్.పి.సి.ఎల్. పైప్ లైన్ |
| 8 | | 0.06 1/2 | రాజీపేట శైలజ భర్త అమరేందర్ | -- |
| 9 | | | రాజీపేట అమరేందర్ తండ్రి బ్రహ్మాచారి | -- |
| 10 | | 0.02 | ఎర్కల సత్తయ్య తండ్రి వీరయ్య | 2 మామిడి చెట్లు 8 తాటి చెట్లు |
| 11 | 38 ఖుష్కి / పట్టా 0.20 | 0.20 | ఎర్కల పద్మావతి భర్త సతయ్య | -- |
| 12 | 40 ఖుష్కి / పట్టా 1.11 1/2 | 0.12 | ఎర్కల పెంటయ్య తండ్రి ఈదయ్య | |
| 13 | | 0.04 1/2 | కన్నె నాగేశ్వరి భర్త రాజాలు | |
| 14 | | 0.07 1/2 | గొట్టిపర్తి సుధీర్ గౌడ్ తండ్రి లక్ష్మీ దాస్ | 18 పామాయిల్ చెట్లు, పైప్‌లైన్ |
| 15 | | 0.07 1/2 | గొట్టిపర్తి వినూత్న భర్త సుధీర్ గౌడ్ | 18 పామాయిల్ చెట్లు, పైప్‌లైన్ |
| 16 | | 0.20 | పోగుల రాములు తండ్రి వెంకట్రాములు | 8 తాటి చెట్లు |
| 17 | 43 ఖుష్కి / పట్టా 0.35 1/2 | 0.12 | సుంకరబోఇన శంకర్ తండ్రి సోములు | పైప్ లైన్ |
| 18 | | 0.06 1/2 | పోడిచేటి సైదులు తండ్రి రాములు | -- |
| 19 | | 0.10 | సుంకరబోఇన శంకర్ తండ్రి సోములు | -- |
| 20 | | 0.07 | గడగొని ఎల్లమ్మ భర్త ఆశయ్య | 1 బోర్, పైప్‌లైన్ |
| 21 | 66 ఖుష్కి / పట్టా 0.35 1/2 | 0.07 | గడగొని ఆశయ్య తండ్రి ముత్తిలింగయ్య | -- |
| 22 | | 0.03 3/4 | గడగొని శ్రీను తండ్రి రాములు | 1 తాటి చెట్టు |
| | | 0.03 3/4 | రూపాని శ్రీశైలం తండ్రి వెంకన్న | -- |
| 23 | | 0.05 | రూపాని శ్రీశైలం తండ్రి వెంకన్న | 1 తాటి చెట్టు |
| 24 | | 0.04 1/2 | మదగొని సోములు తండ్రి మల్లయ్య | 1 తాటి చెట్టు |
| 25 | | 0.11 1/2 | గడగొని ఎల్లమ్మ భర్త ఆశయ్య | -- |
| 26 | 67 ఖుష్కి / పట్టా 0.03 | 0.03 | గడగొని రేణుక తండ్రి లక్ష్మీ నారాయణ | -- |
| 27 | 65 ఖుష్కి / పట్టా 0.32 | 0.25 | మదగొని సోములు తండ్రి మల్లయ్య | -- |
| 28 | | 0.07 | పొడిచెట్టి కళ్ళమ్మ భర్త నరసింహ | -- |
| 29 | 64 ఖుష్కి / పట్టా 0.02 | 0.02 | గుండు నాగమ్మ భర్త సైదులు | -- |
| | | 27L Minor fro Km. 0.685 to 1.240 | | |
| 30 | 307 ఖుష్కి / పట్టా 1.01 | 0.09 1/2 | బందే నర్సిరెడ్డి తండ్రి నారాయణ రెడ్డి | 29 నిమ్మ చెట్లు 14 తాటి చెట్లు |
| 31 | | 0.14 1/2 | ఊటుకూరి నగి రెడ్డి తండ్రి వెంకట్ రెడ్డి | 40 నిమ్మ చెట్లు 30 తాటి చెట్లు |
| 32 | | 0.09 | ముదిరెడ్డి వెంకటరమణ రెడ్డి తండ్రి బిక్షంరెడ్డి | 9 తాటి చెట్లు 15 వేప చెట్లు 1 దిరిశన చెట్టు |
| 33 | | 0.08 | పోడిశెట్టి రామలింగయ్య తండ్రి లింగయ్య | 10 మామిడి చెట్లు 11 తాటి చెట్లు 2 నిమ్మ చెట్లు |
| 34 | 309 ఖుష్కి / పట్టా 0.32 | 0.09 | పోడిశెట్టి రామలింగయ్య తండ్రి లింగయ్య | -- |
| 35 | | 0.10 1/2 | పోడిశెట్టి శంకరయ్య తండ్రి లింగయ్య | -- |
| 36 | | 0.12 1/2 | పోడిశెట్టి బిక్షమయ్య తండ్రి లింగయ్య | -- |
| | | Reach D7 from Km.14.291 to 14.900 | | |
| 37 | 553 ఖుష్కి / పట్టా 1.30 | 0.09 | మారగొని రాములు తండ్రి లింగయ్య | -- |
| 38 | | | మారగొని సైదమ్మ భర్త మారయ్య | -- |
| 39 | | 0.25 | వనం కృష్ణ తండ్రి వెంకటయ్య | -- |
| 40 | | | వనం సైదులు తండ్రి వెంకటయ్య | -- |
| 41 | | 0.03 | బండమీది అండాలు భర్త కృష్ణయ్య | -- |
| 42 | | 0.33 | మన్నెం లింగయ్య తండ్రి బాలయ్య | -- |
| 43 | | | మన్నెం ఎల్లయ్య తండ్రి బాలయ్య | -- |
| 44 | 554 ఖుష్కి / పట్టా 1.15 1/2 | 0.02 | కంబంపాటి శ్రీను తండ్రి బిక్షమయ్య | -- |
| 45 | | 0.29 | మన్నెం లింగయ్య తండ్రి బాలయ్య | -- |
| 46 | | | మన్నెం ఎల్లయ్య తండ్రి బాలయ్య | -- |
| 47 | | 0.01 | ఇల్లందుల కృష్ణ మూర్తి తండ్రి రామలింగయ్య | -- |
| 48 | | 0.11 | కంబంపాటి జీడయ్య తండ్రి రామలింగయ్య | -- |
| 49 | | 0.12 1/2 | మద్దెల రాములమ్మ భర్త నర్సయ్య | -- |
| 50 | 552 ఖుష్కి / పట్టా 0.22 1/2 | 0.22 1/2 | మద్దెల రాములమ్మ భర్త నర్సయ్య | -- |
| 51 | 568 ఖుష్కి / పట్టా 0.20 | 0.20 | వరకాంతం రంగారెడ్డి తండ్రి జంగారెడ్డి | -- |
| 52 | | | జక్క రఘునాథ రెడ్డి తండ్రి నరసింహా రెడ్డి | -- |
| 53 | 567 ఖుష్కి / పట్టా 0.00 1/2 | 0.00 1/2 | వంగాల పిచ్చమ్మ భర్త జీడికల్లు | -- |
| | | Reach 24 L Minor 0.000 to 1.025 | | |
| 54 | 434 ఖుష్కి / పట్టా 0.15 1/2 | 0.07 | ఎర్కల కళమ్మ భర్త శంకరయ్య | -- |
| 55 | | 0.04 1/2 | ఎర్కల సతయ్య తండ్రి జీడికల్లు | -- |
| | | 0.02 | ఎర్కల శంకరయ్య తండ్రి ఆంజనేయులు | -- |
| | | 0.02 | ఎర్కల రాములు తండ్రి ఆంజనేయులు | -- |
| 56 | 420 ఖుష్కి / పట్టా 0.18 1/2 | 0.05 1/2 | బుర్ర జితేందర్ తండ్రి సారయ్య | -- |
| 57 | | 0.05 | బాట | -- |
| 58 | | 0.06 | పచ్చ కృష్ణమూర్తి తండ్రి వెంగయ్య | -- |
| 59 | | 0.02 | ఎర్కల శంకరయ్య తండ్రి కృష్ణయ్య | |
| 60 | 419 ఖుష్కి / పట్టా 0.16 | 0.18 1/2 | సోమగాని మంజులవాణి తండ్రి శంకర్ గౌడ్ | 51 బత్తాయి చెట్లు |
| | | 0.07 3/4 | బాట | |
| 61 | 415 ఖుష్కి / పట్టా 0.34 1/2 | 0.18 1/2 | సోమగాని విధ్య సాగర్ తండ్రి శంకర్ గౌడ్ | -- |
| | | 0.16 | బాట | |
| 62 | 416 ఖుష్కి / పట్టా 0.20 1/2 | 0.09 | సోమగాని మంజులవాణి తండ్రి శంకర్ గౌడ్ | -- |
| | | 0.11 1/2 | బాట | |
| మొత్తం విస్తీర్ణం | | 16.18 1/2 | | |

ప్రతిపాదిత భూమి భూసేకరణ చట్టము, 2013 నెం. 30/2013 లోని సెక్షన్ 15 ప్రకారం సంబంధిత భూ యజమానుల నుండి ముసాయిద నోటిఫికేషన్ పై ప్రతిపాదిత భూ సేకరణ విషయములో అభ్యంతరముల స్వీకరణ మరియు తగిన విచారణ తదుపరి సెక్షన్ 19/1 ప్రకారం డిక్లరేషన్ జారిచేయనైనది. ఇట్టి భూ సేకరణ వలన ఎవరు ప్రభావితము కాలేదు, నిర్వాసితులు కాలేదు. కావున సెక్షన్ 31 (కేంద్ర చట్టము 30/2013) క్రింద విడిగా ఆర్ అండ్ ఆర్ అవార్డు జారీ చేయవలసిన అవసరం లేదు.

ప్రతిపాదిత భూ సేకరణ తల పెట్టిన భూమిలో, బొగ్గు, ఇనుము, ప్లేట్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూములలో, లేదా కొంత భాగములో లభ్యమైనచో, ఖనిజాలు ప్రాజెక్టు నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో వాటిని స్వీకరించబడును లేనిచో స్వీకరించబడవు.

పై విషయములో తెలపబడిన భూసేకరణ చేయబడు భూమి యొక్క ప్లాన్ ఏదేని పని దినములలో మరియు కార్యాలయము పని వేళలలో ప్రత్యేక ఉప కలెక్టర్, యూనిట్-2, నల్లగొండ కార్యాలయములో పరిశీలించుకొను నిమిత్తము అందుబాటులో ఉండును.

సం/- ప్రత్యేక ఉప కలెక్టర్, ఆర్&ఆర్&ఎల్ఏ, విభాగము -2, నల్గొండ.

సం/- అదనపు కలెక్టర్ (రెవెన్యూ) నల్గొండ

సం/- జిల్లా కలెక్టర్, నల్గొండ

DIPR RO NO. 419/LA/PP/Advt/Pub/2025-26

ప్రజాపక్షం
మంగళవారం, 29 జులై

## ఎన్నికల తాయిలాలు దుర్వినియోగం

ఎన్నికలు సమీపిస్తుండగా ఓటర్లను ఆకర్షించటానికి తాయిలాలు (ఉచిత సహాయ పథకాలు) ప్రకటించటం కొన్ని సంవత్సరాలుగా మన దేశంలో శృతిమించి రాగాన పడింది. రాష్ట్రాల ఆదాయ వనరులతో నిమిత్తం లేకుండా రాజకీయ పార్టీలు పోటాపోటీగా ఉదార వాగ్దానాలు గుప్పిస్తున్నాయి. వీటికి అదుపులు–హద్దులు విధించకపోతే మన రాష్ట్రాలు ద్రవ్య సంక్షోభంలో శ్రీలంకను మించిపోతాయన్న విమర్శలు, ఆరోపణలు కొద్ది సంవత్సరాల క్రితమే వినిపించాయి. అయినా వాటిని పట్టించుకున్న వారు లేరు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆ తాయిలాలను మిఠాయిలుగా హేళన చేశారు. ఆయనకు అధికారం చేతిలో ఉంది కాబట్టి తమ పాలనలోని లేదా తాము అధికారం ఆశిస్తున్న రాష్ట్రాలకు ముందే వెళ్లి పదులవేల కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేస్తుంటారు. కొన్ని ప్రాజెక్టులు ప్రారంభిస్తుంటారు. అంతటితో ఆగకుండా ఆయన పార్టీ కూడా జోరుగా తాయిలాలు ప్రకటిస్తోంది. మహిళలకు నగదు పంపిణీ పథకాలు ప్రతి రాష్ట్రంలోనూ పూసలా దారంలా కనిపిస్తుంటాయి. పేద, మధ్యతరగతి ప్రజలకు ఉచిత విద్య, వైద్యం, గృహవసతి, వృద్ధులు, వికలాంగులు, వితంతులు వంటి వారికి వృద్ధాప్య పింఛను వంటివి ఆవశ్యకాలు, ప్రయోజనదాయకం. పని చేయగలిగిన వయస్సులోని వారికి పనులు కల్పించి వారిని కుటుంబ పోషకులుగా తయారుచేయాలి గాని నెలనెలా డబ్బులిచ్చి సోమరులుగా తయారుచేయకూడదు. పిల్లల్ని బడికి పంపితే డబ్బు, పెళ్లి చేస్తే డబ్బు ఇలా ప్రతి రాష్ట్రంలో కనీసం ఓ డజనుకు తగ్గకుండా ఉచిత సహాయ పథకాలు అమలులో ఉన్నాయి. ఇవన్నీ జోరుగా అమలు చేసి, ఎన్నికల్లో డబ్బులు సైతం కుమ్మరించి అధికారం కోల్పోయిన పార్టీలు ఏమన్నా గుణపాఠాలు తీసుకుంటున్నాయా, ఉచిత సహాయాలకు మించి ప్రజలు కోరుకునేది ఇంకేదో ఉందన్న పునరాలోచన చేస్తున్నాయా? లేదు. అధికారంలో ఉన్న పార్టీని హామీలు అమలు జరపలేదని నిలదీస్తుంటాయి.

చాలా పథకాలు సామాన్య ప్రజలకు ప్రయోజనం కలిగించేవే అనుకుందాం. ప్రతి పథకంలోనూ అనర్హులు తప్పక ఉంటారని అన్ని రాజకీయ పార్టీలకూ తెలుసు. వారిని ఏరివేయటానికి ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోదు; ఇతర పార్టీలు ఎందుకు మద్దతివ్వవు. ఎందుకంటే దుర్వినియోగమవుతున్న ధనం వారిది కాదు. అది ప్రజల సొమ్ము. పెరిగిన అప్పులన్నీ వడ్డీలతో తీర్చాల్సింది ప్రజలేనని తెలిసినా రాజకీయ పార్టీలు బాధ్యతతో వ్యవహరించవు.

తాజా ఉదహరణ చూద్దాం. మహారాష్ట్రలో మొన్నటి ఎన్నికలకు ముందు అధికారంలో ఉన్న ఏక్‌నాథ్ షిండే ప్రభుత్వం ఎన్నికల్లో స్త్రీల ఓట్ల కోసం 2024 ఆగస్టులో లడ్కీ బాహిన్ పథకం అమలులోకి తెచ్చింది. అల్పాదాయ మహిళలకు నెలకు రూ.1500 ఉచిత సహాయానికి ఆ పథకం ఉద్దేశించింది. రెండున్నర కోట్ల మంది అర్హులుగా నమోదైనారు. సహాయం పొందుతున్నారు. వారిలో 26.34 లక్షల లబ్ధిదారులకు ఈ నెలలో చెల్లింపు 'తాత్కాలికం'గా నిలుపు చేసినట్లు మహారాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ప్రకటించింది. 2.25 కోట్ల మందికి చెల్లించాము. సస్పెండ్ చేయబడిన లబ్ధిదారుల అర్హతను జిల్లా కలెక్టర్లు నిర్ణయిస్తారని రాష్ట్ర మహిళ, బాలల అభివృద్ధి మంత్రి అదితి తత్కార్ చెప్పారు. లబ్ధిదారుల్లో కొన్ని ఇళ్లలో ఇద్దరేసి మహిళలున్నారు. అంతేనా 14వేలమంది పురుషులు కూడా ఉన్నారట! ఎన్నికల్లో మహాయుతి (ఎన్‌డిఎ) ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రావటానికి, ముఖ్యమంత్రి పదవిని బిజెపి సొంతం చేసుకోవటానికీ ఈ పథకం తోడ్పడిందట!

ఈ పథకమే కాదు. ఏరాష్ట్రంలో ఏ పథకం తీసుకున్నా అనర్హుల వాటా తప్పనిసరిగా ఉంటుంది. ఎమ్మెల్యేలు, వారి మాట వినే అధికారులే కదా సిఫారసుదారులు. ఉచిత పథకాల అమలు తలనొప్పి పాలక పార్టీలది. కనీసం అనర్హులను ఏరివేసే విషయంలోనైనా రాజకీయ పార్టీలు ఏకీభావానికి వచ్చి ఆ బాధ్యతను కలెక్టర్లకు అప్పగిస్తే ప్రజాధనం దుర్వినియోగాన్ని చాలా వరకు అరికట్టవచ్చు కదా!

# ఇందిరమ్మ ఇండ్లకు ఆదరణ;
# కేంద్రం కొర్రీలతో ఆలస్యం!



ఉజ్జిని రత్నాకర్ రావు
9490952646

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం కూడా ముఖ్యభూమిక పోషించిందనే చెప్పవచ్చు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొంత ఆలస్యమైనప్పటికీ ఏడాదిన్నర లోనే ఇందిరమ్మ ఇండ్ల పథకం హామీని నిలబెట్టుకునే దిశగా ప్రభుత్వం ముందుకు పోతున్నది. గత ఏడాది ఇండ్ల కోసం 'ప్రజా పాలన'లో వచ్చిన మొత్తం దరఖాస్తులు 76.18 లక్షల మంది కాగా, ఆ తరువాత కూడా గ్రామ సభలలో 6 లక్షలకు పైగా ఇండ్ల కోసం దరఖాస్తులు పెట్టుకున్నారు. మొత్తం 83 లక్షల దరఖాస్తులు అందాయి. వీరిలో సర్వే నిర్వహించి 36.03 లక్షల అర్హుల జాబితాను ప్రభుత్వం సిద్ధం చేసింది. అర్హులలో గృహ నిర్మాణ శాఖ సొంత జాగాలున్న వారిని మొదటి జాబితా ఎల్1, రెండవ జాబితా ఎల్2, మూడవ ఎల్3గా జాబితాలు సిద్ధం చేసి పెట్టుకుంది. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఆర్థిక సంవత్సరం నియోజకవర్గానికి 3,500 చొప్పున.. రాష్ట్రంలో ఏటా గరిష్టంగా మొత్తం 4.50 లక్షల ఇండ్లను ప్రభుత్వం మంజూరు చేస్తున్నది. ఇండ్ల దరఖాస్తుల వివరాలను ఇందిరమ్మ యాప్‌లో నమోదు చేశారు. యాప్‌లో పొందుపరిచిన మార్గదర్శకాల మేరకు అన్ని కోణాల్లో చేసిన సర్వేతో పాటు.. ప్రభుత్వం నిర్వహించిన ఇంటింటి కుటుంబ సర్వే ద్వారా దరఖాస్తులను క్యాటగిరీల వారీగా విభజించారు.

### సొంత జాగాలున్న వారికి మొదటి లిస్టులోనే

తొలుత సొంత జాగా ఉన్న వారికే ఇండ్ల ప్రాధాన్యం ఇచ్చారు. ఆయా దరఖాస్తుదారుల ఇండ్ల వద్దకు వెళ్లి, ప్రభుత్వ సిబ్బంది సర్వే చేసిన జాబితాను గ్రామసభలలో వినిపించి లబ్ధిదారులను ప్రకటించారు. ఆవిధంగా ప్రభుత్వం ప్రకటించినవారిలో ఈ సంవత్సరానికి 4.5 లక్షల మందికి గాను ఇప్పటికే 3.5 లక్షల మందికి ఇళ్ల నిర్మాణ అనుమతి పత్రాలు శాసనసభ్యుల ద్వారా అందచేస్తున్నారు. ఇంకా మిగిలిపోయి ఉన్న లబ్ధిదారులకు ఆగస్టు 6లోగా గ్రామాలలో సమావేశాలు పెట్టి పట్టా సర్టిఫికెట్లు పంచుతున్నారు. ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేస్తున్నారు.

### కేంద్రం జాప్యం

పట్టణ ప్రాంతాలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వ "ప్రధానమంత్రి ఆవాస్ యోజన" అర్బన్ యూనిట్ల కోసం దరఖాస్తు చేసుకోగా, కేంద్రం 1.13 లక్షల యూనిట్లు మంజూరు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతంలో దరఖాస్తు పెట్టుకున్న వారిని ఇండ్ల వద్దకు వెళ్లి సర్వే చేసి 23 లక్షల మంది లబ్ధిదారులను అర్హులుగా గుర్తించి జాబితాను తయారుచేసి కేంద్రానికి పంపించింది.



ఇందులో 19.50 లక్షల మందికి సొంత జాగాలు ఉన్నాయని తెలుపుతూ, మిగతా వారు సొంత భూమి లేనివారు, వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, వ్యవసాయ కూలీలు ఉన్నారని తెలిపింది. వారికి తొలి ప్రాధాన్యత ఇస్తూ..ఈ వివరాలను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించి ప్రధాన మంత్రి ఆవాస్ యోజన క్రింద గ్రామీణ యూనిట్లను మంజూరు చేయాలని కోరారు.

### కేంద్రం కొర్రీలతో మళ్లీ రీ సర్వే

రాష్ట్ర ప్రభుత్వం చేసిన సర్వేతో మాకు సంబంధం లేదు.. 'మేము రూపొందించిన మొబైల్ యాప్ ద్వారా మీరు ఒక్కొక్క దరఖాస్తుదారుని ఇంటికి మళ్ళీవెళ్లి సర్వే చేసి యాప్‌లో లబ్ధిదారుని సమగ్రమైన వివరాలు ద్విచక్ర వాహనాలు, బ్యాంకు ఖాతా, పన్ను చెల్లింపు తదితర వివరాలతో పాటు ఇల్లు నిర్మించదలుచుకున్న స్థలము వద్ద లబ్ధిదారును నిలబెట్టి ఫోటో తీసి అప్‌లోడ్ చేయాలని మెలిక పెట్టారు. దీంతో మరోసారి సర్వే చేయక తప్పని పరిస్థితి ఎదురైంది. దీంతో అప్పట్లో సర్వే చేసిన బృందాలను మళ్లీ రంగంలోకి దింపి యుద్ధ ప్రాతిపదికన సర్వే ప్రారంభించారు. దీనితో మరి కొంత జాప్యం జరిగే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంత ఇండ్లకు సంబంధించి యూనిట్ కాస్ట్ రూ.72వేలుగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్క ఇంటికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందజేస్తుంది. ఐదేండ్లకు సంబంధించి ఇప్పుడు కేంద్ర యూనిట్లను మంజూరు చేయనున్నందున కనీసం 20 లక్షల యూనిట్లు పొందితే రాష్ట్ర ప్రభుత్వంపై కొంత ఆర్థిక భారం తగ్గుతుందని ప్రభుత్వం భావిస్తున్నది. ఈ నెలాఖరు నాటికి రీసర్వే పూర్తి చేసి జాబితాను కేంద్రానికి పంపి గరిష్ట సంఖ్యలో కేంద్రము నుండి యూనిట్లు పొందాలన్న ప్రయత్నంలో రాష్ట్ర యంత్రాంగం ఉంది.

### 20లక్షల ఇండ్లు కట్టించాలనే కృత నిశ్చయం

రాష్ట్ర ప్రభుత్వం ఈ ఐదు సంవత్సరాల కాలంలో కనీసం 20 లక్షల ఇందిరమ్మ గృహాలు ఇవ్వాలనే లక్ష్యంతో ఉన్నప్పటికీ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే ఉన్నది. కేంద్ర ప్రభుత్వం 4 కోట్ల మంది పేదలకు ఇండ్లు కట్టించాలనే ప్రణాళిక రూపొందించుకుంది. ఇందులో కనీసం 20 లక్షల ఇండ్లను తెలంగాణకు కేటాయించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేస్తూ వస్తుంది.

### ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై స్పీడ్ పెంచిన సర్కార్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల స్కీము జోరందుకుంది. 2025–26 బడ్జెట్లో రూ.22,500 కోట్లు కేటాయించింది. ఇప్పటివరకు రెండు దశల్లో రాష్ట్రవ్యాప్తంగా 3.5 లక్షల ఇళ్లను మంజూరు చేయగా, 1.73 లక్షల గృహాలు నిర్మాణం మొదలయ్యాయి. 57 వేల ఇండ్లు పూర్తయ్యే దశలో ఉన్నాయి.5 వేలు పూర్తయినవి. పలువురు లబ్ధిదారులు గృహప్రవేశం చేశారు. నిర్మాణాలు త్వరగా పూర్తయ్యే చర్యలు తీసుకుంటుంది. ఈ స్కీమును ఎప్పటికప్పుడు పర్యవేక్షణకు 3 వేల సిబ్బందిని మండలాల వారీగా వర్క్ ఇన్‌స్పెక్టర్స్, ఇంజనీర్స్‌ను నియమించింది. అదనంగా డబ్బులు లేని లబ్ధిదారులకు మహిళా సంఘాల ద్వారా బ్యాంకులనుండి ఇప్పిస్తున్నారు.

### స్వయంగా మంత్రుల పర్యవేక్షణ :

హౌసింగ్ మినిస్టర్ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో పాటు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రులు, కలెక్టర్లు, నియోజకవర్గ శాసనసభ్యులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ ఇల్లు కట్టుకునే వారికి బేస్‌మెంటు, గోడలు, స్లాబు పనులు చేసుకున్న వారికి ఎప్పటికప్పుడు డబ్బులు గ్రీన్ ఛానల్ ద్వారా పేమెంట్ చేయిస్తున్నారు. శ్రావణమాసం మంచి రోజులు మొదలు అయినందున ఒక్కో గ్రామంలో 20 నుంచి 25 ఇండ్లు పూర్తిచేసి సిఎం చేతుల మీదుగా ప్రారంభించే ఏర్పాట్లు చేస్తున్నారు.

### ఇండ్ల సాంక్షన్‌పై విమర్శలు

ఇందిరమ్మ ఇండ్ల సాంక్షన్లో స్థానిక శాసనసభ్యులు వారి పార్టీ వారికే పెట్టుకుంటున్నారని వాస్తవంగా అర్హులైన వారిని కాకుండా అనర్హులైన వారికి పెట్టుకుంటున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వారిపై ఫిర్యాదులు వస్తున్నాయి.. వీటిపై జిల్లా కలెక్టర్స్ తిరిగి రీసర్వే చేయిస్తున్నారు. అర్హుల ఎంపిక జరిగిన సర్వేలో తప్పులు దొర్లినట్లు వెలుగులోనికి వస్తున్న నేపథ్యములో.. తిరిగి సర్వే చేయించి మంజూరు చేసిన ఇండ్లలో 1,950 మంది అనర్హులను తొలగించి, వాటిని రద్దుచేసి అదే సంఖ్యలో అర్హులను ఎంపిక చేసి మంజూరు చేస్తామని.. క్షేత్రస్థాయిలో పరిశీలనకు వెళ్ళిన సిబ్బందిలో కొందరు దరఖాస్తులను సరిగ్గా పరిశీలించకుండా తోచిన వివరాలు నమోదు చేశారు. దీంతో అనర్హులు అర్హులుగా నమోదైనారాని గృహ నిర్మాణ సంస్థ తెలిపినారు.

### మందకొడిగా ఇందిరమ్మ ఇండ్లు

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోనికి వచ్చి ఒకటిన్నర సంవత్సరాలు పూర్తి అవుతున్నప్పటికీ గత సంవత్సరానికి కేటాయించిన (2024–25) 4.5 లక్షల ఇండ్లు ఈ సంవత్సరం కూడా పూర్తికానటువంటి పరిస్థితి ఉంది. ఉదా: నల్లగొండ జిల్లాలో ఆరుగురు శాసనసభ్యులు అధికారపార్టీ వారే ఉన్నప్పటికి సాంక్షన్ చేసిన ఇండ్లు 17042 మాత్రమే. పనులు నడుస్తున్నవి 6844, బేస్‌మెంటు లెవల్‌కు వచ్చినవి 582, కంప్లీట్ అయినవి 5 ఇండ్లు. చాలా గ్రామాలలో స్థలాలున్న పేదలకు ఇంటి శాంక్షన్ ఇచ్చినప్పటికీ.. రూ.5లక్షలతో ఇల్లు పూర్తికాదని.. ఇంకొక రూ.5లక్షలు పెట్టుకోవాలని.. అప్పులు చేయలేక నిర్మించుకోలేక పోతున్నామని మంజూరైన లబ్ధిదారులు తెలుపుతున్నారు. ప్రభుత్వమే నిర్మించి ఇవ్వాలని కోరుతున్నారు. కొంచెం ఆర్థిక పరిస్థితి ఉన్నవారు మాత్రమే నిర్మించుకుంటున్నారు. ఇండ్ల స్థలాలు లేని వారికి ప్రభుత్వమే స్థలము ఇచ్చి కట్టి ఇస్తామని ప్రకటించింది. అటువంటి వారికి ఆ స్కీమ్ అమలు చేయాలని కోరుతున్నారు.

## గాజాలో ఇజ్రాయెల్ 'జన నిర్మూలన'

ఆకాంక్ష పిళ్లయ్, అక్షత్ ఆర్.ఎస్.

గాజాలో హింసపై ఐరాస నిపుణుల నుంచి కొత్తతరహా స్పందన తెచ్చింది. 'జన నిర్మూలన' (ఎనిహిలేషన్) గూర్చి వారు పాలస్తీనియన్‌లను హెచ్చరించారు. ఫోటోల్లో కనిపిస్తున్న మృతదేహాలు, అంతిమయాత్రలను బట్టి మాన వ ప్రాణార్పణ చాలా హెచ్చుగా ఉంది. ప్రజలను ఆకలిదప్పులకు గురిచేసే పాశవిక ఎత్తుగడలు గాజా సంక్షోభాన్ని ఘోరకలిగా మార్చాయి. 2024 నవంబర్‌లో అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు, ఆకలితో మాడ్చటం అనే యుద్ధ నేరానికిగాను ఇజ్రాయెల్ ప్రధాని బెంజమన్ నెతన్యాహుకు అరెస్టు వారెంటు జారీచేసింది. కేవలం మూడు మాసాల తదుపరి 2025 మార్చిలో నెతన్యాహు గాజాలోకి అన్ని రకాల సరుకులు, సరఫరాల ప్రవేశాన్ని నిషేధించాడు. గాజా సంపూర్ణ దిగ్బంధం మార్చిలో మొదలైంది. 77 రోజులకు పైబడి క్రూరమైన, అమానుషమైన దిగ్బంధం పాలస్తీనా ప్రజలకు వ్యతిరేకంగా ఇజ్రాయెల్ 'సామూహిక సంహారం' (జినోసైడ్) ఉద్దేశానికి తిరుగులేని సాక్ష్యం. మానవతా సహాయం అనుమతించటంలో జాప్యాలు కొనసాగుతున్నాయి. అంతర్జాతీయ సమాజం వైఫల్యం పెచ్చుపెరుగుతున్నది. ఉదాహరణకు జూన్‌లో, "గాజాలో తక్షణ, శాశ్వత కాల్పుల విరమణ"ను కోరిన యుఎన్ భద్రతా మండలి తీర్మానాన్ని అమెరికా వీటో చేసింది. యుకె సహా 14 ఇతర సభ్యదేశాలు ఆ తీర్మానానికి అనుకూలంగా ఓటు చేశాయి. "మానవతా సహాయం గాజాలోకి ప్రవేశించటంపై ఉన్న ఆంక్షలన్నింటినీ తక్షణం, బేషరతుగా ఎత్తివేయాలని" కోరిన తీర్మానాన్ని అమెరికా వీటో చేయటాన్ని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ అమానుషంగా విమర్శించింది.

ఐరాస నిపుణులు 'జననిర్మూలన' అనే పదాన్ని ఉపయోగించటం దానికున్న లీగల్ అర్థాన్ని విస్తరిస్తున్నది. 1948 జినోసైడ్ కన్వెన్షన్, సాంప్రదాయకమైన అంతర్జాతీయ మానవతా చట్టం, అంతర్జాతీయ న్యాయ సూత్రాల ప్రకారం ఆ పదానికి మరింత స్పష్టమైన లీగల్ అర్థంవుంది. దాన్ని తిరస్కరించటానికి వీల్లేదు. జినోసైడ్ కన్వెన్షన్‌లోని ఆర్టికల్ II ప్రకారం, జాతి, ఉపజాతి, వర్ణ లేక ఏదైనా మత



గ్రూపును మొత్తంగా లేక కొంతభాగం రూపుమాపే ఉద్దేశంతో కూడిన చర్యలు జినోసైడ్ అనే పదం అర్థం కిందకు వస్తాయి. "నాశనం" చేయటం అనే పదం కిందకు మనుషుల్ని భౌతికంగా చంపే మార్గాలేగాక, ఒక గ్రూపును భౌతికంగా నాశనం చేసే జీవన పరిస్థితులు సృష్టించటం కూడా వస్తుందని "ర్వాండాపై అంతర్జాతీయ క్రిమినల్ ట్రిబ్యునల్" (ఐసిటిఆర్) వివరణ ఇచ్చింది. ఐరాస నిపుణులు ఈ స్థిరపడిన న్యాయ చట్టం సందర్భంలోనే 'జన నిర్మూలన' అనే పదాన్ని ఉపయోగించారు. ఐసిజె కొన్ని నిరోధక చర్యలు ఉత్తర్వు చేసింది. మానవతా సహాయం హామీయివ్వటం, కవ్వింపుల నిలుపుదల, ఈ ఉత్తర్వులపై నిర్ణీత వ్యవధిలో నివేదికలు వాటిలో ఉన్నాయి. నిరోధక బాధ్యతలు అన్నీ ఐరాస నిపుణులు ఉపయోగించిన 'జన నిర్మూలన' పదం పరిధిలోకి వస్తాయి. పౌర, రాజకీయ హక్కులపై అంతర్జాతీయ ఒడంబడిక అధ్యాయం 6 జీవించే హక్కుకు హామీ ఇచ్చి ంది. సాయుధ సంఘర్షణ పరిస్థితుల్లో కూడా ఇది వర్తిస్తుందని మానవ హక్కుల కమిటీ జనరల్ కామెంట్ నెం.36 నిర్దేశించింది.

బాధిత ప్రజల ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక హక్కులపై అంతర్జాతీయ చట్టాలకు కోర్టులు పలు భాష్యాలు చెప్పాయి. అవన్నీ కూడా మానవ హక్కులను బలపరిచేవే. ఆక్రమిత పాలస్తీనా భూభాగంలో ఇజ్రాయెల్ విధానాలు, చర్యలకు గల లీగల్ పర్యవసానాలపై ఐసిజె ఇటీవల ఇచ్చిన సలహాపూర్వక అభిప్రాయంలో, వ్యవస్థీకృతమైన ప్రభుత్వ వ్యవస్థలేకపోవటం అన్నది అంతర్జాతీయ చట్టం కింద రక్షణ బాధ్యతలు వర్తింపు నుంచి మినహాయింపు ఇవ్వదని చెప్పిం ది. జినోసైడ్ కన్వెన్షన్ కింద నిషేధించబడిన ఎట్టి చర్యలకు పాల్పడవద్దని ఐసిజె ఇజ్రాయెల్‌ను ఆదేశించింది కూడా.

అంతర్జాతీయ కోర్ట్ ఆఫ్ జస్టిస్, అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు వంటి అంతర్జాతీయ ట్రిబ్యునల్స్ న్యాయ చట్టాలు జనాభాను భౌతికంగా నిర్మూలించే చర్యలు అంతర్జాతీయ చట్టం నిషేధాల కిందకు వస్తాయని స్పష్టం చేశాయి. అయినా ఇజ్రాయెల్ దారుణాలకు పాల్పడుతూనే ఉంది. ఆహార సహాయాన్ని నియంత్రిస్తున్నది. ఆహార కేంద్రాల వద్దకు చేరిన అన్నార్తులను చంపుతోంది. ఇంతకుమించిన రాక్షసం ఉండబోదు. ఇప్పుడు, అంతర్జాతీయ చట్టం అమలు చేయటానికి గాజా ఒక పరీక్షా క్షేత్రంగా ఉంది. నిర్ణయాత్మకంగా చర్య తీసుకోవటంలో అంతర్జాతీయ సమాజం వైఫల్యం ప్రాణాలకు, హక్కులకు మాత్రమే ప్రమాదం కాదు, అంతర్జాతీయ న్యాయ వ్యవస్థకూ వ్యతిరేకం. జవాబుదారీ వ్యవస్థలు పనిచేస్తాయా, లేదా?

**(లీఫ్‌లెట్ సౌజన్యంతో)**

## జీవ వైవిధ్య పరిరక్షణలో పులుల పాత్ర అమోఘం

**(జులై 29 అంతర్జాతీయ పులుల దినోత్సవం)**

వన్యప్రాణుల్లో రాజసం, ఆహార్యంలో హుందాతనం, అమాయకత్వం, ఠీవి, చూపుల్లో స్ఫురద్రూపం, నడకలో గాంభీర్యం, పరుగులో వాయు వేగం, శరీరంలో శక్తి ఊట, దినచర్యలో చురుకుదనం లాంటి ప్రత్యేక లక్షణాలకు పర్యాయపదంగా పులి జాతి నిలుస్తున్నది. అడవికి రాజు సింహమే అయినప్పటికీ వేగంగా పరుగెత్తడంలో రారాజుగా పులి ముందున్నది. వన్యప్రాణులతో మమేకం అవుతూ, సహజీవనం చేస్తున్న పులి జాతిని అంబరిల్లా స్పీసీస్ లేదా గొడుగు జాతిగా కూడా పిలుస్తారు. అడవుల్లో శాకాహార జంతువులను తన ఆహారం కోసం వేటాడుతూ, ఆ జంతువుల జనాభాను పెరగకుండా చూస్తూ, హరిత వనాలను రక్షించే పరోక్ష విధులను పులులు నిర్వహిస్తున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా విచక్షణారహితంగా అడవుల నరికివేత, అక్రమంగా పులులను వేటాడడం లాంటి పలు కారణాలతో పులి జాతి అంతరించే స్థాయికి చేరడాన్ని గమనించిన ఐరాస ప్రతి ఏట జులై 29న అంతర్జాతీయ పులుల దినం లేదా ఇంటర్నేషనల్ టైగర్‌డే పాటించడం 2010 నుంచి ఆనవాయితీగా మారింది. పులులను కాపాడుకోవడం, వాటి ఆవాసాలను సంరక్షించుకోవడం, అక్రమ వేటలను మానుకోవడం, జీవ వైవిధ్యాన్ని కాపాడే ప్రాధాన్యాన్ని వివరించడం, టైగర్ ప్రాజెక్టులకు ఆర్థిక సహాయం చేయడం, టైగర్ రిజర్వులను నియంత్రించడం లాంటి అంశాల్లో సామాన్య జనాలకు అవగాహన కల్పించడానికి ఈ వేదికలను ఉపయోగించుకోవాలి. పిల్లుల జాతిలో అతి పెద్ద జంతువుగా పులికి పేరుంది. 2025 అంతర్జాత పులుల దినం ఇతివృత్తంగా మానవులు, పులులు సామర



స్యంగా సహజీవనం చేయడం అనే అంశాన్ని తీసుకొని పులుల సంరక్షణ బాధ్యతలను వివరించడం జరుగుతుంది. ప్రపంచవ్యాప్తంగా కేవలం 13 దేశాల్లోనే పులులు ఉన్నాయి. ఇండియా(3,682 పులుల జనాభా), రష్యా (750), ఇండోనేషియా (400), నేపాల్(355), థాయిలాండ్ (189), భూటాన్ (151), మలేషియా (150), బంగ్లాదేశ్ (146), మియన్మార్(22), చైనా (20), వియత్నామ్(05), లావోస్ (02 పులులు) అనబడే దేశాల్లోనే పులులు ఉన్నాయి. ప్రపంచంలోనే అత్యధిక పులుల జనాభా భారత్‌లో ఉన్నందున మన జాతీయ జంతువుగా రాయల్ టైగర్‌ను నిర్ణయించారు. భారత ప్రభుత్వ చొరవతో పులుల జాతిని సంరక్షించడానికి 1973లో ప్రాజెక్ట్ టైగర్ 2006లో జాతీయ పులుల సంరక్షణ అథారిటీలను స్థాపించడంతో పాటు 58 టైగర్ రిజర్వులను నిర్వహించడం జరుగుతోంది. భారత్‌లో 2014లో 2,236 పులులు, 2018లో 2,967 పులులు ఉండగా, 2022లో 3,682 పులుల జనాభా ఉన్నది. ప్రపంచ పులుల జనాభాలో 70 శాతానికి పైగా భారత్‌లోనే ఉండడం విశేషం. నేడు పులుల జనాభా వృద్ధి రేటు 6.1 శాతంగా నమోదు అవుతున్నది. శతాబ్దం క్రితం ఒక లక్ష వరకు ఉన్న పులుల జనాభా నేడు కేవలం 5,574 మాత్రమే ఉండడం విచారకరం. చర్మం, గోళ్లు, దంతాలు, మాంసం, ఎముకలు, జుట్టు లాంటి అవయవాల కోసం పులులను అక్రమంగా వేటాడి చంపడం జరుగుతోంది. సగటున 15 ఏండ్లు బతికే పులుల బరువు 600 పౌండ్ల వరకు ఉంటుంది. నీటిలో ఈదగలిగే సామర్థ్యం కలిగిన పులులు ఒక పూట 88 పౌండ్ల మాంసం తినగలుగుతాయి. పులుల ఆవాసాలైన అడవులను నరికి వేస్తున్న నవ్య మానవాళి, అవి మానవ ఆవాసాల్లోకి రావడం, సాధు జంతువులపై దాడి చేయడం, మానవులపై సహితం దాడి చేయడంతో మనం నేడు తగిన మూల్యం చెల్లించుకుంటున్నది.

**– మధుపాళీ**

## ఉపాధితో లంకెలేని నేటి విద్యావిధానం



భారతదేశం భవిష్యత్తు, దేశ యువత చేతుల్లోనే ఉందని మనం తరచూ చెబుతుంటాం. కానీ ఆ యువతకు దారిచూపే విద్యావిధానం సక్రమ దిశలో నడుస్తోందా అన్న ప్రశ్న ఇప్పుడు అత్యంత ఆవశ్యకంగా నిలుస్తోంది. నేటి పేద మరియు మధ్యతరగతి విద్యార్థులు తీసుకునే విద్య ఉపాధితో లంకెలు లేకుండా కొనసాగుతోందని చెప్పడం అతిశయోక్తి కాదు. చదువుకుని ఉద్యోగం పొందలేని పరిస్థితి, అభ్యాసం చేసినా ఆర్థిక స్వావలంబనకు దారి తీయని వాస్తవం, ఈ దేశ యువతలో విపరీతమైన ఆందోళన, నిరాశను పెంచుతోంది.

### విద్యా లక్ష్యం మారిందా?

పూర్వం విద్య అంటే వ్యక్తిత్వ వికాసం, జ్ఞానం పెంపు, నైపుణ్యాల సాధన. కానీ ఆధునిక భారతదేశంలో, ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన వర్గాల కోసం, విద్య అంటే ఒకే మాట— ఉపాధి. తల్లిదండ్రులు ఎంతటి కష్టాలు పడి తమ పిల్లలను చదివించడానికి ప్రయత్నిస్తారో, అది వారు పెద్ద పదవులు దక్కించుకోవాలని కాదు, కనీసం గౌరవప్రదమైన జీవనోపాధి పొందాలని. కాని నేటి విద్యావిధానం ఆ ఆశను నెరవేర్చడంలో విఫలమవుతోంది.

### పేద విద్యార్థి పరిస్థితి

పేద విద్యార్థి చిన్ననాటి నుండే అనేక అడ్డంకులతో పెరుగుతాడు. ప్రైవేట్ స్కూళ్ల అధిక ఫీజులు, ప్రాథమిక సదుపాయాలు లేని ప్రభుత్వ పాఠశాలలు, సరైన ఉపాధ్యాయుల లేమి–ఇవి అన్నీ కలసి అతని ప్రాథమిక విద్యనే అస్థిరం చేస్తాయి. మధ్యస్థాయి విద్యకు చేరే సరికి కోచింగ్ సెంటర్లు, కాంపిటిటివ్ పరీక్షల ఖర్చులు కుటుంబానికి భారం అవుతాయి. ఎలాగోలా డిగ్రీ, పీజీ చదివినా, మార్కెట్‌లో ఉన్న ఉద్యోగ అవకాశాలు మాత్రం తగ్గిపోతున్నాయి. చదువుకు వెచ్చించిన కాలం, డబ్బు, కష్టానికి తగిన ఫలితం రాకపోవడం వలన పేద విద్యార్థి నిరాశలో కూరుకుపోతున్నాడు.

### విద్యా పద్ధతిలో సమస్యలు

1. ప్రాక్టికల్ నాలెడ్జ్ లోపం : మన విద్యా విధానం ఇప్పటికీ పుస్తక జ్ఞానంపైనే ఆధారపడి ఉంది. లాబ్‌లలో అనుభవం, ప్రాజెక్టుల ద్వారా నేర్చుకోవడం, పరిశోధన ద్వారా అర్థం చేసుకోవడం అన్నవి చాలా వరకు లేకుండా పోయాయి.
2. నైపుణ్యాల లోపం: నేటి మార్కెట్‌లో టెక్నికల్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, క్రియేటివిటీకి ఎక్కువ డిమాండ్ ఉంది. కానీ విద్యార్థులు వీటిని అభివృద్ధి చేసుకునే అవకాశం చాలా తక్కువ.
3. ఉద్యోగావకాశాలకు అనుసంధానం లేకపోవడం: యూనివర్సిటీలు, కళాశాలలు ఇస్తున్న డిగ్రీలు పరిశ్రమల అవసరాలకు సరిపడడం లేదు.
4. పేద విద్యార్థికి ఆర్థిక అడ్డంకులు: ప్రైవేట్ ఇంజనీరింగ్, మెడికల్, మేనేజ్‌మెంట్ కోర్సులు కేవలం ధనికులకు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. స్కాలర్‌షిప్‌లు ఉన్నా అవి తగినంత కావు.

### పరిష్కార మార్గాలు

1. విద్యను ఉపాధితో అనుసంధానం చేయాలి: ప్రతి కోర్సులో నైపుణ్య ఆధారిత శిక్షణ తప్పనిసరి చేయాలి. ఉదాహరణకు, డిగ్రీ కోర్సు లోపలే టెక్నికల్ స్కిల్స్, ఇంటర్న్‌షిప్‌లు కలపాలి.
2. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం: పేద విద్యార్థుల కోసం ఉచితంగా మాత్రమే కాదు, నాణ్యతతో కూడిన విద్య అందించాలి. ఉపాధ్యాయుల లోపాన్ని తీర్చాలి.
3. స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాములు: ఐటీ, అగ్రికల్చర్, హెల్త్ కేర్, హస్తకళలు వంటి రంగాల్లో నైపుణ్య శిక్షణను గ్రామీణ ప్రాంతాలకే తీసుకెళ్లాలి.
4. ఉద్యోగ సృష్టి: ప్రభుత్వం, ప్రైవేట్ రంగం కలిసి కొత్త పరిశ్రమలు, స్టార్టప్‌లు ప్రోత్సహించాలి. స్థానిక వనరుల ఆధారంగా చిన్న, మధ్య తరహా పరిశ్రమలు పెంచాలి.
5. విద్యార్థుల కెరీర్ గైడెన్స్: పాఠశాల స్థాయి నుండే విద్యార్థులకు కెరీర్ మార్గదర్శకత్వం ఇవ్వాలి. తగిన ఆసక్తి, సామర్థ్యాల ఆధారంగా వారికి సరైన మార్గాన్ని చూపాలి.

### ఒక పెద్ద ప్రశ్న

పేద భావి భారత విద్యార్థి భవిష్యత్ ఎటు? అతను చదువుకుని ఉద్యోగం పొందలేని స్థితిలో, కూలీ పనులు చేస్తూ గడపాలా? లేక సరైన మార్పులు చేసి, విద్యను ఉపాధి లంకెతో అనుసంధానం చేసి, కొత్త ఆర్థిక యుగంలో నిలబడాలా? ఈ ప్రశ్నకు సమాధానంఇవ్వడం మన సమాజం, ప్రభుత్వాల బాధ్యత.

భారతదేశం ఒక యువ దేశం. యువతలో ఎక్కువ మంది పేద, మధ్య తరగతికి చెందినవారు. వారి విద్య, ఉపాధి భవిష్యత్తు సక్రమంగా ఉండకపోతే, దేశ అభివృద్ధి అసాధ్యం. నేటి విద్యావిధానం ఉపాధికి లంకె కట్టని పక్షంలో, పేద విద్యార్థి భవిష్యత్తు చీకట్లో మిగిలిపోతుంది. ఇది కేవలం వ్యక్తిగత సమస్య కాదు, దేశ భవిష్యత్తుకు ముప్పు. కాబట్టి, విద్యను ఉపాధి, నైపుణ్యం, ఆత్మవిశ్వాసం కలిగించే దిశగా మార్చడం ఇప్పుడు అత్యవసరం. లేకపోతే చదువుకున్న పేద విద్యార్థి భవిష్యత్ ఒక పెద్ద ప్రశ్నార్థకం అవుతుంది.

– మహేశ్వరం భాగ్యలక్ష్మి
అసిస్టెంట్ ప్రొఫెసర్ ఇన్ మ్యాథమాటిక్స్
సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్
హైదరాబాద్.
9505618252

## గడువు చెల్లిన ఎరువులు అమ్మితే కఠినచర్యలు: కలెక్టర్



**ప్రజాపక్షం/సారంగాపూర్:**సారంగాపూర్ మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఎరువులు,విత్తనాల దుకాణాన్ని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్లు,రసీదు పుస్తకాలు తదితరాలను పరిశీలించారు.వానాకాలం సాగు సమయంలో రైతులకు ఎరువులు,విత్తనాల అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.రైతుల అవసరాల మేరకు సరిపడే నిల్వలు ఉండేలా పర్యవేక్షణ నిర్వహించాలని ఆదేశించారు.గడువు ముగిసిన,నాణ్యతలేని ఎరువులు లేదా విత్తనాలు విక్రయిస్తే సంబంధిత విక్రేతలపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.ఈ తనిఖీలో జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్,సంబంధిత అధికారులు,రైతులు,తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రజావాణి



**ప్రజాపక్షం /సంగారెడ్డి :** ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి వచ్చినఫిర్యాదుకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. సమీకృత కలెక్టరేట్ కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ డిఆర్ఒ పద్మజరాణిలకు ఫిర్యాదులను సమర్పించారు. కాగా రెవెన్యూ 15,పౌరసరఫరాల శాఖ 09,పంచాయతీ రాజ్09,డిఆర్డిఒ 09, వివిధ శాఖలకు సంబందించిన 12 మొత్తంగా 54 ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ పద్మజరాణి , జెడ్పిసిఇఒ జానకరెడ్డి వివిధ శాఖల జిల్లా అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## రేషన్ కార్డులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఏలేటి



**ప్రజాపక్షం/సారంగాపూర్:**సారంగాపూర్ మండల కేంద్రంలో మండలానికి చెందిన 2118 మంది లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులను బిజెఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. రేషన్ కార్డులేని కారణంగా సంక్షేమ పథకాలకు అనర్హులుగా ప్రకటించారని,ప్రస్తుతం అర్హులైన పేద ప్రజలందరికీ ప్రభుత్వ పథకాలు అందించాలని సూచించారు.ఇంకా రేషన్ కార్డులు లేని ప్రజలు దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే తెలిపారు.కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కిషోర్ కుమార్,మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి,నాయకులు,ఆర్డిఒరత్నా కళ్యాణి,ఎంఆర్ఒ,ఎంపిడిఒ,మండలఅధ్యక్షులు, మండల నాయకులు, కారకర్తలు,లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## కరెంట్, రోడ్ల సమస్యలపై దరఖాస్తులు



**ప్రజాపక్షం/కాసిపేట:**కాసిపేట ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణిలో రెండు దరఖాస్తులు అందినట్లు ఎంపిడిఒ సత్యనారాయణ సింగ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన వివరిస్తూ ధర్మరావుపేటకు చెందిన లక్కల వెంకటయ్య తమ గ్రామంలో కరెంట్ లేదని, ఎస్సి కాలనీ నుంచి పోచమ్మగుడి వరకు మూడు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే ఏజెన్సీ గ్రామాల్లో రోడ్లు బురదమయమై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, రివర్స్ సింగిల్ మొరం వేయించాలని, దోమల వల్ల డెంగీ వ్యాప్తి చెందుతుందనే నేపథ్యంలో బ్లీచింగ్ పౌడర్ పిచికారీ చేయాలని మాదిగ హక్కుల దండోరా సంఘం మండల అధ్యక్షుడు అక్కపురం రమేష్ కోరారు అన్నారు. ఎంపిఒషేక్ సప్దర్ అలీ, ఆర్ఐ, వ్యవసాయ అధికారి ప్రభాకర్, ఐసిడిఎస్ సూపర్వైజర్ రాధిక, సీనియర్ సహాయకుడు లక్ష్మీ నారాయణ, జూనియర్ సహాయకుడు తిరుపతి పాల్గొన్నారు.

## నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్:**మీ సేవ కేంద్రాల్లో నిబంధనలకు అనుగుణంగా మాత్రమే రుసుములు వసూలు చేయాలని, అధిక వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డిస్ట్రిక్ట్ మేనేజర్ గౌతమ్ రాజ్ హెచ్చరించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని జనకాపూర్ లోని మీ సేవా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిటిజన్ చార్టర్, ధ్రువపత్రాల నమోదు రిజిస్టర్, ఫిర్యాదుల నంబర్ లాంటి అంశాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిర్దేశిత రుసుములకు విరుద్ధంగా వసూలు చేస్తే బాధ్యత వహించాల్సి వస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం కుల ధ్రువీకరణ పత్రాల జారీపై నూతన సేవలు అమలులో ఉన్నందున మీ సేవ నిర్వాహకులు నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని సూచించారు. అధిక రుసుములు వసూలు చేస్తే సంబంధిత అధికారులపైనా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎవరైనా ఇలాంటి దుశ్రవణలకు గురైతే 1100 టోల్ ఫ్రీ నంబర్‌లో లేదా ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ నంబర్ 7995016036లో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

## సైబర్ మోసాలకు '1930'కు కాల్

వాంకిడిలో 'షీ టీం' అవగాహన కార్యక్రమం



**ప్రజాపక్షం/వాంకిడి:**మహిళలు, విద్యార్థినులు సైబర్ మోసాలకు గురైనప్పుడు వెంటనే 1930 నంబరుకు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని వాంకిడి ఎఎస్ఐ పోశెట్టి సూచించారు. సోమవారం వాంకిడి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో షీ టీమ్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఎస్ఐ పోశెట్టి మాట్లాడుతూ మహిళల భద్రతే మా ముఖ్య కర్తవ్యంగా షీ టీం నిరంతరం నిఘా కొనసాగిస్తోంది. ప్రధాన రహదారులు, బస్టాండ్లు, విద్యాసంస్థల వద్ద నిత్యం మోహరించాం. వేధింపులు, బెదిరింపులకు గురైతే భయపడకుండా 8712670564 నంబరుకు ఫోన్ చేయాలి. ఫిర్యాదుదారుల వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయి అని తెలిపారు. ఆన్లైన్ లోన్ యాప్స్, ఫేక్ లింకులు, మోసపూరిత కాల్స్ ద్వారా ప్రజలు మోసపోతున్న ఘటనలు పెరుగుతున్నాయని, ఇటువంటి సందర్భాల్లో ఎవ్వరినీ నమ్మకుండా తక్షణమే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబరుకు సమాచారం ఇవ్వాలని హితవు పలికారు. అలాగే మహిళలు అత్యవసర పరిస్థితుల్లో 100 నంబరుకు కాల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో షీ టీంసభ్యులు,కళాశాలప్రిన్సిపాల్,అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## సైబర్ సెక్యూరిటీ,యాంటీ డ్రగ్స్‌పైన అవగాహన కార్యక్రమం

**ప్రజాపక్షం/నిజాంపేట్:**కల్వకుంట ఉన్నత పాఠశాలలో నిజాంపేట ఎస్ఐరాజేష్ ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీ, డ్రగ్స్ పైన విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ, విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి అని డ్రగ్స్ పైన అవగాహన కలిగి ఉండాలని కొత్త వ్యక్తుల పట్ల జాగ్రత్త వహించాలిఅని,ఎలాంటి సమస్యలు సందేహాలు ఉన్న 112 నెంబర్ కు డయల్ చేసినచో కావలసిన సహాయం అందుతుంది అని తెలిపారు. ముఖ్యంగా అమ్మాయిలు ఏదైనా సమస్యతో బాధపడుతున్నట్లయితే ముందుగా తల్లిదండ్రులకు లేదా ఉపాధ్యాయులకు లేదా స్నేహితులకు చెప్పి పరిష్కరించుకోవాలిఅనిఅలా సమస్య పరిష్కారం కాని సమక్షంలో 112 కు దయల్ చేసి సహాయం పొందొచ్చు అని సూచించారు. పాఠశాల హెచ్ఎం మాధురి దేవి మాట్లాడుతూ విద్యార్థులు అందరూ సోషల్ మీడియా, చుట్టు జరుగుతున్న విషయాల పట్ల అవగాహన కలిగి ఉండాలి అని జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది అని తెలిపారు.పాఠశాల హెచ్ఎంఉపాధ్యాయులు,పోలీస్‌సిబ్బందిఎఎస్ఐ,కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

# అర్హులైన కుటుంబాలకు భరోసా:ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/తాండూర్:**రాష్ట్రంలో అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి రేషన్ కార్డులు అందజేస్తామని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి స్పష్టం చేశారు. సోమవారం మండలంలోని కిష్టంపేట రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నఎమ్మెల్యే మండలానికి మంజూరైన 472 కొత్త రేషన్ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగాఎమ్మెల్యేమాట్లాడుతూ పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, పార్టీలకు అతీతంగా ప్రతి అర్హుడికి ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాష్ట్రంలో సన్నబియ్యం పంపిణీ చేసిన ఘనత కూడా కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. ప్రతి అర్హ కుటుంబానికి ఆహార భద్రత కార్డుల ద్వారా సన్న బియ్యం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు. అనంతరం స్థానిక నాయకులు మండల ఐబి కేంద్రంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఆర్డిఓ హరి కృష్ణ, తహసీల్దార్ జ్యోత్స్న, ఎంపిడిఓ శ్రీనివాస్, డిప్యూటీ తహసిల్దార్ కల్పన, మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఎండి. ఈసా, సూరం రవీందర్ రెడ్డి, ఎస్. మహేందర్ రావు, జి. మురళీధర్ రావు, సిరంగి శంకర్, ఎస్.బానయ్య, టి.శంకర్ గౌడ్, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు అజాజుద్దీన్, పద్మజ, రేషన్ డీలర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.





### రేషన్ కార్డులు, ఇండ్ల చెక్కులు పంపిణీ

**నెన్నెల:**పది ఏండ్లుగా నిలిచిపోయిన రేషన్ కార్డుల మంజూరుతో పాటు ఇందిరమ్మ ఇండ్ల చెక్కుల పంపిణీ ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం తన హామీలను నిలబెట్టుకుంటోందని బెల్లంపల్లి ఎంఎల్ఏ గడ్డం వినోద్ వెంకటస్వామి అన్నారు. సోమవారం నెన్నల్ మండల రైతు వేదికలో జరిగిన కార్యక్రమంలో ఎంఎల్ఏ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మండలానికి మంజూరైన 621 రేషన్ కార్డులను ఆర్డిఒ హరికృష్ణ, తహసిల్దార్ తదితరులతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు తొలి విడతగా లక్ష రూపాయల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ రాష్ట్రంలో పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం. రేషన్ కార్డుల మంజూరు ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తోందంటే అది కాంగ్రెస్‌దే ప్రత్యేకత. గత బిఆర్ఎస్ పాలనలో రేషన్ కార్డుల విషయంలో నిర్లక్ష్యం జరిగింది. కానీ ఇప్పుడు న్యాయం జరుగుతోందని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా ప్రతి అర్హునికి సొంతింటి కల నెరవేర్చేలా ప్రభుత్వం కట్టుబడి పని చేస్తోందన్నారు. ప్రతి హామీకి కార్యరూపం ఇస్తూ ముందుకు సాగుతున్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ, అధికారులు, లబ్ధిదారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జిఒ49 రద్దుపై ఆదివాసీల ఆందోళన

కలెక్టరేట్ ముట్టడి ప్రయత్నం, ఉద్రిక్తత



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్:**జిఒ నెంబర్ 49 రద్దు కోసం ఆదివాసీలు ఉక్కు పాదం మోపారు. తుడుం దెబ్బ ఆధ్వర్యంలో నిర్వహించిన చలో కలెక్టరేట్ కార్యక్రమం ఉద్రిక్తతకు దారితీసింది. ఆదివాసీ భవన్ నుంచి కొమరం భీమ్ చౌక్ మీదుగా ర్యాలీగా కలెక్టరేట్ చేరుకున్న వందలాది మంది గిరిజనులు, జిఒ రద్దు కోరుతూ కలెక్టరేట్ ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం వ్యతిరేక నినాదాలు చేశారు. కలెక్టరేట్ లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలీసులు భారీగా మోహరించి పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు. ధర్నా ముగిసిన అనంతరం సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు మాట్లాడుతూ, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల కోసం కాంగ్రెస్ నాయకులు జిఒపై డ్రామాలు చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. దశలవారీగా ఆందోళనలు చేపడతామని వెల్లడించారు. తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు కోట్నాక విజయ్ కుమార్ మాట్లాడుతూ వందల ఏళ్లుగా అటవీ సంపదపై ఆధారపడే ఆదివాసీలను పులుల సంరక్షణ పేరుతో ప్రాంతం ఖాళీ చేయించడం కుట్రగా అభివర్ణించారు. ఇది కుట్రలో భాగంగానే జిఒ 49 అమలయ్యిందన్నారు. జిఒ రద్దు చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు ముమ్మరం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాకు బిజెపి నేతలతో పాటు జిల్లా ప్రజాసంఘాల నాయకులు మద్దతు తెలిపారు.

## ఉద్యమంలా హరిత యజ్ఞం

హరితసేన శ్రీకారం లోగో ఆవిష్కరించిన ఎమ్మెల్సీ వంటేరు యాదవ రెడ్డి



**ప్రజాపక్షం/గజ్వేల్:**మాజీ రాష్ట్రపతి, శాస్త్రవేత్త అబ్దుల్ కలాం స్ఫూర్తితో హరిత యజ్ఞం ఉద్యమంలా సాగుతున్నట్లు ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం జిల్లా హరిత సేన అధ్యక్షుడు రాజారావు నేతృత్వంలో గజ్వేల్‌లో మొక్కలు నాటడంతో పాటు 8వ విడత గ్రీన్ ఇండియా లోగో ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రేపటి మార్పు కోసం మొక్క నాటి భాగస్వాములు కావాలని మాజీ రాజ్యసభ సభ్యుడు గ్రీన్ ఇండియా కార్యక్రమానికి శ్రీకారం చుట్టగా, ఇప్పటి వరకు 20 కోట్ల మొక్కలు నాటి సంరక్షించే బృహత్తర కార్యక్రమం చేపట్టినట్లు స్పష్టం చేశారు. భవిష్యత్తు తరాలను దృష్టిలో పెట్టుకొని రాజకీయాలకు అతీతంగా ఈ కార్యక్రమం చేపట్టి దేశవ్యాప్తంగా విస్తరింపజేసినట్లు తెలిపారు. స్వచ్ఛమైన వాతావరణం కోసం ఉత్తమ రేపటిని తీర్చిదిద్దుకుందామని చెప్పారు. జీవితాంతం మొక్కలు నాటే చారిత్రాత్మక కార్యక్రమాన్ని సంతోష్ కుమార్ చేపట్టి ఆదర్శంగా నిలుస్తుండగా, సామాన్యుడి నుండి మేధావులు, కవులు, కళాకారులు, సినీ ప్రముఖులు, ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యంతో హరిత భారత్ గా రూపుదిద్దుకుంటున్నట్లు పేర్కొన్నారు. జిల్లా హరితసేన అధ్యక్షులు రాజారావు, ఆయా మండలాల హరితసేన బాధ్యులు ,తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలు సద్వినియోగం: కలెక్టర్



**ప్రజాపక్షం/సిర్పూర్ టి:**ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ప్రభుత్వం మంజూరు చేసిన కొత్త రేషన్ కార్డులను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీదండే విఠల్, అదనపు కలెక్టర్ ఎం. డేవిడ్, సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంక్షేమ పథకాలను అర్హులైనవారికి ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొస్తుందని, వాటిని పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవాలన్నారు. పర్యటనలో భాగంగా ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేసి, ఎరువుల కొరత తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతులకు అందే మందులకు రసీదు ఇవ్వడం తప్పనిసరి అని, స్టాక్ వివరాలను బోర్డుపై ప్రదర్శించాలని సూచించారు. ఎరువుల దుర్వినియోగం జరిగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సదుపాయాలను పరిశీలించారు. సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలని, అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. జెడ్పి హైస్కూల్‌ను సందర్శించిన కలెక్టర్, విద్యార్థులతో మాట్లాడి మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందించాలని సూచించారు. నాణ్యమైన బోధనతో పాటు విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని రుచికరమైన భోజనం అందించాలన్నారు. పదవ తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, పరిశుభ్రత పాటించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మోహినుద్దీన్, వ్యవసాయ శాఖ అధికారి మనోహర్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## డ్రైడేని పాటించని ప్రభుత్వ కార్యాలయాలు..



**ప్రజాపక్షం/నేరడిగొండ:**నేరడిగొండ మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు ప్రతి శుక్రవారం నిర్వహించే డ్రైడే కార్యక్రమాన్ని పాటించకుండా కార్యాలయాలు చుట్టూ ఏపుగా పెరిగిన కలుపు మొక్కలు,కార్యాలయాల గోడలపై మొలచిన వృక్షాలు స్లాబుపై ఉన్న చెత్త చెదారం చూస్తే ముక్కున వేలు వేసుకోవలసిన పరిస్థితి ఏర్పడ్డదని మండలానికి వచ్చి పోయే ప్రజలు అంటున్నారు. గ్రామాలకు వచ్చి పదే పదే ప్రజలకు చెప్పున్నా ప్రభుత్వ అధికారులు వారి సొంత కార్యాలయాలని శుభ్రంగా ఉంచుకోకుండా ఇంత అధ్వాన్నమైన పరిస్థితులు ఉంటాయని అనుకోలేమని ప్రజలు అంటున్నారు.ఏది ఏమైనా ప్రభుత్వ కార్యాలయాలు తహసీల్దార్ కార్యాలయం గోడలు స్లాబుపై మొలచినా వృక్షాలు కలుపు మొక్కలు,ఇజిఎస్ కార్యాలయంపై వాన నీరు చేరుకొని నాచు పట్టి ఏపుగ మొలిచిన కలుపు మొక్కలు,మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం ఎదురుగా ఉన్న మైదానంలో పేరుకుపోయిన ప్లాస్టిక్ చెత్తచెదారాన్ని చేస్తే ఇట్టే అర్థమవుతుందని ఇలానే ఉన్నట్లయితే దోమలు స్వైర విహారం చేస్తాయనడంలో సందేహం లేదు.ఇప్పటికైనా అధికారులు స్పందించి ఉన్న చెత్త చెదారాన్ని తొలగించాలని పలువురు కోరుతున్నారు.

## ప్రతిష్ఠాత్మక పథకాల అమలులో వేగం పెంచాలి

క్షేత్రస్థాయిలో చురుకుగా పని చేయాలి: కలెక్టర్ అభిలాష అభినవ్



**ప్రజాపక్షం/నిర్మల్‌టౌన్:**ప్రతిష్ఠాత్మక ప్రభుత్వ పథకాల అమలు పక్కాగా జరిగేలా అధికారులు క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు.సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి ఆమె ప్రజల వినతులను స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి,సమస్యలు పరిష్కరించాలని అన్నారు.అనంతరం కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు.మండల ప్రత్యేక అధికారులు,తహసీల్దార్లు,ఎంపిడిఒలు,సంబంధిత శాఖల అధికారులు నిరంతరం ప్రభుత్వ వసతిగృహాలు, పాఠశాలలు,ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు,ఎరువులువిత్తనాల దుకాణాలు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు,రేషన్ కార్డుల జారీ,వనమహోత్సవం,ఫీవర్ సర్వేలు,వెటర్నరీ క్యాంపులు,పిఎం ఆవాస్ యోజన వంటి కార్యక్రమాలను అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని ఆదేశించారు.వర్షాకాలం నేపథ్యంలో మండలాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని,ప్రాణ, ఆస్తి,నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాల ప్రభావిత ప్రాంతాల్లో తహసీల్దార్లు,ఎంపిడిఒలు, పోలీస్ అధికారులు పర్యటించి పరిస్థితిని సమీక్షించాలని పేర్కొన్నారు.సీజనల్ వ్యాధుల నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని,మలేరియా,డెంగీవంటి వ్యాధుల నివారణకు వైద్య,పంచాయతీ,మున్సిపల్ శాఖల మధ్య సమన్వయం అవసరమని చెప్పారు.బాధితులకు వెంటనే వైద్యం అందించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులదేనని స్పష్టం చేశారు.విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి శుక్రవారం స్కూల్ డే నిర్వహించాలని,వంటకాలు మెనూ ప్రకారం తయారవుతున్నాయా,కూరగాయల నాణ్యత,వంట సరుకుల పరిశుభ్రత వంటి అంశాలను ప్రత్యేక అధికారులు పరిశీలించాలన్నారు.ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగంగా కొనసాగుతున్నదని,గ్రౌండింగ్ ప్రక్రియను మరింత ముమ్మరంగా చేపట్టాలని సూచించారు. వివిధ జిల్లా శాఖల అధికారులు,సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.


## ఆయిల్ పామ్ పంటతో అధిక లాభాలు


జిల్లా ఉద్యానవన అధికారి ప్రతాప్ సింగ్

**ప్రజాపక్షం/నర్సాపూర్:**ఆయిల్ పామ్ పంటతో అధిక లాభాలు పొందవచ్చని జిల్లా ఉద్యానవన అధికారి ప్రతాప్ సింగ్ అన్నారు. సోమవారం నర్సాపూర్ మండల పరిధిలోని అచ్చంపేట గ్రామంలోని పుల్కంటి నర్సింలు పంట పొలంలో, లీప్ ఫామ్ రిసోర్స్ కంపెనీ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్, మొక్కలను నాటారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యానవన అధికారి ప్రతాప్ సింగ్, సంతోష్ లు మాట్లాడుతూ, ఆయిల్‌పామ్ పంటతో అతి తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందవచ్చని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో లీప్ ఫామ్ రిసోర్స్ కంపెనీ మేనేజర్ కృష్ణ, ఎఇఒ దుర్గప్రసాద్, కార్యదర్శి శ్రీనివాస్, గ్రామస్తులు ,తదితరులు ఉన్నారు.



# ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నాం: షబ్బీర్‌అలీ





**ప్రజాపక్షం/నిజామాబాద్:**ప్రజలకిచ్చిన హామీలను సిఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం తూ.చ తప్పకుండా అమలు చేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్‌అలీ అన్నారు. అర్బన్ నియోజకవర్గ పరిధిలోని లబ్ధిదారులకు మంజూరైన కొత్త రేషన్ కార్డులను సోమవారం జిల్లా కేంద్రంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో పంపిణీ చేసి మాట్లాడారు. గడిచిన 13 సంవత్సరాల తర్వాత ప్రజల కొత్త రేషన్ కార్డుల కలను రాష్ట్ర ప్రభుత్వం సాకారం చేసిందన్నారు. ప్రజల ఆకాంక్షలను గౌరవిస్తూ, తమ ప్రభుత్వం పెద్ద ఎత్తున కార్డులు అందిస్తోందని గుర్తు చేశారు. ఇది నిరంతర ప్రక్రియ అని స్పష్టం చేశారు. ఇంకనూఅర్హులైన వారు మిగిలి ఉంటే దరఖాస్తులు చేసుకోవాలని, కార్డులు రాని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సూచించారు. అర్హత కలిగిన ప్రతీకుటుంబానికి రేషన్ కార్డులు మంజూరు చేస్తామని భరోసా కల్పించారు. ఒక్కొ జిల్లాలోనే 118 52 కొత్త రేషన్ కార్డులు మంజూరు చేశామని, మరో 8 4232 మంది సభ్యుల పేర్లను కొత్తగా రేషన్ కార్డుల జాబితాలో చేర్చామన్నారు. ఇందులో భాగంగానే అర్బన్ నియోజకవర్గంలోని నార్త్, సౌత్ మండలాల పరిధిలోని 3 174 కుటుంబాలకు కొత్త కార్డులు 16687 మంది సభ్యుల పేర్లను కొత్తగా నమోదు చేయటం జరిగిందని వివరించారు. అదనపు కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ పూర్తి పారదర్శకంగా రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. అర్హులైన వారికి మాత్రమే కార్డులు మంజూరయ్యేలా పకడ్బందీ పరిశీలన జరుపుతున్నామన్నారు. కార్యక్రమంలో తాహెర్‌బిన్ హందాన్, మానాల మోహన్‌రెడ్డి, బాలరాజు, విజయ్‌కాంత్ పాల్గొన్నారు.

### నిజామాబాద్ గ్రీన్ సిటీగా తీర్చిదిద్దుదాం

నిజామాబాద్‌ను గ్రీన్ సిటీగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ పిలుపునిచ్చారు. వనమహోత్సవంలో భాగంగా సోమవారం నగరంలోని మారుతినగర్‌లో ఆయన స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ మాట్లాడుతూ పచ్చదనాన్ని పెంపొందిస్తూ పర్యావరణాన్ని పరిరక్షించేందుకు వీలుగా ప్రభుత్వం వనమహోత్సవం ద్వారా పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. కుల, మతాలకతీతంగా అన్ని వర్గాల వారు ఈ బృహత్తర కార్యంలో భాగస్వాములై వనమహోత్సవను విజయవంతం చేయాలని సూచించారు. జిల్లాలో ఈ యేడాది 51 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నందున పూర్తి స్థాయి లక్ష్యసాధనకు సమిష్టిగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఇళ్ల వద్ద మొక్కలు నాటే వారికి కూడా ప్రభుత్వం తరపున ఉచితంగా మొక్కలు అందించడం జరుగుతుందని తెలిపారు.

## ప్రజావాణికి 328 దరఖాస్తులు



**ప్రజాపక్షం/కరీంనగర్ సిటీ:** కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 328 అర్జీదారులు దరఖాస్తులు సమర్పించారు. అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీ కిరణ్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వర్లు, రెవెన్యూ డివిజనల్ అధికారులు మహేశ్వర్, రమేష్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. దరఖాస్తులను పరిష్కరించాలని అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోకి వచ్చిన దరఖాస్తులను సంబంధిత సెక్షన్ అధికారులు సత్వరమే పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఆదేశించారు.

## అంత్యక్రియల్లో పాల్గొన్న జువ్వాడి



**ప్రజాపక్షం / ఇబ్రహీంపట్నం:** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని వేములకుర్తి గ్రామానికి చెందిన గుడ్ల రామకృష్ణ ఆర్మూర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నానమ్మ సోమవారం వేములకుర్తిలో చనిపోయారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు గ్రామంలోని వారి ఇంటికి వెళ్లి రామకృష్ణ నానమ్మకు నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. కొద్ది రోజుల క్రితం మండలంలోని యామాపూర్ గ్రామంలో అనారోగ్యంతో ఎలాల జగన్ చనిపోగా వారి కుటుంబ సభ్యులను,అదే విధంగా కాంగ్రెస్ నాయకులు కొమ్ముల తుక్కారెడ్డి భార్య చనిపోగా వారి కుటుంబ సభ్యులను కృష్ణారావు పరామర్శించారు. కృష్ణారావు వెంట మాజీ ఎంపిపి నేరేళ్ల దేవేందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మహేందర్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ అంకతి రాజన్న, కాంగ్రెస్ పార్టీ నాయకులు పెంట లింబాద్రి, ఏలేటి జనార్ధన్ రెడ్డి, క్యాతం తిరుపతి, తలారి ఆనంద్, తదితరులు ఉన్నారు.

## ఆదాయ పన్ను చెల్లింపులపై అవగాహన కలిగి ఉండాలి

ఆదాయపు పన్ను శాఖ అదనపు డైరెక్టర్ శంకర్ పాండే




**ప్రజాపక్షం/కరీంనగర్ సిటీ:** ఆదాయ పన్ను చెల్లింపులు, రిటర్న్స్ దాఖలుపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఆదాయ పన్ను శాఖ ఇంటెలిజెన్స్ అండ్ క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ అడిషనల్ డైరెక్టర్ శంకర్ పాండే అన్నారు. సోమవారం కరీంనగర్‌లోని ఓ హోటల్‌లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాలకు చెందిన వ్యాపారులు, ఆస్పత్రుల యాజమాన్యాలు, వ్యాపార వాణిజ్య వేత్తలకు చెందిన పన్నుదారులతో ఆదాయ పన్ను చెల్లింపులలో భాగంగా ఫారం 60, ఫారం 61 ఫైలింగ్ పై అవగాహన కల్పించారు. వ్యాపారుల సందేహాలను నివృత్తి చేశారు. ఫారం 60, 61లో పాన్‌కార్డు వెరిఫికేషన్‌పై అవగాహన పెంపొందించాలన్నారు. పాన్ కార్డు వినియోగంతో ఉన్న లాభాలను వివరించారు. పాన్‌కార్డు ఉంటే పన్ను మినహాయింపులు ఏ మేరకు ఉంటాయో వ్యాపారులకు అవగాహన కల్పించారు. ప్రజలకు పాన్ కార్డు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించాలన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా బంగారం వ్యాపారులు, హాస్పిటల్స్ నిర్వాహకులు, హోటల్స్ యజమానులు హాజరయ్యారు. సమావేశంలో ఇన్కమ్ ట్యాక్స్ ఆఫీసర్ లలిత కుమారి, ఇన్స్‌పెక్టర్లు బిళ్ల రవి కుమార్, గౌతంలు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేస్తూ రెండు లక్షలు మించిన ప్రతి లావాదేవీకి వినియోగదారుల నుంచి పాన్ (పర్మనెంట్ అకౌంట్ నెంబర్) తప్పనిసరిగా తీసుకోవాల్సిందిగా సూచించారు. లేని పక్షంలో ఫారం 60 తీసుకుని వివరాలను ఫారం 61లో విధిగా ఫైల్ చేయాలని సూచించారు.

## భువనేశ్వర్ జాతీయ కార్యశాలలో కరీంనగర్ కలెక్టర్

పారిశుద్ధ్య కార్మికుల రక్షణ, భద్రతపై ప్రసంగించిన పమేలా సత్పతి



**ప్రజాపక్షం/కరీంనగర్:** పారిశుద్ధ్య కార్మికుల రక్షణ, భద్రతకు తీసుకోవాల్సిన చర్యలపై ఒరిస్సా రాష్ట్ర ప్రభుత్వం భువనేశ్వర్‌లో నిర్వహించిన రెండు రోజుల జాతీయస్థాయి కార్యశాలకు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతికి ఆహ్వానం అందింది. ఈ మేరకు కలెక్టర్ ఈ కార్యశాలలో పాల్గొన్నారు. పారిశుద్ధ్యం, ప్రజారోగ్య వ్యవస్థలకు పారిశుద్ధ్య కార్మికులు పునాదిగా నిలుస్తున్నప్పటికీ వారు అసురక్షిత పని పరిస్థితులు, పరిమిత రక్షణలు, సామాజిక అణచివేతను ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో సంస్కరణల తక్షణ అవసరాన్ని గుర్తించిన ఒడిశాల ప్రభుత్వం 26, 27 తేదీల్లో భువనేశ్వర్‌లో కార్యశాల నిర్వహించింది. పారిశుద్ధ్య పనుల్లో భద్రత, రక్షణ, పారిశుద్ధ్య కార్మికుల గౌరవం పెంచేందుకు ఇతర రాష్ట్రాలు, సంస్థలు చేస్తున్న ప్రయత్నాలను ఈ కార్యశాలలో చర్చించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికుల భద్రతకు కరీంనగర్‌లో తీసుకుంటున్న చర్యలను భువనేశ్వర్ జాతీయ కార్యశాలలో కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి వివరించారు. జిల్లాలో యునిసెఫ్ సంస్థ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో పారిశుద్ధ్య కార్మికుల భద్రతా చర్యలను గురించి తెలియజేశారు. పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యాన్ని కాపాడడమే లక్ష్యంగా ప్రత్యేకంగా రూపొందించిన ఆరోగ్య కార్డులు అందజేశామని, తరచుగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వారి ఆరోగ్యానికి సంబంధించిన పూర్తి వివరాలను రికార్డు చేశామని తెలిపారు. వారికి వైద్య పరీక్షలు నిర్వహిస్తూ ఉచితంగా మందులు అందజేస్తున్నామన్నారు. మహిళా కార్మికులకు ఈ విధానం వారి ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. స్క్రీనింగ్ పరీక్షల్లో ప్రమాదకర వ్యాధులను ముందుగానే గుర్తించడం వల్ల చికిత్స అందించి వారిని ప్రాణాపాయం నుంచి తప్పించవచ్చని సూచించారు. కంటి పరీక్షలు నిర్వహించడం, అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు చేయించడం వంటి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్మికులందరికీ పిపిఈ కిట్లు, హెల్మెట్లు, గ్లౌజ్ వంటి రక్షణ కవచాలు అందించడం ద్వారా వ్యాధుల బారిన పడకుండా ఉంటారన్నారు. ఈ విధానాన్ని కరీంనగర్‌లో విజయవంతంగా అమలు చేశామని వివరించారు. కార్మికులు మరణించినప్పుడు వారి కుటుంబాలను ఆదుకునేందుకు బీమా ఉపయోగపడుతుందని, అందుచేత కరీంనగర్ జిల్లాలో ప్రతి కార్మికుడికి గ్రామపంచాయతీ, మున్సిపల్ నిధులతో పిఎంజేజేబివై, పిఎంఎస్‌బివై , పోస్టల్, బ్యాంకుల్లో ద్వారా బీమా చేయించామని వివరించారు. ఈ కార్యశాలలో పాల్గొన్న వివిధ రాష్ట్రాల ప్రతినిధులు, ఒరిస్సా రాష్ట్ర ఉన్నతాధికారులు కరీంనగర్‌లో పారిశుద్ధ్య కార్మికుల భద్రతకు తీసుకుంటున్న చర్యలపై ప్రశంసించారు. కరీంనగర్ అనుసరిస్తున్న విధానాలను అన్ని రాష్ట్రాల్లోనూ అనుసరించాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వివిధ రాష్ట్రాల్లో పారిశుద్ధ్య కార్మికుల కోసం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాల గురించి కలెక్టర్ తెలుసుకున్నారు.

## మద్యానికి ఉన్న మంత్రి.. విద్యాశాఖకు ఎందుకు లేదు?

ఎఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి లద్దునూరి విష్ణు



**ప్రజాపక్షం/జమ్మికుంట:** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం 18 నెలల పాలనలో హానికర మద్యానికి మంత్రిని కేటాయించి భవిష్యత్తు విద్యార్థుల చదువులకు ప్రత్యేక మంత్రిని కేటాయించకపోవడం సిగ్గుచేటని ఎఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి లద్దునూరి విష్ణు విమర్శించారు. సోమవారం జమ్మికుంట పట్టణ కేంద్రంలో ఎఐఎస్ఎఫ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యారంగ సమస్యలు పరిష్కారం చేయడంలో, హామీలు అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తుందన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. వారి చదువులకు నిధులు లేవు కానీ హెలికాప్టర్లలో మంత్రులు దుబారాగా తిరగడానికి నిధులు వస్తున్నాయని, గురుకులాల్లో ఫుడ్ పాయిజన్‌లు జరిగి విద్యార్థులు అనారోగ్య బారిన పడుతున్నా వారిని పట్టించుకోవడం లేదన్నారు. ఫుడ్ పాయిజన్ సమస్యకు పరిష్కారం చూపడం లేదన్నారు. రాష్ట్రంలో విద్యారంగానికి ప్రత్యేక మంత్రి లేకపోవడం ద్వారానే సమస్యలు పేర్కొన్నాయన్నారు. సిఎం రేవంత్ రెడ్డి తన వద్ద విద్యాశాఖ పెట్టుకుని ఎవరిని కలవనీయకుండా సమస్యలు పరిష్కరించడం లేదన్నారు. ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీ అరికట్టడంలో, విద్యాహక్కు చట్టం అమలు చేయడంలో, ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు అభిలాష్, నవీన్, కుమార్, రాజు తదితరులున్నారు.

## 'వివేకానంద'లో ముగిసిన సిబిఎస్ఇ కబడ్డీ క్లస్టర్ 7పోటీలు




**ప్రజాపక్షం/కరీంనగర్ సిటీ:** కరీంనగర్‌లోని జగిత్యాల రోడ్డులో గల వివేకానంద రెసిడెన్షియల్ (సిబిఎస్ఇ) పాఠశాలలో గత మూడు రోజులుగా రసవత్తరంగా జరుగుతున్న సిబిఎస్ఇ క్లస్టర్ 7 కబడ్డీ పోటీలు ఆదివారంతో ముగిసాయి. ముగింపు ఉత్సవాలకు ముఖ్య అతిథిలుగా కరీంనగర్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రెసిడెంట్ సిహెచ్ అమిత్ కుమార్, డివైఎస్‌వో వి.శ్రీనివాస్, జిల్లా కమిటీ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ సిహెచ్ సంపత్‌రావు, జిల్లా కమిటీ అసోసియేషన్ సెక్రటరీ బి.మల్లేశం, సిబిఎస్ఇ చేత నియమితులైన పరిశీలకులు ఎల్.వెంకటరమణలు హాజరయ్యారు. ఈ సందర్భంగా సిబిఎస్ఇ క్లస్టర్ 7 కబడ్డీ పోటీలలో వివిధ విభాగాల్లో చాంపియన్‌గా నిలిచిన విజేతలకు ట్రోఫీలు, బహుమతులు అందజేశారు. అండర్ 14 విన్నర్‌గా శ్రీ ప్రకాష్ విద్యానికేతన్, పాయకరావుపేట (ఆంధ్రప్రదేశ్), రన్నర్‌గా వెరిటాస్ సైనిక్ స్కూల్, తిరుపతి (ఆంధ్రప్రదేశ్), తృతీయ స్థానంలో సూర్య చంద్ర ప్యాలస్ స్కూల్, వనపర్తి (తెలంగాణ), తృతీయ స్థానంలో శ్రీ విద్యాపీఠ నార్కెట్‌పల్లి (తెలంగాణ), అండర్ 17 విభాగంలో విన్నర్‌గా వెరిటాస్ సైనిక్ స్కూల్, తిరుపతి (ఏపి), రన్నర్‌గా శ్రీ విద్యాపీఠ నార్కట్‌పల్లి స్కూల్ (తెలంగాణ), తృతీయ స్థానంలో సూర్యచంద్ర ప్యాలెస్, వనపర్తి (తెలంగాణ), తృతీయ స్థానంలో ఎస్ఆర్ విద్యానికేతన్ ఇంటర్నేషనల్ స్కూల్, గద్వాల్ (తెలంగాణ), అండర్ 19 విభాగంలో విన్నర్‌గా శ్రీ ప్రకాష్ విద్యాపీఠం, పాయకరావుపేట (ఏపి), ద్వితీయ స్థానంలో సిస్టర్ నివేదిత స్కూల్, హైదరాబాద్ (తెలంగాణ), తృతీయ స్థానంలో వెరిటాస్ సైనిక్ స్కూల్, తిరుపతి(ఏపి), తృతీయ స్థానంలో హీల్స్ హైస్కూల్ నర్సింగపాలెం (ఏపి)లు విజేతలుగా నిలిచారు. విజేతలకు అభినందనలు తెలియజేస్తూ చాంపియన్ షిప్ ట్రోఫీతో పాటు క్రీడల ప్రారంభం రోజు తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ వెలిచాల రాజేందర్ రావు విజేతలకు ప్రకటించిన మేరకు అతిథులు ప్రథమస్థానం రూ.10 వేలు, ద్వితీయ రూ.8 వేలు, తృతీయ విజేతలకు రూ.5 వేలు నగదు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. క్రీడాకారులు, . పోటీలను ఘనంగా నిర్వహించిన వారికి అభినందనలు తెలిపారు. పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ డా.టి.లలితా కుమారి, ప్రిన్సిపాల్ రేణుక బలివాడ, వైస్ ప్రిన్సిపాల్ ఎం.ప్రశాంత్, హెడ్ మిస్ట్రెస్ అనిత, పాఠశాల అడ్వైజరీ కమిటీ సభ్యులు గంద్ర లక్ష్మణ్‌రావు, అడ్మినిస్ట్రేటివ్ అధికారి చిత్తరంజన్, తదితరులు పాల్గొన్నారు.

## ఇండ్ల స్థలాల సమస్యను వెంటనే పరిష్కరించాలి: శ్రీనివాస్



**ప్రజాపక్షం/కొహెడ:** శ్రీరాములపల్లిలోని ఇండ్ల స్థలాల సమస్యను వెంటనే పరిష్కరించాలని సిపిఐ కొహెడ మండల కార్యదర్శి వేల్పుల శ్రీనివాస్ అన్నారు. శ్రీరాములపల్లె గ్రామానికి చెందిన సర్వే నెంబర్ 125, 129 లో 47 మందికి పట్టా ప్రొసీడింగులు ఇవ్వడం జరిగిందని గ్రామ ఇండ్ల స్థలాల లబ్ధిదారులు కమ్యూనిస్టు నాయకులతో చెప్పడంతో సోమవారం సిపిఐ నాయకులు శ్రీరాములపల్లెకు వెళ్ళి భూమిని, వారి పట్టా కాగితాలను క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు ఇండ్ల స్థలాల గురించి పలుమార్లు ఎమ్మార్వో ఆఫీసులో పిటిషన్ ఇచ్చిన ఎలాంటి స్పందన లేదని, అందువలన ఈ రోజు కమ్యూనిస్టు నాయకత్వం ఆధ్వర్యంలో భూ పరిశీలన చేయడం జరిగిందన్నారు.సిపిఐ సీనియర్ నాయకులు బోనగిరి శంకర్, శ్రీరాములపల్లి సిపిఐ సీనియర్ నాయకులు జాగిరి బాలయ్య, బూర రాజేశం, జాలిగం రాజయ్య, ఇండ్ల స్థలాల లబ్ధిదారులు సకినాల సారయ్య, వారపు రవీందర్, అపారపు రవీందర్, వడ్డేపల్లి రామచంద్రం, గుమ్మడి రామక్క, సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సరఫరాకు అంతరాయం

**ప్రజాపక్షం/మల్యాల :** జగిత్యాల జిల్లా మల్యాల మండలం రాంపూర్ 33/11 కే వీ సబ్ స్టేషన్ పరిధిలోని రాంపూర్, ఓబులాపూర్,వడ్డెర కాలనీ గ్రామాలకు నూతన బ్రేకర్ మరమ్మతుల దృష్ట్యా మంగళవారం మధ్యాహ్నం 12 గంటల నుండి 3 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపి వేయనున్నట్లు రామన్న పేట ట్రాన్స్కో ఏ ఈ శ్రీనివాస్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఏఈ కోరారు.

## ప్రజావాణి సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

సిద్దిపేట కలెక్టర్ హైమావతి



**ప్రజాపక్షం/ సిద్దిపేట :** ప్రజావాణి కార్యక్రమానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా అధికారులకు కలెక్టర్ హైమావతి ఆదేశించారు. సోమావారం సమీకృత కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని నలుమూలల నుండి 120 మంది వివిధ సమస్యలపై అర్జీలను ఫిర్యాదుదారుల నుండి అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్,కలెక్టర్ హైమావతిలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పెండింగ్‌లో పెట్టకుండ ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రజావాణి సమస్యలను నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదన్నారు. ప్రజావాణిపై ఎంతో నమ్మకంతో జిల్లాలోని నలుమూలల నుండి ప్రజలు వస్తారని , వారి నమ్మకాన్ని వమ్ముచేయవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే సచివాలయం ముట్టడి

భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దరిపల్లి చంద్రం



**ప్రజాపక్షం/ సిద్దిపేట :** భవన నిర్మాణ కార్మికుల సమస్యలను నెల రోజుల్లో పరిష్కరించకుంటే సచివాలయాన్ని ముట్టడిస్తామని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దరిపల్లి చంద్రం అన్నారు. భవన నిర్మాణ కార్మికుల ప్రధాన సమస్యలను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి సిఎం రేవంత్‌రెడి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని స్పష్టమైన హామీనిచ్చారన్నారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలను నెల రోజుల్లోపు పరిష్కరించకుంటే రాష్ట్ర భవన నిర్మాణ కార్మికులతో సచివాలయాన్ని ముట్టడిస్తామని బివిఎన్‌కెవిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దరిపల్లి చంద్రం హెచ్చరించారు. సోమవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కొండమల్లయ్య గార్డెన్‌లో భవన నిర్మాణ కార్మికుల రాష్ట్ర మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర కెబినేట్ సమావేశం ఉండటం వల్ల తాను సమావేశానికి హాజరుకాలేకపోతున్నానని, మీ సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తానని హామీనిచ్చినట్లు తెలిపారు. భవన నిర్మాణ రంగాల కార్మికులకు అండగా ఉండి. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అవిశ్రాంతంగా పోరాటం చేస్తానన్నారు. భవన నిర్మాణ కార్మికులు ఇతర రాష్ట్రాల నుండి పెద్ద ఎత్తున వలస వస్తుండటం వల్ల ఈ ప్రాంత కార్మికులకు పనిదొరకని పరిస్థితులు నెలకొంటున్నాయని, భవన నిర్మాణకార్మికులకు పెద్ద అన్యాయం జరుగుతుందన్నారు. భవన నిర్మాణ కార్మికులకు గుర్తింపు కల్పించింది కాంగ్రెస్ పార్టీ అన్నారు. కార్మికుల సంక్షేమానికి స్వ ర్గీయ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో 1996 చట్టం అమలు చేసినట్లు తెలిపారు. 1996 చట్టాన్ని పూర్తి స్థాయిలో అమలు చేసి కార్మికులకు న్యాయం చేయాలన్నారు. కార్మికులకు ప్రమాద బీమా సౌకర్యం 10లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి ఉమ్మడి జిల్లాకు ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు చేయాలన్నారు. అర్హులైన భవన నిర్మాణ కార్మికులను గుర్తించి 10లక్షల వరకు పనిముట్లపై రుణ సౌకర్యం కల్పించాలన్నారు. 55 ఏండ్లు నిండిన కార్మికులకు 5వేలకు పైగా పింఛన్ చెల్లించాలన్నారు. సాధరణ మరణం పొందిన కార్మికుల కుటుంబాలకు 2లక్షలు చెల్లించాలన్నారు. భవణ నిర్మాణ కార్మిక బోర్డు చైర్మన్ పదవిని భవన నిర్మాణ కార్మికులచే భర్తీ చేయాలన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కాంగ్రెస్ సర్కార్ సిద్ధంగా ఉందని మంత్రి వెంకటస్వామి స్పష్టం చేసినట్లు తెలిపారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికరంగాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు. కార్మికులను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కారమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. భవన నిర్మాణకార్మికుల సమస్యల పరిష్కారానికి మంత్రి వివేక్ ప్రత్యేక చొరవ చూపాలన్నారు. లేని పక్షంలో భవన నిర్మాణ కార్మికులతో మరో ఉద్యమానికి శ్రీకారం చుడుతామని హెచ్చరించారు. గ్రామాలో ఉన్న బెల్టుషాపులు, మద్యం దుకాణాలను కాంగ్రెస్ సర్కార్ ఎత్తివేయాలన్నారు. మద్యం దుకాణాలతో విరివిగా ఉండటం వల్ల కార్మికులు మద్యానికి బానిసై ఆనారోగ్యానికి గురవుతున్నారన్నారు. వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. బెల్టుషాపుల నిషేధానికి కాంగ్రెస్ సర్కార్ చొరవ చూపాలన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు డిటిఓ సభ్యుడు సూర్యవర్మ, నాయకులు కొండల్‌రెడ్డి, భవన నిర్మాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చెలిమల రాములు, జిల్లా అధ్యక్షులు శ్రీశైలం. రవీందర్, భాస్కర్, తోట్ల నర్సింలు. లక్ష్మయ్య, వివిధ జిల్లా భవన నిర్మాణ కార్మికసంఘం జిల్లా అధ్యక్షుల పాల్గొన్నారు.

## తెలంగాణకు సిఆర్ఐఎఫ్ నిధులు విడుదల చేయండి

కేంద్ర మంత్రి గడ్కరీని కోరిన బండి సంజయ్



**ప్రజాపక్షం/కరీంనగర్:** దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కరీంనగర్ జగిత్యాల రోడ్డు విస్తరణ పనులను వెంటనే ప్రాంబించాలని కోరుతూ కేంద్ర హోం శాఖ సహయ మంత్రి బండి సంజయ్ సోమవారం డిల్లీలో కేంద్ర రోడ్డు,రవాణ శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కలిసి వినతి పత్రం అందజేశారు. కరీంనగర్ నుండి జగిత్యాల వరకు 4లైన్ విస్తరణ కోసం గత ఎన్నికల ముందే కేంద్ర ప్రభుత్వం రూ.2151 కోట్ల 35 లక్షల నిధులతో ప్రతిపాదనలు రూపొందించిన విషయాన్ని గుర్తు చేశారు. ఆయా ప్రతిపాదనలు ఆమెదం పొందడంతో పాటు టెండర్ ప్రక్రియను కూడా ప్రారంబిస్తామని అధికారులు నేటికి టెండర్ ప్రక్రియ ప్రారంభం కాని విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే సంబంధిత ఉన్నతాధికారులతో మాట్లాడి అందుకు గల కారణాలు తెలుసుకున్నారు. ప్రజల నుంచి వచ్చిన అభ్యంతరాలను, న్యాయపరమైన అడ్డంకుల నేపథ్యంలో రోడ్డు విస్తరణ పనులకు ఆటంకం ఏర్పడిందని తెలిపారు. ప్రస్తుతం ఆయా అడ్డంకులను అదిగమించి నివేదికను కమిటికి పంపించామని తెలిపారు. కమిటి నివేదిక ఇచ్చిన వెంటనే రోడ్డు పనులకు సంబంధించిన టెండర్ ప్రక్రియ ను పూర్తిచేసి రోడ్డు విస్తరణ పనులకు శ్రీకారం చుడుతామని తెలిపారు. అలాగే తెలంగాణ లో పలు రోడ్డు విస్తరణ సంబంధించిన పనుల ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉన్నాయని సెంట్రల్ రోడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (సీఆర్ఐఎఫ్)ను విడుదల చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో పెండింగ్ లో ఉన్న కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలంలోని బావుపేటఖాజీపూర్ రోడ్డులో భాగంగా మానేరు నదిపై హైలెవల్ వంతెన నిర్మాణంతో పాటు గన్నేరువరం మండలంలోని గుండ్లపల్లి పొత్తూరు రోడ్డు విస్తరణ, చందుర్తి నుండి మోత్కురావుపేట వరకు వంతెనల నిర్మాణ పనుల ప్రతిపాదనలు, కిష్టంపల్లి వరకు రోడ్డు పై వంతెన నిర్మాణ పనులు, శంకరపట్నం మండలంలోని అర్కాండ్ల నుండి కన్నాపూర్ వరకు వరద కాలువపై హైలెవల్ బ్రిడ్జ్ నిర్మాణ ప్రతిపాదనలకు మొత్తం రూ.113 కోట్లతో కూడిన సీఆర్ఐఎఫ్ నిధుల ప్రతిపాదనలను మంత్రి గడ్కరికి సమర్పించారు. సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి తొందరలోనే తెలంగాణ కు సీఆర్ఐఎఫ్ నిధుల విడుదలపై తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు బండి సంజయ్ తెలిపారు.

## 272 సర్వే నెంబర్‌లో రిజిస్ట్రేషన్‌లు రద్దు చేయాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ డిమాండ్



**ప్రజాపక్షం/కరీంనగర్ సిటీ:** కరీంనగర్ జిల్లా కొత్తపల్లి హవేలీ రెవెన్యూ పరిధిలోని 272 సర్వే నెంబర్‌లో ఉన్న 24.24 ఎకరాల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైందని, చట్ట విరుద్ధంగా చేసిన అన్ని రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బాధ్యులైన సబ్ రిజిస్ట్రార్లపై చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ప్రొహిబిటెడ్ ప్రాపర్టీ రి జిస్ట్రేషన్లపై సమగ్ర విచారణ జరపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొత్తపల్లిలోని మెడికల్ కాలేజీ ఎదురుగా అత్యంత విలువైన భూములను ప్రభుత్వం కాపాడాలని కోరారు. సదరు సర్వే నెంబర్‌ను పూర్తిగా ప్రొహిబిటెడ్ లిస్టులో చేర్చినప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా గత పాతికేళ్లుగా సబ్ రిజిస్ట్రార్లు రిజిస్ట్రేషన్ చేస్తున్నారన్నారు. ప్రభుత్వ అసైన్డ్ భూములను రిజిస్ట్రేషన్ చేసిన సబ్ రిజిస్ట్రార్లందరిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కరీంనగర్ జగిత్యాల జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న ఈ భూమి విలువ రూ.200 కోట్లకు పైగా ఉంటుంద ని, ఈ భూమిని ప్రభు త్వం వెంటనే స్వాధీనం చేసుకోవాలని డి మాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా ఇలా ప్రొహిబిటెడ్ ప్రాపర్టీ జాబితాలోని సర్వే నెం బర్లలోని భూముల రిజిస్ట్రేషన్లపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, ఈ సర్వే నంబర్‌లో కేవలం 9 డాక్యుమెంట్లను మాత్రమే రద్దు చేయ డం సరికాదన్నారు. ఆ సర్వే నంబర్‌లో రిజిస్ట్రేషన్ అయిన డాక్యుమెంట్లన్నింటినీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇందులో కొంతమంది పేరు, పలుకుబడి ఉన్నవాళ్లను అధికారులు కాపాడే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. సబ్ రిజిస్ట్రార్‌ను సస్పెండ్ చేసి చేతులు దులిపేసుకుంటే సరిపోదని, సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన అందరిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డీ.. సిఎం రేవంత్ రెడ్డిపై చౌకబారు విమర్శలు మానుకో

'సుడా' చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి




**ప్రజాపక్షం /కరీంనగర్:** రాష్ట్ర ప్రభు త్వం బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కోసం చిత్త శుద్ధితో ముందుకు వెళ్తుంటే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పార్లమెంట్‌లో బిల్లు పెట్టకుండా ప్రజలను తప్పుదోవ పట్టించడానికి కేంద్ర హోం శాఖ సహయ మంత్రి బండి సంజయ్ కుమార్ తొండి మాటలు మాట్లాడుతన్నాడని సుడా చైర్మన్ కోమటి రెడ్డి నరేందర్ రెడ్డి మండిపడ్డారు. డిసిసి కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిజెపి నాయకులకు ప్రజలను తప్పుదారి పట్టించడం వెన్నతో పెట్టిన విద్య అని, రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల ఒకవైపు బిసి సంఘాలు హర్షం వ్యక్తం చేస్తుంటే బండి సంజయ్ బిసి సంఘాలను తప్పుబడుతున్నాడని అన్నా రు. రెండు సార్లు ఎంపిగా బిసి సంఘాల మద్దతు లేనిదే గెలిచారా అని నరేందర్ రెడ్డి ప్రశ్నించారు. హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి రోజు వార్తల్లో ఉండటం కోసం సీఎం రేవంత్ రెడ్డిపై చౌకబారు విమర్శలు చేస్తున్నాడని, ఇప్పటికైనా కౌశిక్‌రెడ్డి పద్ధతి మార్చుకోక పోతే కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలు తగిన బుద్ధి చెబుతారని నరేందర్ రెడ్డి హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కొరివి అరుణ్ కుమార్, బానోత్ శ్రవణ్ కుమార్, సమద్, నవాబ్,దండి రవిందర్,శ్రీనివాస్ రెడ్డి,కీర్తి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వరద నీరు నిలువకుండా శాశ్వత చర్యలు

ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రత్యేక అధికారి సర్ఫరాజ్ అహ్మద్



**ప్రజాపక్షం/గంగాధర:** మండల వ్యవసాయ, విస్తరణ అధికారులు, సెక్టార్ సిబ్బంది నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఎరువుల క్రయ విక్రయాలను ఎప్పటికప్పుడు నమోదు చేసుకుని నివేదిక సమర్పించాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రత్యేక అధికారి హెచ్ఎండిఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ ఆదేశించారు. అదే విధంగా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఇంటింటి ఆరోగ్య సర్వే పూర్తి చేయాలని పేర్కొన్నారు. వర్షాలు కురిసినప్పుడు తరచుగా ముంపుకు గురవుతున్న కరీంనగర్‌లోని మంచిర్యాల చౌరస్తా, రాంనగర్, జగిత్యాల రోడ్డును సోమవారం పరిశీలించారు. గంగాధరలోని ఎరువుల దుకాణాన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి మాట్లాడారు. మున్సిపల్, రోడ్లు భవనాల శాఖ అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు సమన్వయంతో ముంపు ప్రాంతాలను గుర్తించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డ్రైనేజీల నిర్మాణం, వరద నీరు త్వరగా వెళ్లేందుకు గల మార్గాలను అన్వేషించాలన్నారు. అసంపూర్తిగా ఉన్న నాలాలు, కల్వర్టులను పూర్తి చేయాలని సూచించారు. అనంతరం గంగాధరలోని సాయినాథ్ ఎరువుల దుకాణంలో తనిఖీలు నిర్వహించారు. కొనుగోళ్ల రిజిస్టర్, ఎరువుల నిల్వలు పరిశీలించారు. రోజువారీ అమ్మకాలు, గత సంవత్సరం ఈ సమయానికి మండలంలో జరిగిన మొత్తం అమ్మకాలు తదితర వివరాలను గురించి వ్యవసాయ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎరువులు కొనుగోలు చేస్తున్న రైతు వివరాలు, కొనుగోలు పరిమాణం, ఫోన్ నెంబర్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. ఆన్‌లైన్‌లో ఎరువుల అమ్మకాలు, స్టాక్ వివరాలను వెంటనే పూర్తి చేయాలన్నారు. ఎఇఒలు దుకాణాల వారీగా నిఘా ఉంచి నిరంతరం విస్తృత తనిఖీలు చేపట్టాలన్నారు. ఓపి, ఐపి రిజిస్టర్లను తనిఖీ చేశారు. దోమల వల్ల కలిగే వ్యాధులు, నివారణ చర్యలపై గ్రామాల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనూ అన్ని సౌకర్యాలున్నందున ఐపిలు పెంచి ఇక్కడే చికిత్స అందించాలని సూచించారు. ఆరోగ్య సిబ్బంది నిరంతరం క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయన వెంట అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, రెవెన్యూ డివిజనల్ అధికారి మహేశ్వర్, జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి , డిఎంహెచ్‌వో వెంకటరమణ, తహసీల్దార్ అనుపమ, ఎంపిడిఓ రాము తదితరులున్నారు.

# క్రీడ

## హాంకాంగ్ అదరగొట్టేనా ?

### హెడ్‌కోచ్‌గా శ్రీలంక మాజీ ఓపెనర్..





ఈ ఏడాది ఆసియా కప్ టోర్నీకి తొలిసారి అర్హత సాధించిన హాంకాంగ్ కీలక నిర్ణయం తీసుకుంది. మెగా టోర్నీలో పెద్ద జట్లకు షాకివ్వాలనుకున్న ఆ జట్టు ఉపఖండానికి చెందిన మాజీ క్రికెటర్‌ను హెడ్‌కోచ్‌ను నియమించుకుంది. శ్రీలంక మాజీ ఓపెనర్ కౌశల్ సిల్వాను ప్రధాన కోచ్‌గా ఆ దేశ బోర్డు ఎంపిక చేసింది. పెద్ద ఈవెంట్ తోనే సిల్వా కోచింగ్ జర్నీ మొదలుకానుంది.

'భవిష్యత్తులో హాంకాంగ్ క్రికెట్ పురోగతికి అంకితభావం, ప్రతిభావం తులను రాటుదేల్చే నైపుణ్యం కలిగిన సిల్వా ఎంతో ఉపయోగపడతాడు. అతడి మార్గనిర్దేశనంలో మా జట్టు గొప్పగా ఆడుతుందనే నమ్మకం మాకుంది. అంతేకాదు మా దేశంలో క్రికెట్ వ్యాప్తి కూడా జరుగుతుం దని అనుకుంటున్నాం' అని సోమవారం హాకాంగ్ క్రికెట్ చైర్‌పర్సన్ బుర్జి ష్రాఫ్ ఒక ప్రకటనలో తెలిపాడు. కోచింగ్ బాధ్యతలపై సిల్వా స్పందిస్తూ.. క్రమశిక్షణతో పాటు గెలవాలనే కసిని హాంకాంగ్ క్రికెట ర్లకు అలవర్చడమే తన లక్ష్యమని చెప్పాడు. సెప్టెంబర్ 9 నుంచి ఆసియా కప్ ఆరంభం కానుండగా.. అదే రోజు అఫ్గనిస్తాన్‌తో హాంకాంగ్ తలపడనుంది

## దివ్య దేశ్‌ముఖ్‌కి

## ట్రోఫీతో పాటు రూ.43 లక్షల నగదు బహుమతి



భారత చెస్ సంచలనం దివ్య దేశ్ ముఖ్ రికార్డు సృష్టించింది. రెండు రోజులుగా ఉత్కంఠ రేపుతున్న ఫిడే మహిళల వరల్డ్ కప్‌లో ఛాంపియన్‌గా అవతరిం చింది. రెండుసార్లు వరల్డ్ విన్నర్ కోనేరు హంపిని ఓడించి విజేతగా నిలిచిందీ యవకెరటం. భారత 88వ గ్రాండ్ మాస్టర్‌గా హోదాను సొంతం చేసుకుంది దివ్య. అంతేకాదు వచ్చే ఏడాది టోర్నీకి అర్హత కూడా సాధించింది. జార్జియా వేది కగా జరిగిన ఫిడే మహిళల వరల్డ్ కప్ ఫైనల్లో హంపి, దివ్య హోరాహోరీగా తలపడ్డారు. తనకంటే సీనియర్ అయిన తెలుగు తేజానికి 19 ఏళ్ల దివ్య గట్టి పోటీనిచ్చింది. ఈ మెగా టోర్నీ ఫైనల్లో తొలి రెండు మ్యాచ్ లను డ్రాగా ముగించారిద్దరూ. దాంతో, ట్రై బ్రేకర్ అనివార్య మైంది. ఈ రౌండ్‌లో వ్యూహాత్మక ఆటతో హంపిని మట్టికరి పించి టైటిల్ ఎగరేసుకుపో యింది దివ్య. ట్రోఫీతో పాటు రూ.43 లక్షల నగదు బహుమతి గెలుచు కుంది మహారాష్ట్ర ప్లేయర్. రన్నరప్ హంపి రూ.26 లక్షలు అందుకుంది.

'భారత చెస్‌లో ఇది చరిత్రాత్మకమైన రోజు. మన దేశం నుంచి మరొక గ్రాండ్‌మాస్టర్ పుట్టుకొచ్చింది. ఫిడే మహిళల వరల్డ్ కప్‌లో విజయం దివ్య ఆత్మవిశ్వాసాన్ని రెండింతలు చేయ నుంది. ఈ అద్భుత క్షణాలను ఆమెకు జీవితాంతం గుర్తుంటాయి. ఈ విక్టరీ దివ్యను భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించేందుకు దోహదపడుతుంది' అని ఐదుసార్లు ఛాంపియన్ ఆనంద్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు.

## ఇంగ్లాండ్ స్క్వాడ్‌లో కొత్త పేస్ అస్త్రం

మాంచెస్టర్‌లోని ఓల్డ్ ట్రఫోర్డ్ మైదానంలో భారత మిడిలార్డర్ అసమాన పోరాటంతో సిరీస్ పట్టేసే అవకాశం చేజార్చుకుంది స్టోక్స్ బృందం. ఊహించని డ్రాతో షాక్‌కు గురైన ఇంగ్లాండ్ వ్యూహం మార్చాలనుకుంటోంది. అండర్సన్ టెండూల్కర్ ట్రోఫీలో ఆఖరిదైన ఐదో టెస్టు కోసం ఆతిథ్య జట్టు ఆరో పేసర్‌ను తీసుకుంది. బౌలింగ్ ఆల్‌రౌండర్‌గా ఉపయోగ పడే జేమీ ఓవర్టన్‌ను స్క్వాడ్‌లోకి చేర్చుకుంది. ఇప్పటికే ఇంగ్లాండ్ పేస్ దళంలోని అట్కిన్సన్, జోష టంగ్ బెంచ్ మీద ఉండగా.. ఓవల్ మ్యాచ్‌లో ఎవరిని పక్కన పెడతారనేది తెలి యాల్సి ఉంది. బ్యాటుతో కీలక రన్స్ చేసే కార్సేను తప్పించే సాహసం ఇంగ్లండ చేయక పోవచ్చు. మూడేళ్ల తర్వాత పునరాగమనం చేసిన ఆర్చర్, మోకాలి గాయం నుంచికోలు కుని అద్భుతంగా రాణిస్తున్న వోక్స్ తుది జట్టులో ఉండే అవకాశ ముంది. బౌలింగ్ పిచ్ అయితే.. నలుగురు పేసర్లతో ఆడితే ఓవ ర్టన్‌కు అవకాశం దక్కే వీలుంది. ఎందుకంటే




స్టోక్స్ ఐదో రోజు ఇబ్బంది పడుతూనే బౌలింగ్ చేశాడు. కాబట్టి ఓవల్‌లో ఓవర్టన్ తుది జట్టులో ఉండడం ఖాయమనిపిస్తోంది.

**ఇంగ్లాండ్ స్క్వాడ్ :** జాక్ క్రాలే, బెన్ డకెట్, ఓలీ పోప్, జో రూట్, బెన్ స్టోక్స్(కెప్టెన్), హ్యారీ బ్రూక్, జేమీ స్మిత్(వికెట్ కీపర్), జోష్ టంగ్ క్రిస్ వోక్స్, జోఫ్రా ఆర్చర్, గస్ అట్కిన్సన్, జాకబ్ బెథెల్, బ్రైడన్ కార్సే, లియామ్ డాసన్, జేమీ ఓవర్టన్.


**ఆ నలుగురు.. ఐదు సెషన్లు**

తొలి ఇన్నింగ్స్‌లో టీమిండియాను 358కే ఆలౌట్ చేసిన ఇంగ్లాండ్. అనంతరం 311 పరుగుల ఆధిక్యం సాధించింది. ఇక మ్యాచ్ మనదే అని ఉత్సాహంతో గిల్ సేనను ఆలౌట్ చేయాలనుకున్న ఇంగ్లాండ్ బౌలర్ల ఎత్తులు ఫలించలేదు. నలుగురంటే నలుగురే ఐదు సెషన్లు క్రీజులో నిలిచి స్టోక్స్ సేనకు ముచ్చెమ టలు పట్టించి చిరస్మరణీయ డ్రాతో జట్టును గట్టెక్కించారు.

నాలుగో రోజు ఆఖరి సెషన్ నుంచి.. ఐదో రోజు తొలి సెషన్‌లో కాసేపటి వరకూ శుభ్ మన్ గిల్(103), కేఎల్ రాహుల్(90)లు అద్భుత పోరాంటతో ఆశలు రేపారు. లంచ్ లోపే ఈ ఇద్దరూ ఔటైనా.. రవీంద్ర జడేజా(107 నాటౌట్), వాషింగ్టన్ సుందర్(101 నాటౌట్)లు పట్టువదలని విక్ర మార్కుల్లా పోరాడారు. కాస్త కూడా అవకాశమి వ్వకుండా ఇంగ్లాండ్ బౌలర్లను అలసిసొలసిపో యేలా చేశారు. ఐదో వికెట్‌కు అజేయంగా 203 రన్స్ జోడించి అసాధ్యమనుకున్న డ్రాను సుసాధ్యం చేసి చూపించారు.

# ఫోకస్ — యువతరంగం

**ఆలోచన వినూత్నమైనదే కావచ్చు... లక్ష్యాలు సాధించాలన్న పట్టుదల కూడా ఉండవచ్చు... కానీ, చేసే వ్యాపారానికి బలమైన పునాదులు లేకపోతే, దారుణ వైఫల్యం తప్పదు. ఎక్కువ మంది యువతీయువకులు స్వయం ఉపాధిలో ఎందుకు దెబ్బతింటున్నారనడానికి బెంగళూరు స్టార్టప్ 'బ్లిప్' ఓ ఉదాహరణ.**




## బలమైన పునాదులు లేకపోతే..

నిజానికి ఇది గొప్ప ఆలోచనతో మొదలైంది. కేవలం ఫ్యాషన్ స్టార్టప్ మాదిరికా కుండా, 'పది నిమిషాల్లో ఫ్యాషన్ డెలివరీ' అనే నినాదంతో ముందుకొచ్చింది. కానీ ఆ కల ఒక్క ఏడాది కూడా నిలబడలేదు. ఎన్నో ఆశలతో ప్రారంభించిన ఈ స్టార్టప్, ఏడాదికే చేతులెత్తేసింది. కలకు ఎంత వేగం ఉన్నా, పునాది మాత్రం బలంగా లేకపోవడమే అందుకు ప్రధాన కారణం. ట్రెండీ ఫ్యాషన్ ఉత్పత్తులను కేవలం 30 నిమిషాల్లో వినియోగదారుల ఇంటి వద్దకు డెలివరీ చేయడం అనే ఆలోచన మంచిదే. ఒక వేళ మీకు అకస్మాత్తుగా ఈవెంట్, డేట్, పార్టీ లేదా ఎమర్జెన్సీ దుస్తులు అవసరమైతే, వెంటనే ఆర్డర్ చేయవచ్చు. అరగంటలో ఆ దుస్తులు ఇంటికి వచ్చేస్తాయి. ఇదీ ప్రధానంగా 'బ్లిప్' కాంసెప్ట్. కేవలం దుస్తులే కాదు.. ఫ్యాషన్ సామాగ్రిని కూడా ఆర్డర్ చేసుకోవచ్చు. ఇందుకోసం 'బ్లిప్' సంస్థ స్థానిక ఫ్యాషన్ బ్రాండ్లతో భాగస్వామ్యం చేసి, ప్రత్యేకంగా ప్రణాళికతో రూపొందించిన మైక్రో వేర్‌హౌసింగ్ మోడల్‌ను ఉపయోగించింది. వీటి ద్వారా వేగవంతమైన డెలివరీలు సాధ్యమయ్యేలా చేసింది. వినియోగదారులకు డోర్‌స్టెప్ డెలివరీ తోపాటు 'స్టోర్ పికప్' అనే ఎంపిక కూడా అందించింది. ఈ విధంగా ఫ్యాషన్‌ను వేగంగా అందించాలన్న ఆలోచనతో ముందుకొచ్చిన 'బ్లిప్', యూజర్ అనుభవాన్ని కొత్త ఎత్తుకు తీసుకెళ్లే ప్రయత్నం చేసింది. తక్కువ వర్కింగ్ క్యాపిటల్‌తో వ్యాపారాన్ని నడిపించాలన్న లక్ష్యంతో ప్రారంభించినప్పటికీ, అది ఆచరణ సాధ్యం కాలేదు. పెద్ద మార్కెటింగ్ ప్రణాళికలు, బలమైన డెలివరీ వ్యవస్థలు, టెక్నాలజీ అభివృద్ధి చేసుకోవడం కష్టమైంది. ఈ లోపం వ్యాపారాన్ని నిలకడగా ముందుకు తీసుకెళ్లడంలో తీవ్రమైన ఆటంకంగా మారింది. పెద్దపెద్ద కంపెనీల రంగ ప్రవేశం 'బ్లిప్'ను దెబ్బతీసిన మరో అంశం. భారీ టెక్ సంస్థలు, ఇ–కామర్స్ కంపెనీలు అదే ఫ్యాషన్ క్విక్ డెలివరీ రంగంలోకి అడుగుపెట్టడంతో, చిన్న స్టార్టప్‌గా అడుగుపెట్టిన 'బ్లిప్', ఈ మార్కెట్‌లో నిలదొక్కుకోవడం చాలా కష్టంగా మారింది. చివరగా, గో టు మార్కెట్ (జిటిఎం) అమల్లోనూ పలు అడ్డంకులు ఎదురయ్యాయి. వ్యూహాలు ఉన్నప్పటికీ, వాటిని వేగంగా అమలు చేయడంలో ఆలస్యం జరిగింది. సరైన సమయంలో సరైన ఉత్పత్తులను మార్కెట్లోకి తేవడం కుదరలేదు. దీని వలన బ్లిప్‌ను నమ్మకమైన కంపెనీగా వినియోగదారులు నమ్మలేదు. దీనిని ప్రారంభించానికి అవసరమైన పెట్టుబడిలో 89.06 శాతం మొత్తం ఈ స్టార్టప్ వ్యవస్థాపకులదే. ఫలతంగా, చిన్న చిన్న విజయాల తర్వాత పెద్ద స్థాయిలో వ్యాపారం పెంచుకోవడంలో సమస్యలు వచ్చాయి. మార్కెట్లో ఉన్న బ్రాండ్స్‌కి పోటీ ఇవ్వాలంటే డబ్బు మాత్రమే కాదు.. బలమైన వ్యూహం కూడా అవసరం. కానీ దానికి ముందే వేగంగా ముందుకు వెళ్లాలన్న తపనలో కొన్ని తప్పులు జరిగినట్టు కనిపిస్తుంది. మొత్తం మీద నిశితమైన పరిశీలన, అధ్యయనం లేకపోవడం, రాబోయే అవసరాలకు పెట్టుబడులు ఏ విధంగా రాబట్టాలనే విషయాన్ని ఆలోచించుకోక పోవడం ఈ స్టార్టప్ వైఫల్యానికి ప్రధాన కారణాలు. అందుకే, స్థాయి ఎంతటిదైనా, అన్ని కోణాల్లోనూ ఆలోచించి, బలమైన పునాదులు నిర్మించుకున్న తర్వాత రంగంలోకి దిగడం అవసరం. లేకపోతే, ఎంత గొప్ప ఆలోచనైనా, అమలులో విఫలమవుతుంది. 'బ్లిప్' వ్యవస్థాపకుల ఆలోచనలోగానీ, ఆచరణలోగానీ లోపం లేదు. పైగా, ఎవరికీ రాని గొప్ప ఆలోచన. కానీ, భవిష్యత్ మార్పులను ఆలోచించకపోవడంతో, వాటికి తగిన రీతిలో నిర్ణయాలు తీసుకోలేకపోయారు. ఈసారి మరింత పట్టుదలతో, సరికొత్త వ్యూహంతో వాళ్లు ముందుకు రావాలని కోరుకుందాం.

## పర్యావరణ పరిరక్షకుడు మార్టినెజ్

ఒక పర్యావరణ కార్యకర్త సాధారణంగా గొప్ప వక్తగా ఎదగలేదు. ఒకవేళ ఎదిగినా, సంగీత ప్రపంచంలోనూ అడుగుపెట్టి రాణించలేడు. ఈ సాధారణ విధానాన్ని ధిక్కరించి, పరస్పరం సంబంధం లేని రంగాల్లో అసాధారణ ప్రతిభ కనబరచే శక్తి అతి కొద్ది మందికి మాత్రమే ఉంటుంది. అలాంటి అరుదైన వ్యక్తుల్లో అమెరికాకు చెందిన షోటెజ్‌కాటో మార్టినెజ్ అగ్రగణ్యుడు. కేవలం ఆరు సంవత్సరాల వయసులోనే పర్యావరణ ప్రాధాన్యతను గుర్తించడం మాత్రమేకాదు.. ప్రచారం కూడా ప్రారంభించాడు. 15 సంవత్సరాలు కూడా నిండకముందు, మూడు పర్యాయాలు ఐక్యరాజ్య సమితిలో పర్యావరణ పరిరక్షణపై ప్రసంగించే అవకాశం దక్కిందంటే, మార్టినెజ్ ఈ రంగంలో చేస్తున్న కృషి ఏ స్థాయిలో ఉందో ఊహించడం కష్టం కాదు. వాతావరణ మార్పులను విస్మరించడమంటే, జీవించడానికి, స్వేచ్ఛను, ఆస్తికి రాజ్యాంగ హక్కును తిరస్కరించడ నంటూ అతను అమెరికా ఫెడరల్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కోర్టులో వాదించాడు. ఒకవైపు 'స్పీక్ ఫర్ ది ట్రీస్' పేరుతో పర్యావరణ పరిరక్షణ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళుతూనే, మరోవైపు తనకు ఎంతో ఇష్టమైన సంగీత ప్రపంచంలోనూ రాణిస్తున్నాడు. నేటివ్ అమెరికన్స్ మాదిరి జుట్టు పెంచుకొని, జడలు వేసుకొని అమ్మాయిలా కనిపించే అబ్బాయి మార్టినెజ్. చాలా మంది అతనిని 'గే'గానూ, 'అమ్మాయి'గానూ పొరబడుతుంటారు. అయితే, అమెరికాలోని వాస్తవ గిరిజన జాతులకు ప్రాధాన్యం ఇవ్వాలన్న ఆలోచన, వారికి అండగా నిలవాలన్న పట్టుదల మార్టినెజ్‌ను రాజీ పడని వ్యక్తిగా తీర్చిదిద్దాయి. అతను పర్యావరణ కార్యకర్త. హిపాప్ సంగీతంలో రాణిస్తున్న గాయకుడు. సంగీత దర్శకుడు. సమస్యలపై స్పందించే రచయిత. అన్నిటినీ మించి, అమెరికాలో గిరిజన తెగలు.. నిర్లక్ష్యానికి గురైన వర్గాల తరఫున పోరాడుతున్న గొప్ప మానవతావాది. ఇపుడు అతని వయసు 25 సంవత్సరాలే. అయితేనేం ఇప్పటికే వందేళ్లకు సరిపడా పేరు సంపాదించాడు. తాను అడుగుపెట్టిన ప్రతి రంగంలోనూ రాణిస్తున్నాడు. న్యాయం చేస్తున్నాడు.

**యూత్ ఐకాన్స్**

ఎంతో మంది యువతీయువకులు దేశ కీర్తిప్రతిష్టలను ఇనుమడింప చేశారు. చిన్న వయసులోనే అత్యున్నత శిఖరాలను అధిరోహించారు. యువతకు మార్గదర్శకులుగా నిలిచారు. అలాంటి అద్వితీయ ప్రతిభావంతుల గురించి క్లుప్తంగా తెలుసుకుందాం..



## పనిగంటలు తగ్గించాలి

### ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్




**ప్రజాపక్షం/సంగారెడ్డి :** మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేస్తామని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు యూసుఫ్ పేర్కొన్నారు. లేబర్ కోర్టు రద్దు చేయాలని , పెంచిన పని గంటలను తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆదివారం సంగారెడ్డి పట్టణంలోని టిఎన్‌జిఒ భవన్‌లో ఎఐటియుసి సంగారెడ్డి జిల్లా నాలుగో మహాసభ జరిగింది. సభకు ముఖ్య అతిథిగా యూసుఫ్ హాజరై మాట్లాడుతూ కార్మికులు పనిచేస్తున్న పని ప్రదేశాలలో భద్రత కరువైందన్నారు. యాజమాన్యాలు కార్మికుల శ్రమదోపిడికి పాల్పడుతుందన్నారు. అసంఘటిత కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యాలు కల్పించాలన్నారు. అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం, గ్రామ పంచాయతీ, మున్సిపల్ సిబ్బందికి కనీస వేతనాలు అమలు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. సభలో ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నరసింహ, సిపిఐ జిల్లా కార్యదర్శి సయ్యద్ జలాలోద్దీన్, ఆనంద్, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు సాయిలు, ప్రధాన కార్యదర్శి ప్రసాద్, నాయకులు వెంకట్రాజ్యం , రెహమాన్, ఆనంద్ ,చిరంజీవి, లక్ష్మి , శివశంకర్, శంకరప్ప, లింగమయ్య, తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక పోరుకు సిద్ధం

### సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్



**ప్రజాపక్షం/కొణిజర్ల :** వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలకు పోటీచేసేందుకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ పిలుపునిచ్చారు. సోమవారం కొణిజర్లలోని దొండపాటి వెంకయ్య భవన్‌లో వెంపటి పరుశురాములు అధ్యక్షతన సిపిఐ మండల సమితి సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన దండి సురేష్ మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో పార్టీని గెలిపించడంకోసం పార్టీశ్రేణులు అహర్నిశలు కష్టపడాలన్నారు. కాంగ్రెస్‌తో మిత్రపక్షంగా ఉన్నా ప్రజాసమస్యలపై రాజీపడబోమని ఆయన తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో నిరుపేదలకు అన్యాయం జరుగుతుందని ఆరోపించారు. ఇందిరమ్మ కమిటీ సభ్యుల పనితీరుతో స్థానిక ఎమ్మెల్యేకు చెడ్డపేరు వస్తుందని తెలిపారు. సిపిఐ జిల్లా కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, మండల కార్యదర్శి గడల భాస్కర్‌రావు మాట్లాడుతు కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమైందని ఆరోపించారు. రైతుబంధు, రైతు రుణమాఫీ అరకొరగా అమలుచేసి రైతులను మోసం చేశారని విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగులు పదవీవిరమణ పొందిన తర్వాత వారికి ఇవ్వాల్సిన డబ్బులు కూడా ఇవ్వలేకపోతున్నారన్నారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు యర్రా బాబు, దొండపాటి రమేష్, మండల సహాయ కార్యదర్శులు తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, స్వర్ణ రమేష్, మణిగ కోటేశ్వరరావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు పొపగంటి సుదర్శన్, పిరావు, వేములకొండ రమేష్, గుణగంటి సరోజిని తదితరులు పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాల కోసం

# విద్యార్థుల ఎదురుచూపులు

### వెంటనే విడుదల చేయాలని

### ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి డిమాండ్



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఏడాది దాటినా ఇప్పటివరకు విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం విచారకరమన్నారు. ఈ నిర్లక్ష్యం విద్యార్థుల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వేలాది మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాల బకాయిల కోసం ఎదురుచూస్తున్నారు. ఈ ఆలస్యం వారి ఉన్నత విద్యకు ఆటకం కలిగిస్తోందని అవేదన వ్యక్తం చేశారు. ప్రైవేటు కళాశాలలు, విద్యాసంస్థలు ఫీజుల కోసం విద్యార్థులపై ఒత్తిని తెస్తున్నాయని, ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యార్థులకు ఊరట కల్పించాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయడంలో జాప్యం కారణంగా విద్యార్థులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని, ఇది వారి చదువుపై ప్రతికూల ప్రభావం చూపుతోందన్నారు. విద్యార్థుల భవిష్యత్తును పణంగా పెట్టి ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం క్షమించరాని నేరమని దుయ్యబట్టారు. ప్రభుత్వం తమ డిమాండ్లను వెంటనే పరిష్కరించకుంటే రాష్ట్రవ్యాప్తంగా మంత్రుల ఇళ్లను ముట్టడిస్తామని మణికంఠరెడ్డి హెచ్చరించారు. సమావేశంలో ఎఐఎస్ఎఫ్ స్టేట్ జాయింట్ సెక్రెటరీ రఘు రాం, కార్యవర్గ సభ్యులు రమేష్, నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రవికాంత్, ప్రధాన కార్యదర్శి కైలాష్, ఉపాధ్యక్షులు అస్లాం, శ్రీకర్ తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి విద్యార్థులకు రవాణా సౌకర్యం

### ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ డిమాండ్

### జిఎం కార్యాలయం ఎదుట ధర్నా

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** భూపాలపల్లి పట్టణ కేంద్రంలోని సింగరేణి పాఠశాలలో మౌలిక సదుపాయాలతో పాటు విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పించాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోతుకు ప్రవీణ్ కుమార్, జిల్లా కార్యదర్శి నేరెళ్ల జోసెఫ్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని జిఎం కార్యాలయం ఎదుట విద్యార్థులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం విద్యార్థులకు బస్సు సౌకర్యాన్ని కల్పించాలని లేనియెడల ఆందోళనల నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం ఎస్ఒటుజిఎంకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ నాయకులు దొంతరబోయిన అజయ్, మేడి శేఖర్, జంపాల పవన్, శ్రీకాంత్, నవీన్, అక్షిత, వైష్ణవి, అనూష, నికిత, సింగరేణి స్కూల్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




## సమగ్రాభివృద్ధికి ఉద్యమాలు

### పోరాటాల ఫలితంగానే జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు

### సిపిఐ యాదాద్రి జిల్లా కార్యదర్శి శ్రీరాములు



**ప్రజాపక్షం/యాదాద్రి :** జిల్లా సమగ్ర అభివృద్ధికి ప్రజల పక్షపాతిగా రాజీలేని ప్రజాఉద్యమాలతో భారత కమ్యూనిస్టు పార్టీకి జిల్లాలో పూర్వ వైభవం తీసుకురావడానికి కృషి చేస్తున్నామని సిపిఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు వెల్లడించారు. సోమవారం భువనగిరిలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ప్రాంత వాసులు, తెలంగాణ సాయుధ పోరాట యోధులు రావినారాయణరెడ్డి, ఆరుట్ల కమలాదేవి – రామచంద్రారెడ్డి దంపతులు, బొమ్మగాని ధర్మబిక్షం స్పూర్తితో గత పది సంవత్సరాలుగా జిల్లాలో ఉన్న పెండింగ్ సమస్యల పరిష్కారానికి నిర్వహించే ఉద్యమాల్లో పెద్ద ఎత్తున ప్రజలను మమేకం చేస్తూ జిల్లాలోని 17 మండలాల్లో శాఖలను ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం ఉద్యమాల నిర్వహించి ప్రజలను పోరాటాలలో మమే కం చేయడం వల్ల చాలా మంది భారత కమ్యూనిస్టు పార్టీకి ఆకర్షితులయ్యారని తెలిపారు. ఈ క్రమంలోనే ప్రజా సంఘాలను నిర్మాణం చేయడం వాటిని బలోపేతం చేయడం జిల్లాలోని 17 మండలాల్లో గ్రామ శాఖలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గత స్థానికసంస్థల ఎన్నికల్లో సిపిఐ నుంచి చాలా మంది ప్రజాప్రతినిధులుగా ఎన్నికయ్యారని వివరించారు. వర్ష ఆధారిత ప్రాంతమైన ఈ జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు తీసుకురావాలని దశాబ్దాల తరబడి ఉద్యమాలు చేసిన ఫలితం గా బస్వాపురం, గంధమల్ల సాగునీటి ప్రాజెక్టులు వచ్చాయన్నారు. తపాస్పల్లి రిజర్వాయర్ నుంచి యాదాద్రి జిల్లాకు రావలసిన నీళ్లను బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సిద్దిపేటకు తరలించిన జలదోపిడిపై ఉద్యమాలు నిర్వహించామని, పాలకుల మెడలు వంచి, బునాది గాని, పిల్లాయిపల్లి ధర్మారెడ్డి పల్లి మూసి కాలువల విస్తరణ సాధించామన్నారు. బస్వాపురం సాగునీటి ప్రాజెక్ట్ భూ నిర్వాసితులకు సరైన పరిహారం ఇవ్వకుండా రైతులను పట్టించుకోని గత పాలకులపై హైకోర్టును ఆశ్రయించి న్యాయపోరాటం చేసి వారికి పరిహారం ఇప్పించామన్నారు. జిల్లాకేంద్రంలో 3వేల మందికి ఇంటి నివేశ స్థలాలు ఇవ్వాలని రెవెన్యూ కార్యాలయాల ఎదుట పెద్ద ఎత్తున ధర్నాలు నిర్వహించిన ఫలితంగా కొంతమందికి ఇంటి స్థలాలు అందాయన్నారు. గంధమల్ల రిజర్వాయర్ పూర్తి కావాలని, రైతాంగానికి సాగునీరు అందించాలని సమరశీల ఉద్యమాలు నిర్వహించినందున ఇప్పటికీ కొన్ని ఫలితాలు వచ్చిన ఆ ప్రాజెక్టు పూర్తి అయ్యేవరకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో భక్తులు ఎదుర్కొంటు న్న సమస్యలు, వైటిడిఎలో జరిగిన అవినీతిని ఎప్పటికప్పుడు ఎండగట్టామని, వైడిడిఎ నిర్వాసితులకు నష్టపరిహారం ఇప్పించడంలో సఫలీకృతం అయ్యామన్నారు. ఈనెల 29న జిల్లా సిపిఐ 4వ మహాసభ వలిగొండలో నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామన్నారు. మహాసభకు ముఖ్య అతిథులుగా సిపిఐ శాసనసభ పక్ష నేత, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ నాయకులు పల్లా వెంకట్ రెడ్డి హాజరవుతున్నారన్నారు. ఈ మహాసభలో మూసి ప్రక్షాళన, స్థానిక యువతకు ఉపాధి, విద్య, వైద్యం, పాలకులు ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకై నిర్వహించాల్సిన పోరాటాలకు రూపకల్పన చేస్తామన్నారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు రాజయ్య, ఏశాల అశోక్, లక్ష్మ య్య పాల్గొన్నారు.

## సింగరేణి లాభాల్లో

# కార్మికులకు వాటా ఇవ్వాలి

### వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్

**ప్రజాపక్షం/శ్రీరాంపూర్ :** సింగరేణి లాభాల్లో 35 శాతం వాటాను కార్మికులకు ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వం సంస్థకు ఇవ్వాల్సిన రూ.40 వేల కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఆర్‌కె 5 గనిలో యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టిబిజికెఎస్ పాలనలో ఒక్క స్ట్రక్చర్ సమావేశం జరగలేదని, ఎఐటియుసి గుర్తింపు కార్మిక సంఘంగా గెలిచిన తర్వాత మూడు సమావేశాలు జరిగాయని తెలిపారు. వాటిలో యాజమాన్యం కొన్ని సమస్యలను అంగీకరించి సర్క్యులర్ ద్వారా అమలు చేస్తోందని చెప్పారు. కార్మికుల సొంతింటి కల నెరవేర్చేందుకు కమిటీ ఏర్పడిందని, రిపోర్టు వచ్చిన వెంటనే అర్హులకే ఇళ్లు లభిస్తాయని చెప్పారు. ఉద్యోగస్తుల పిల్లల వయోపరిమితిని 35 నుండి 40ఏళ్లకు పెంచిన విషయాన్ని గుర్తు చేశారు. విధుల నుండి తొలగించిన జెఎంఇటీలను తిరిగి తీసుకునేందుకు అగ్రిమెంట్ జరిగిందని, మరికొంతమందికి అవకాశం ఇవ్వాలని యాజమాన్యంపై ఒత్తిడి తీసుకువస్తున్నామని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న మారుపేరుల సమస్యపై చర్చల ద్వారా త్వరలో పరిష్కారం చూపుతామని, కోల్ ఇండియా తరహాలో ఇన్‌కమ్ టాక్స్‌ను సింగరేణే చెల్లించాలని కోరారు. మేము చేసిన పనులన్నింటినీ మాప్రభుత్వం చేసిందంటూ ఐఎన్‌టియుసి ప్రచారం చేయడం బాధాకరమన్నారు. నిజంగా కార్మికులపై చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.40 వేల కోట్ల బకాయిల చెల్లింపుపై ఒత్తిడి తేవాలన్నారు. సమావేశంలో ఎఐటియుసి కార్మిక సంఘం డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముష్కే సమ్మయ్య, ఏరియా బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీ సైదా, జిఎం కమిటీ ప్రతినిధులు సంపత్, బద్రి బుచ్చయ్య, ఏరియా కార్యదర్శి మూడ సుధాకర్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, ఫిట్ కార్యదర్శి నర్సింగరావు, సహాయ కార్యదర్శి లక్కిరెడ్డి సత్తిరెడ్డి, నాయకులు మల్లేష్, జిపి రావు, శ్రీకాంత్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.





# స్థానికం

REGIONAL NEWS

ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## ప్రభుత్వ స్థలాలు ఆక్రమణ... గుడిసెల ఏర్పాటు..!

### రెవిన్యూ, పోలీసులు రంగ ప్రవేశం ఉద్రిక్తత పరిస్థితులు

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ప్రభుత్వ స్థలాలలో గుడిసెలు ఏర్పాటు చేయటంతో అధికారులు తొలిగించే క్రమంలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. వివరాలు ఇలా ఉన్నాయి. నేలకొండపల్లి మండలంలోని కట్టుకొమ్మతండా గ్రామంలో ఉన్న ప్రభుత్వ స్థలంలో సోమవారం కొంత మంది గుడిసెలు ఏర్పాటు చేసుకుంటున్నారు. సమాచారం తెలుసుకున్న రెవిన్యూ అధికారులు ఘటనా స్థలంకు చేరుకుని అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఆరుపులు, కేకలతో ఆందోళనకారులు అడ్డుతగిలారు. గుడిసెలను తొలిగిస్తే ఆత్మహత్యలు చేసుకుంటామని బెదిరించారు. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. గతంలో బి.వెంకటేశ్వర్లు అను అతనికి పట్టాను అందించారని బాధితుడు తెలిపారు. కానీ ఆ స్థలంను అంగన్వాడీ. కేంద్రంతో పాటు పంచాయతీ భవనంకు కేటాయించాలని అధికారులు పేర్కొంటున్నారు. ఆందోళనకారులతో మండల రెవిన్యూ ఇన్స్పెక్టర్ అల్లం రవి చర్చలు నిర్వహించారు. తాత్కాలికంగా గుడిసెల ఏర్పాటును నిలిపివేయాలని సూచించటంతో ఆందోళనకారులు శాంతించారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్‌ను వెంటనే నియమించాలి

### ఎఐటియుసి మండల కార్యదర్శి తోగటి కుమార్

**ప్రజాపక్షం/పినపాక :** పినపాక మండల పరిధిలోని సోమవారం రోజున ఎఐటియుసి మండల కార్యదర్శి తోగటి కుమార్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేయడమైనది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జానంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్నటువంటి మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్‌ను సంవత్సర కాలం క్రితం ట్రాన్స్‌ఫర్ చేశారని, ఆయన స్థానంలో వేరేవారిని వెంటనే నియమించాలని, కానీ నియమించలేదని అందువలన రోగాలు బారిన పడిన వారు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వర్షాకాలం ప్రారంభమై ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో చుట్టుపక్కల ఉన్న పలు గ్రామాల ప్రజలు తీవ్ర విష జ్వరాల బారిన పడి తీవ్ర ఒళ్ళు నొప్పులతో బాధపడుతున్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి తగు చర్యలు చేపట్టి మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ నియమించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



## 'దండి'కి రియల్‌ఎస్టేట్-ప్రైవేట్ స్కూల్స్ నిర్వాహకుల అభినందన

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** సిపిఐ జిల్లా కార్యదర్శిగా నూతన బాధ్యతలు స్వీకరించిన దండి సురేష్‌ను ప్రముఖ రియల్టర్లు, ఖమ్మం రూరల్ మండల ప్రైవేట్ స్కూల్స్ నిర్వాహకులు సోమవారం కలిశారు. ఈ మేరకు ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని ఏదులాపురం డివిజన్‌లోని ఆయన నివాసంలో పుష్పగుచ్ఛాలను అందజేసి శాలువాలతో సత్కరించారు. అలాగే తెలంగాణ కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, డిసిసిబి కామేపల్లి బ్రాంచ్ మేనేజర్ మేళ్లచెర్వు రామస్వామి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో రియల్టర్లు జూలకంటి శ్రీనివాసరావు, శాబాద్ మాధవరెడ్డి, కదుదుల యోగేందర్‌రెడ్డి, నరేందర్ రెడ్డి, ప్రైవేట్ స్కూల్స్ నిర్వాహకులు కాంతరావు, శంకరయ్య, పవన్, ఆర్‌వీఎస్.యాదవ్, సంపత్, సదన్, నవీన్, మిడకంటి ఉమ, పోలంపల్లి దుర్గ, రమేష్, పిచ్చయ్య, విజయ్, సతీష్, సిపిఐ సీనియర్ నాయకుడు వెంపటి కృష్ణమూర్తి, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి, సిపిఐ జిల్లా సమితి సభ్యులు వెంపటి సురేందర్, మామిండ్ల శ్రీనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

## రేపే నవోదయ దరఖాస్తులకు ఆఖరి తేదీ



**ప్రజాపక్షం/బూర్గంపాడు :** 2026, 2027 సంవత్సరానికై 6వ తరగతి నవోదయకు దరఖాస్తు చేసుకోవడానికి రేపే ఆఖరి తేదీ అని బ్రిలియంట్ నవోదయ కోచింగ్ డైరెక్టర్ డాక్టర్ బిఎన్‌ఆర్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రేపే నవోదయ ఆఖరి తేదీ. కనుక ఇప్పటివరకు నవోదయకు దరఖాస్తు చేయని విద్యార్థినీ, విద్యార్థులు వెంటనే నెట్ సెంటర్‌లో నవోదయకు దరఖాస్తు చేసుకోవాలని, ఈ అవకాశాన్ని ఐదవ తరగతి చదువుతున్న ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.



## మావోయిస్టు వారోత్సవాల సందర్భంగా విస్తృతంగా వాహన తనిఖీలు

**ప్రజాపక్షం/కరకగూడెం :** మావోయిస్టు వారోత్సవాల సందర్భంగా కరకగూడెం మండలం చిరుమల్ల గ్రామంలో సోమవారం వాహనాలు తనిఖీలు నిర్వహించారు. ఈ వాహన తనిఖీలలో అనుమానస్పద వ్యక్తులను గుర్తించి వారి వద్ద ఉన్న లగేజీ బ్యాగ్‌లు, వాహనాలను, వారి యొక్క గుర్తింపు కార్డులను తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో ఏడుళ్ళ బయ్యారం సిఐ వి. వెంకటేశ్వరరావు, కరకగూడెం ఎస్ఐ పివిఎన్ రావు, స్పెషల్ పార్టీ టీజీఎస్పీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## 'స్థానిక' ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

### సిపిఐ(ఎం) నేత తమ్మినేని వీరభద్రం

**ప్రజాపక్షం/ముదిగొండ :** తెలంగాణ రాష్ట్రం లో రానున్న స్థానిక ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని సిపిఎం పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం అన్నారు. సోమవారం ముదిగొండ లో జరిగిన ఆ పార్టీ మధిర డివిజనల్ బాడీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని ఆయన చెప్పారు. గ్రామాల్లో ఉన్న స్థానిక సమస్యలపై నిరంతరం అవగాహనతో పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం మతాల పేరుతో ప్రజలను విభజించే కుట్రలు చేస్తుందని ఆయన ఆరోపించారు. ప్రజలు సమస్యలు గాలికి వదిలి పరిపాలిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా సిపిఎం పార్టీ ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. కాగా అంతకు ముందు ఆయన ఇళ్లు, స్థలాలు కోసం ఉద్యమం చేసి అమరులైన ముదిగొండ పోరాట యోధులకు ఆయన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ రాష్ట్ర నాయకులు పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, జిల్లా నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, బండి రమేష్, బండి పద్మ, మధిర డివిజన్ నాయకులు మడుపల్లి గోపాల్ రావు, మండల నాయకులు బట్టు పురుషోత్తం, టీఎస్ కళ్యాణ్, వేల్పుల భద్రయ్య ఇరుకు నాగేశ్వరరావు, మంకెన దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

# సాగు నీటి కష్టాలు రానివ్వం

### ఎమ్మెల్యే రాగమయి

**ప్రజాపక్షం/సత్తుపల్లి :** నియోజకవర్గంలోని రైతులకు సాగునీటి కష్టాలు రానివ్వమన్నారు సత్తుపల్లి శాసన సభ్యురాలు డా.మట్టా రాగమయి దయానంద్ విజయ్ కుమార్. సోమవారం బేతుపల్లి లిఫ్ట్ ద్వారా ఎన్టీఆర్ కెనాల్ నుండి వేంసూరు మండలంలోని చెరువులకు నీటిని విడుదల చేశారు ఎమ్మెల్యే. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక నాడు కరువు మండలంగా ఉన్న వేంసూరు మండలం నేడు పంటలతో కళకళలాడటానికి కారణం ఎన్టీఆర్ కెనాల్ అన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు దూరదృష్టితో ఆలోచించి రైతుల నేస్తంగా మారి నాడు ఎన్.టి.ఆర్ కెనాల్‌కు రూపకల్పన చేసి సాగునీరందించారన్నారు. సీతారామ ప్రాజెక్టు, ఎన్టీఆర్ కెనాల్ ద్వారా సత్తుపల్లి నియోజకవర్గంలోని పంటలకు సాగునీరు సమయానికి అందుతాయన్నారు. కెనాల్ వద్ద లిఫ్ట్ ఇరిగేషన్ మరమ్మత్తు పనులు త్వరగా పూర్తిచేయాలని, అందుకు సంబంధించిన ఎస్టిమేషన్ పనులను ప్రారంభించాలని ఇరిగేషన్ శాఖ అధికారులకు తెలిపారు. ముందుగా నీటి విడుదల సందర్భంగా పసుపు, కుంకుమలతో గంగమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మార్కెట్ కమిటీ ఛైర్మన్ దోమ ఆనంద్ బాబు, సత్తుపల్లి మండల పార్టీ అధ్యక్షులు శివ వేణు, సత్తుపల్లి మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ తోట సుజాల రాణి, సత్తుపల్లి పట్టణం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాదె చెన్నారావు, సీనియర్ నాయకులు చల్లగుళ్ళ నరసింహారావు, కమల్ పాషా, మానుకోట ప్రసాద్, కొప్పుల నరేందర్ రెడ్డి, సత్తుపల్లి మండలం కిసాన్ అధ్యక్షులు కంచర్ల రమేష్, మాజీ ఎంపీపీ చల్లారి వెంకటేశ్వరరావు, సత్తుపల్లి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తమ్మిశెట్టి గణేష్, సత్తుపల్లి మండలం, పట్టణం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





## మురుగు కాలువల నుండి నీరు సక్రమంగా వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలి

**ప్రజాపక్షం/కారేపల్లి :** కారేపల్లి ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న అనుసంధాన రోడ్ల వద్ద పైపులు వేసి మురుగు కాలువల నుండి నీరు సక్రమంగా వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ కారేపల్లికి వచ్చిన ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి స్థానికులు వినతి పత్రం అందించారు. అనుసంధాన రోడ్ల వద్ద పైపులు వేయకపోవడం వలన గత మూడు సంవత్సరాల నుండి మురుగు కాలువల ద్వారా నీరు ప్రవహించకపోవడంతో పారిశుద్ధ్యం లోపించి దోమల బెడద పెరిగిందని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యను మూడు రోజుల్లో పరిష్కరించి తనకు ఫోటోలు పంపించాలని కలెక్టర్ ఎంపీడీవోని ఆదేశించారు.

## గాయని పూజారి జ్యోతికకు 'తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్' అందజేత



**ప్రజాపక్షం/మణుగూరు :** భద్రాద్రి స్వరాంజలి, ఎఎన్ఎస్ 24 టివి మీడియా, జ్యోతి ఈవెంట్స్ మణుగూరు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్ కొరకు మణుగూరు కి చెందిన గాయని పూజారి జ్యోతి 12 గంటల పాటు నిర్విరామ చిత్ర గానలహరి పాటల కార్యక్రమంలో 111 పాటలు చిత్ర డ్యూయెట్ పాటలు పాడి తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్ సాధించుకున్నారు. భద్రాచలంలోని ఎస్ కన్వెన్షన్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ నిర్విరామంగా 111 పాటలను గాయకులతో కలిసి గాయని పూజారి జ్యోతి, సినీ గాయని చిత్ర పాటలను ఆలపించి రికార్డును కైవసం చేసుకున్నారు. 111 పాటల అనంతరం తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్ ను ఆయా సంస్థల వారు వేదిక పైన వెల్లడించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన ప్రముఖ ఐటీసీ కాంట్రాక్టర్ పాకాల దుర్గాప్రసాద్, కల్పవృక్ష నరసింహ స్వామి, ఆలయ అర్చకులు కృష్ణ చైతన్య, మణుగూరు బిఆర్ఎస్ పార్టీ నాయకులు కుర్రీ నాగేశ్వరరావు, భగవాన్ స్వీట్స్ అధినేత శంకర్ రావు, డాక్టర్ విజయరావు, డాక్టర్ పాల్ రాజ్ ఇంజనీరింగ్ కాలేజీ ఛైర్మన్ వరలక్ష్మి, సాయిరాం, డాక్టర్ కమలా రాజశేఖర్, ప్రీతం, జడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత, అజీమ్, రాజా శ్రీనివాస్, కురిచేటి జనార్ధన్ చేతుల మీదుగా గాయని పూజారి జ్యోతికి తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్‌ను అందజేశారు. తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్ జ్యూరీలు టీవీ అశోక్ కుమార్, వెంకటాచారి, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ సమస్య లేకుండా చూడండి

### ఆయా శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేసిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/సత్తుపల్లి :** పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందని, వాహనాల పార్కింగ్, ఆటోవాలాల అతి, రోడ్ల పైకి వచ్చిన తోపుడు బండ్లతో ప్రదాన రహదారి వెంట నడిచి వెళ్ళే పరిస్థితి లేదని, సమీప గ్రామాల నుండి ప్రజలు సత్తుపల్లి పట్టణానికి వివిధ పనుల నిమిత్తం వస్తుంటారని తక్షణమే ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు ఎమ్మెల్యే రాగమయి దయానంద్‌ను కోరారు.

సోమవారం పట్టణంలోని ఓ రెస్టారెంట్ ప్రారంభానికి విచ్చేసిన ఎమ్మెల్యే సత్తుపల్లి ట్రాఫిక్ సమస్యలను స్వయంగా పరిశీలించారు. బస్టాండ్ ఇన్ గేట్ నుండి రింగ్ సెంటర్, అక్కడి నుండి బస్టాండ్ అవుట్ గేట్ తదితరాలను పరిశీలించారు. తక్షణమే పట్టణ సిఐ, పట్టణ మున్సిపల్ కమీషనర్లతో మాట్లాడి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని, రోడ్లపైకి వచ్చిన వ్యాపారాలు, వాహనాల అడ్డగోలు పార్కింగ్‌లపై దృష్టి పెట్టి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

వాహన ప్రమాదాలు, ట్రాఫిక్ జామ్ కాకుండా తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎమ్మెల్యే స్వయంగా పట్టణంలోని ట్రాఫిక్ సమస్యపై స్పందించి అధికారులకు ఆదేశాలు జారీ చేయటంతో ప్రజలు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గాదె చెన్నకేశవరావు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ దోమ ఆనంద్, సీనియర్ నాయకులు చలగుళ్ళ నరసింహారావు, పింగుల సామ్యూల్, కమల్ పాషా తదితరులున్నారు.

## చేగొమ్మ గ్రామంలో కేంద్ర మానిటరింగ్ బృందం పర్యటన

**ప్రజాపక్షం/కూసుమంచి:** మండలంలోని చేగొమ్మ గ్రామంలో సోమవారం కేంద్ర మానిటరింగ్ బృందం వారు చేగొమ్మ గ్రామ పంచాయితీలో పలు రకాల అంశాలు పరిశీలించారు. చేగమ్మ గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో డ్వాక్రా మహిళలతో, గ్రామ సంఘం సభ్యులతో పథకాలు గురించి చర్చించి, గ్రామ సంఘాల రిజిస్టర్లు, ఉపాధి హామి రిజిస్టర్లు, గ్రామ పంచాయితీ రిజిస్టర్లు పరిశీలించారు. వృద్ధాప్య పెన్షన్లు, వితంతు పింఛన్లు, వికలాంగుల పెన్షన్ సభ్యులతో ఈ పథకం గురించి చర్చించారు. ఇంకా గ్రామ పంచాయితీలో అంగన్వాడీ టాయిలెట్స్, ఏవెన్యూ ప్లాంటేషన్, ఫీల్డ్ ఛానల్ పూడికతీత, క్యాటిల్ షెడ్, నర్సరీ, సిసి రోడ్ల పనులను పరిశీలించారు. ఈకార్యక్రమంలో నేషనల్ లెవెల్ మానిటరింగ్ టీం సభ్యులు డాక్టర్ డిడి గరుడ, యన్ అశ్విన్ గోపాల్, కల్లూరు సబ్ డివిజన్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ చలపతిరావు, ఖమ్మం సబ్ డివిజన్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీదేవి, డియల్‌పివో రాంబాబు, యంపిడిఓ యం రామచందర్‌రావు, పిఆర్ డిఇ, పిఆర్ ఏఈ, ఏపిఓ అప్పారావు, ఏపియం తిరుమలరావు, పంచాయితీ కార్యదర్శి, ఇసి, టిఎలు, సిసిలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ప్రధాన రహదారి మరమ్మతులు తక్షణమే చేపట్టాలి

### సామాజిక కార్యకర్త కర్నె రవి



**ప్రజాపక్షం/మణుగూరు :** మణుగూరుకు చెందిన న్యాయవాది, సామాజిక కార్యకర్త కర్నె రవి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ కార్యాలయం సోమవారం జరిగిన గ్రీవెన్స్ లో అడిషనల్ కలెక్టర్ ఎం.విద్యాచందన కి వినతిపత్రం అందజేశారు. ఈ విజ్ఞప్తిలో ఆయన మణుగూరు ఏటూరునాగారం ప్రధాన రహదారి దయనీయ స్థితిని వర్ణిస్తూ, ప్రజల ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయని హితవు పలికారు. ఈ రహదారి ద్వారానే వేలాదిమంది విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, గిరిజనులు రోజువారీ ప్రయాణిస్తున్నారు. ఇది తెలంగాణా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల మధ్య కీలక రవాణా మార్గంగా కూడా పనిచేస్తోంది. అయితే, గత కొంతకాలంగా దీని పరిస్థితి పూర్తిగా అధ్వాన్నంగా మారిందని, పాక్షికంగా పాకించడమే కాకుండా, పూర్తిస్థాయి పునర్నిర్మాణమే దీనికి పరిష్కారమని పేర్కొన్నారు.



## తప్పలు లేకుండా ఓటరు జాబితా తయారు చేయాలి

**ప్రజాపక్షం/పాల్వంచ :** పంచాయతీ కార్యదర్శులు తయారు చేస్తున్న ఓటరు జాబితాలో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తగా తయారు చేయాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి నాగలక్ష్మి అన్నారు. మండల పరిధి బసవతారక కాలని, కేశవాపురం పంచాయితీలలో తయారు చేసిన ఓటరు జాబితా, నర్సరీలను, కమ్యూనిటీ ప్లాంటేషన్, సోక్ పిట్ పనులను సోమవారం పరిశీలించారు. ఈ సంధర్భంగా ఆమె మాట్లాడుతూ .. అసెంబ్లీ ఓటర్ జాబితా నుండి బూత్‌ల వారీగా గ్రామ పంచాయితీ ఓటరు జాబితా తయారు చేసి సిద్ధంగా ఉండాలని సూచించారు. వారం రోజుల్లో మొక్కలు నాటాలన్నారు.చిన్న మొక్కలు టాల్ ప్లాంట్ కన్వెన్షన్‌కు ఉంచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ కే. విజయ భాస్కర్ రెడ్డి, ఏపిఓ పోరండ్ల రంగా, పంచాయితీ కార్యదర్శులు క్రిష్ణవేణి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## కాంప్లెక్స్ స్థాయి సమావేశాలు ప్రారంభం

**ప్రజాపక్షం/కరకగూడెం :** కరకగూడెం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల యూనిట్ గా రెండురోజుల పాటు నిర్వహించనున్న కాంప్లెక్స్ స్థాయి సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సమావేశాలను మండల విద్యాశాఖ అధికారి జి. మంజుల శుభారంభం చేశారు. మొదటి రోజు శిక్షణ సమావేశానికి మండలంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల నుండి 21 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. బోధనా నైపుణ్యాల మెరుగుదల, విద్యా ప్రదేశ్ వినియోగ విధానాలు, గ్రంథాలయ పుస్తకాల నిర్వహణ, పాఠశాల గ్రంథాలయంలో పఠన పద్ధతులు, తరగతి గదిలో విద్యార్థులతో పఠన కార్యక్రమాల ఆచరణ, ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ఇంచార్జ్ హెడ్‌మాస్టర్ సి.ఎచ్. వసంతరావు,మండల ఎంఆర్‌పిలు జె. వెంకటేశ్వర్లు, ఎం. తిరుమలరావు, పి. రఘు బాబు, మండలంలోని పలు ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు, సీఆర్‌పిలు పాల్గొన్నారు.

# అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

### అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రజావాణి అర్జీలను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డి సంబందిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా ప్రజలు సమర్పించిన అర్జీలను అదనపు కలెక్టర్ లు స్వీకరించారు. బోనకల్ మండల కేంద్రానికి చెందిన జె శైలు అనే మహిళ ఇందిరమ్మ ఇళ్లు తనకు మంజూరు చేయాలని కోరుతు ధరఖాస్తు చేసుకోగా బోనకల్ ఎంపిడిఓకు రాస్తు అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ముదిగొండ మండలం వల్లభి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బి భిక్షం తమ గ్రామంలో 10 వేల జనాభా నివసిస్తున్నారని గ్రామంలో ఉన్న గ్రంథాలయ అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. యువతకు పోటీ పరీక్షలకు కావాల్సిన మెటీరియల్ సమకూర్చాలని 15 లక్షల రూపాయలు మంజూరుచేసి శిధిలావస్థలో ఉన్న భవనాన్ని నిర్మించి సౌకర్యాలు కల్పించాలని . ముదిగొండ, వల్లభి నుంచి జగ్గయ్యపేటవరకు ఆర్టీసి బస్సులు నడపాలని ధరఖాస్తు చేసుకున్నారు. ఎర్రుపాలెం మండలానికి చెందిన జి అరుణ తనకు ఆరోగ్యం బాగోలేదని తను పూరిగుడిసెలో ఉంటున్నానని తనకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరుతు ధరఖాస్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ పద్మశ్రీ, జెడ్పీ సిఈఓ దీక్షారైనా, డిఆర్డీఓ సన్యాసయ్య, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ కె శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# మావోయిస్టు వారోత్సవాలు

### అడవులు జల్లెడ పడుతున్న బలగాలు

### సరిహద్దుల్లో హై అలెర్ట్

**ప్రజాపక్షం/భద్రాచలం :** అమరులను స్మరించుకుంటూ మావోయిస్టులు వారోత్సవాలు మొదలు పెట్టారు. జూలై 28 నుండి మొదలు ఆగస్టు 3వ తేది వరకు ప్రతీ ఏటా మావోయిస్టు పార్టీ విప్లవోద్యమలో అసువులుబాసిన నేతల నేత్తుటి సాక్షిగా దండకారణ్యంలో జరుపుతుంటారు. వారోత్సవాలను గ్రామ గ్రామాన జరపాలంటూ పేర్కొన్నారు. ఆపరేషన్ కగార్ పేరిట ప్రభుత్వం మావోయిస్టులను హతమారుస్తోందని, శాంతిచర్చలకు ఆహ్వానించకుండా మావోయిస్టులు లేకుండా చేయాలనే ఉద్దేశ్యంతోనే ఉందని చెప్పారు.

అడవుల జల్లెడ మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా భద్రతా బలగాలు అడవులను జల్లెడ పడుతున్నాయి. మావోయిస్టులకు పట్టున్న పలు ప్రాంతాలను ఇప్పటికే కనిపెట్టిన భద్రతా బలగాలు దండకారణ్యంలోని మరింత దట్టమైన అడవుల్లోకి సైతం చొచ్చుకుపోతున్నారు. ఇందులోభాగంగా అడవుల్లో నుండి రహదారులపైకి వచ్చే రోడ్లలో నిఘాపెంచారు. వచ్చిపోయే వాహనాల సోదాలు నిర్వహిస్తున్నారు. పోలీసుల చక్రబంధంలో తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ ఒడిస్సా ఆంధ్రప్రదేశ్‌మహారాష్ట్రాలు ఉన్నాయి. అనుమానితులను ప్రశ్నిస్తున్న పోలీసులు వారి వివరాలు నమోదు చేసుకుంటున్నారు. ప్రధానంగా దుమ్ముగూడెం, చర్ల, వెంకటాపురం, వాజేడు మండలాల్లో పెద్ద ఎత్తున సోదాలతో పాటు నిఘా కొనసాగుతోంది. మావోయిస్టు పార్టీకి సహకరించరాదని, కొత్త వ్యక్తులు తారసపడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అటవీ గ్రామాల ప్రజలకు చెబుతున్నారు. ఇటు మావోయిస్టులు, ఇటు పోలీసుల నడుమ ఆదివాసీలు నలిగిపోతున్నారు.

**అగ్రనేతలు హతం :** ఏడాది కాలంగా మావోయిస్టు పార్టీకి పెద్ద ఎత్తున నష్టం వాటిల్లింది. కీలక నేతలు సైతం నేలకొరిగారు. ఇప్పటి వరకు 357 మంది మావోయిస్టులను పోలీసులు హతమార్చారు. ఇందులో మావోయిస్టు కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాళ్ల కేశవరావు, అలియా బసవరాజు తో సహా నలుగురు కేంద్రకమిటీ సభ్యులు మృతి చెందారు. 16 మంది రాష్ట్ర కమిటీ, 23 మంది జిల్లా కమిటీ సభ్యులతో పాటు వివిధ క్యాడెర్లకు చెందిన వారు 83 మంది, ఇతరులు 40 మంది, గుర్తు పట్టని వారు కూడా సుమారు 30 మంది వరకు మృతుల్లో ఉన్నారు. ఈ సంక్లిష్ట పరిస్థితుల్లో సైతం మావోయిస్టు పార్టీ అమరుల స్మరణతో వారోత్సవాలు నిర్వహించడం సంచలనంగా మారింది. 2026 మార్చి 31 నాటికి దేశంలో మావోయిస్టులు లేకుండా చేస్తామని పంతం పట్టిన కేంద్ర ప్రభుత్వం ఆ దిశగా అడుగులేస్తూ సత్ఫలితాలనే సాధిస్తోంది. కాగా అటవీ గ్రామాల్లో ఉండే వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరించి సురక్షి ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాల ఎస్‌పిలో మావోయిస్టు వారోత్సవాలను పురస్కరించుకుని ఘట్టినిఘా పెట్టారు.





# స్థానికం

REGIONAL NEWS

వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## బయ్యారంలో ఉక్కు పరిశ్రమను స్థాపించాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి బి. విజయసారథి డిమాండ్

**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** బయ్యారంలో ఉక్కు పరిశ్రమ సాధనకై నాడు చేసిన పోరాటంలో భాగంగా నేడు మహబూబాబాద్ జిల్లా కోర్టుకు సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయసారథి సిపిఐ నాయకుడు మిరియాల మల్లికార్జున్ కోర్టుకు హాజరైనారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయసారథి మాట్లాడుతూ తెలంగాణ హక్కు అయినా బయ్యారంలో ఉక్కు పరిశ్రమ గురించి మాట్లాడని కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 8 మంది ఎంపీలు ఇద్దరు కేంద్ర మంత్రులుగా ఉండి బయ్యారంలో ఉక్కు పరిశ్రమ స్థాపించడంలో విఫలమయ్యారన్నారు. కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవచూపి రాష్ట్ర ప్రభుత్వ నిధులతో తక్షణమే బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ప్రారంభించేలా చొరవ చూపాలన్నారు. లేనిపక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో పోరాటాలు ఉధృతం చేస్తామని తెలిపారు. ఉద్యమకారులపై పెట్టిన అక్రమ కేసులు వెంటనే ఎత్తివేయాలని విజయసారథి ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

## విశ్వసనీయతతో కూడిన విశ్లేషణాత్మక వార్తలను రాయాలి





**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** విశ్వసనీయతతో కూడిన విశ్లేషణాత్మక వార్తలను రాయాలని వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి అన్నారు. రాష్ట్ర మీడియా అకాడమీ ఆధ్వర్యంలో వరంగల్ నగరంలోని కరీంబాద్ లో గల తాళ్ల పద్మావతి ఇంటర్నేషనల్ స్కూల్లో వరంగల్ జిల్లా ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు రెండు రోజులపాటు నిర్వహించిన వృత్తి నైపుణ్యత శిక్షణ ముగింపు కార్యక్రమానికి అదనపు కలెక్టర్, జిల్లా పరిషత్ సీఈవో రామిరెడ్డిలు ముఖ్యఅతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ నిజనిర్ధారణ జర్నలిజంలో ఒక ముఖ్యమైన భాగమనీ, జర్నలిస్టులు కచ్చితంగా నిజాలను నిర్ధారించుకున్న తర్వాతే నిర్భయంగా వార్తలు రాయాలన్నారు. జర్నలిస్టులు వార్తల గురించి సమగ్ర పరిశోధన చేసి మూలాలను తనిఖీ చేసి, సమాచారం యొక్క ఖచ్చితత్వాన్ని నిర్ధారించి తదుపరి వార్తలు రాయాలన్నారు. జర్నలిస్టులు వృత్తిపరమైన నియమాలను పాటించాలన్నారు. ఖచ్చితమైన నమ్మదగిన సమాచారం అందించడం ద్వారా జర్నలిస్టు సమాజానికి సేవ చేసిన వారు అవుతారు అన్నారు. నైతిక విలువలు పారదర్శకత కలిగిన వార్తలు రాసినప్పుడే జర్నలిస్టులపై ప్రజలకు గౌరవం పెరుగుతుందన్నారు. ప్రస్తుతం డిజిటల్ మీడియా రంగంలో వార్తల సేకరణ సులభమవుతుందన్నారు. భవిష్యత్తులో పత్రికల నిర్వహణలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రధాన పాత్ర పోషించనుందన్నారు. జెడ్పి సీఈఓ రామిరెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులు పక్షపాతం లేకుండా పారదర్శకంగా వ్యవహరిస్తూ వార్తలు సేకరించాలన్నారు. అనంతరం శిక్షణ తరగతులకుహాజరైన పాత్రికేయులకు ముఖ్య అతిధులు ధ్రువపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మీడియా అకాడమీ కార్యదర్శి వెంకటేశ్వరరావు, మేనేజర్ శైలేష్ రెడ్డి, డబ్ల్యూ జే ఐ జే యు అధ్యక్షులు శ్రీరామ్ రామచందర్, ప్రధాన కార్యదర్శి మట్ట దుర్గాప్రసాద్, డిపిఆర్ఓ అయూబ్ అలీ, తాళ్ల పద్మావతి విద్యాసంస్థల చైర్మన్ తాళ్ల మల్లేశం, పాల్గొన్నారు.

## కార్పొరేట్ కబంధహస్తాలలో చిక్కుకున్న చదువు



**ప్రజాపక్షం/హనుమకొండ :** కార్పొరేట్ కబంధ హస్తాల చదవు చిక్కుకున్నదని, చదువుకునే రోజుల నుండి చదువు కొనుక్కునే పరిస్థితులు ఏర్పడ్డాయని విప్లవ చిత్రాల దర్శక, నిర్మాత, నటుడు ఆర్. నారాయణ మూర్తి అన్నారు. వర్సిటీ పేపర్ లీకేజ్, ప్రభుత్వ విద్యా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ స్నేహ చిత్ర పిక్చర్స్ లో తెరకెక్కిన సినిమా యూనివర్సిటీ పేపర్ లీకేజ్ సినిమా వాల్ పోస్టర్ లను హనుమకొండ లోని ప్రెస్ క్లబ్ లో సోమవారం వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులతో కలిసి నారాయణ మూర్తి విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈరోజు ఎక్కడ చూసినా పేపర్ లీకేజ్ అనేది సర్వసాధారణంగా మారిందని, ప్రభుత్వ ఉద్యోగ పరీక్షల పేపర్ లీక్ అవ్వడం, ఎంబీబీఎస్, ఇంజనీరింగ్ విద్యార్థుల పరీక్ష పత్రాలు లీక్ అవ్వడం అంటే ఈ సమాజాన్ని నాశనం చేయడమే అని అన్నారు. కార్పొరేట్ కబంధహస్తాలలో ఈరోజు విద్య ఇరుక్కొని పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. సేవా రంగంగా ఉండాల్సిన విద్యారంగాన్ని పూర్తిగా వ్యాపార రంగంగా మార్చారని మండిపడ్డారు. తన సినిమాని ప్రజలు, కవులు, కళాకారులు, మేధావులు, నిరుద్యోగులు విద్యార్థులు అధిక సంఖ్యలో చూసి విజయవంతం చేయాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి భాషబోయిన సంతోష్, పిడిఎస్ యు జిల్లా ప్రధాన కార్యదర్శి రంజిత్ కుమార్, ఎస్ఎఫ్ఐ కాకతీయ యూనివర్సిటీ అధ్యక్షుడు సాయి మాట్లాడుతూ కలామ తల్లి ముద్దుబిడ్డ నారాయణ మూర్తి సామాజిక అసమానతలపై, విద్య, వైద్యం, క్లాసిఫికేషన్, క్యాస్టిఫికేషన్ అంశాలపై తన జీవితాన్ని సినిమా రంగానికి అంకితం చేసి పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం, సినిమా రూపంలో ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ వెండితెరపై దశాబ్దాలుగా మన జీవితాల్లో ఎదుర్కొంటున్న సమస్యలను కళ్లకు కట్టినట్టు చూపిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు వేల్పుల చరణ్, జిల్లా సహాయ కార్యదర్శి కసర బోయిన రవితేజ, జిల్లా సమితి సభ్యులు, సిపతి వినయ్, వంశీకృష్ణ, విజయ్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కళ్యాణ్, నాయకులు వినయ్, హర్షద్ తదితరులు పాల్గొన్నారు.

## ఏటూరునాగారంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రత్యేకాధికారి పర్యటన



**ప్రజాపక్షం/ఏటూరునాగారం:** ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రత్యేకాధికారి ఎఫ్ సిడిఏ కమిషన్ కె శశంక ములుగు జిల్లా పర్యటనలో భాగంగా మండలంలోని దొడ్ల, కొండాయి బ్రిడ్జి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి కె శశంకకు ఐటిడిఏ పిఓ చిత్ర మిశ్రా, అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జిలు వివరాలు తెలిపారు.అనంతరం ఐటిడిఏ, ఏటూరునాగారం సమావేశ మందిరంలో అధికారులతో భారీ వర్షాలు, వరదలపై సంసిద్ధత సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ పిఓ చిత్ర మిశ్రా, ఎస్పి శబరీష్, అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి, ఏఎస్పి శివం ఉపాధ్యాయ, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, ఆర్‌డిఓ వెంకటేష్, ఏపిఓ వసంతరావు, మున్సిపల్ కమిషనర్ సంపత్, జిల్లా అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్ పబ్లిక్ స్కూల్లో అనుమానాస్పద మృతి

**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** నగరంలోని వరంగల్ పబ్లిక్ స్కూల్ లో దారుణం చోటుచేసుకుంది. అదే పాఠశాలలో పనిచేస్తున్న అటెండర్ పోలేపాక శ్రీనివాస్ (50) సోమవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. గత 10 సంవత్సరాలనుండి ఇదే స్కూల్ లో అటెండర్ గా శ్రీనివాస్ విధులు నిర్వహిస్తున్నారు. కాగా అటెండర్ పోలేపాక శ్రీనివాస్ మృతదేహాన్ని విద్యార్థులు చూసి చేప్పే వరకు యాజమాన్యం దృష్టికి రాలేదు. మృతి విషయమై బయటికి తెలియకుండా జాగ్రత్త పడినట్లు యాజమాన్యంపై విమర్శలు వచ్చాయి. ఈ ఘటనపై పోలీస్ ల కనుసన్నల్లో నే బంధువులతో పాఠశాల యాజమాన్యం మంతనాలు జరిపినట్లు తెలిసింది.మృతుని నివాసం కాజీపేట మండలం బట్టుపల్లి (హవేలి )కొత్తపల్లి కాగా మృతునికి ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నట్లు తెలిసింది.

# ప్రజావాణి అర్జీల పరిష్కారానికి చర్యలు

కలెక్టర్ స్నేహ శబరీష్



**ప్రజాపక్షం/హనుమకొండ:** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలనుండి వచ్చిన అర్జీలను పెండింగ్ లో లేకుండా వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లా అధికారులు, పలువురు తహసీల్దార్లతో కలిసి ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై ప్రజలు తమ అర్జీలను జిల్లా కలెక్టర్ కు అందజేశారు. ప్రజలు అందజేసిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులకు వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తూ ప్రజలు 283 వినతులను అందజేశారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం జిల్లా కలెక్టర్ ఆయా శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ప్రజావాణి అర్జీల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలు, హాస్టల్స్ తనిఖీ, పర్యవేక్షణ, తీసుకోవాల్సిన చర్యల గురించి మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులు ఇటీవలి వరకూ హాస్టల్స్ తనిఖీ చేసినప్పుడు అక్కడ గుర్తించిన అంశాలు, సమస్యలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. ప్రజావాణిలో ప్రజల నుండి వచ్చిన వినతులను సంబంధిత శాఖల అధికారులు పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. అదే విధంగా జిల్లా అధికారులు పర్యవేక్షణకు తమకు కేటాయించిన హాస్టల్స్ కు తనిఖీ కి వెళ్ళినప్పుడు బేసిక్ చెక్ లిస్టు ప్రకారం వసతులు ఉన్నాయా లేదా అనేది జిల్లా అధికారులు తనిఖీ చేయాలన్నారు. ఇప్పటి వరకూ తనిఖీ చేయగా ఆయా హాస్టల్స్ లో ఏయే అంశాలను, సమస్యలను గుర్తించారని వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలువురు తహసీల్దార్లతో కలెక్టర్ మాట్లాడారు. హాస్టల్స్ లో పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని, తాజా కూరగాయలు వండే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రతి హాస్టల్ నుండి చెత్త తరలింపు జరగాలన్నారు. తప్పనిసరిగా డ్రై డే (శుక్రవారం)కార్యకలాపాలు అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో ఎక్కడైనా ఇబ్బందులు ఉన్నట్లయితే వాటిని సరిచేయాలని అన్నారు. గతేడాది ఇబ్బందులు ఏర్పడిన ప్రాంతాలను సందర్శించాలని సూచించారు. హాస్టల్స్ లో ఫుడ్, వాటర్ సప్లై బాగుందా లేదా అనేది తప్పనిసరిగా అధికారులు తనిఖీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మండలాల పరిధిలోని గ్రామాలలో వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు, తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతి ని పరిశీలించి ఇండ్ల నిర్మాణాలు త్వరగా చేసేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో వినతులను సమర్పించేందుకు ప్రజలు ఎక్కువ సంఖ్యలో వస్తుండడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అందుకు తగిన ఏర్పాట్లను చేశారు. ప్రజావాణి దరఖాస్తు సమర్పించిన వారికి రిసిప్ట్ ను ఆలస్యం లేకుండా అందించేందుకు అదనపు సిబ్బందిని నియమించారు. ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు సాఫీగా వినతులను సమర్పించే విధంగా సిబ్బందిని కేటాయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వై.వి.గణేష్, డిఆర్డిఓ మేన శ్రీను, హనుమకొండ ఆర్డిఓ రాథోడ్ రమేష్, జిల్లా అధికారులు, పలువురు తహసిల్దార్లు పాల్గొన్నారు.

## పేదలకు డబుల్ బెడ్రూమ్ ఇండ్లు ఎమ్మెల్యేకు సిపిఐ వినతి



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** హనుమకొండలోని బాలసముద్రంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్లను అర్హులైన పేదలకు కేటాయించాలని సీపీఐ జిల్లా నాయకులు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని కోరారు. ఈ మేరకు సోమవారం హనుమకొండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీపీఐ నాయకులు వినతి పత్రం అందజేశారు. అంబేద్కర్ కాలనీ, జితేందర్ సింగ్ కాలనీలో నివసిస్తున్న అర్హులైన పేద ప్రజలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలని ఎన్నో ఏళ్లుగా పేదలు ఎదురు చూస్తున్నారని తెలిపారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తప్పకుండా అర్హులైన పేద ప్రజలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, మాజీ జిల్లా కార్యదర్శి సిరబోయిన కరుణాకర్, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, నద్దునూరి అశోక్ స్టాలిన్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎదునూరి వెకట్రాజం, వేల్పుల సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

# కెటిఆర్... పద్ధతి మార్చుకో



ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

**ప్రజాపక్షం/జయశంకర్ భూపాపల్లి:** కెటిఆర్ సిఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వంపై దున్నపోతు ప్రభుత్వం అని సంబోధించడం స్థాయిని మించి మాట్లాడుతున్నాడని, కెటిఆర్ ఏమితెలియని బచ్చాగాడని, తెలిసి తెలియని రాజకీయ అజ్ఞాని అని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఫైర్ అయ్యారు. అదివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో బిఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటి రామారావు నిన్న భూపాలపల్లి పర్యటనలో ముఖ్య కార్యక్తల సమావేశంలో ప్రభుత్వం రేవంత్ రెడ్డిపై చేసిన వ్యాఖ్యలపై ఎమ్మెల్యే సత్తన్న సోమవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో 1200 మంది విద్యార్థులు అమరులైయ్యారని అమరుల త్యాగాల ఫలంగా ఆంధ్ర ప్రదేశ్ లో పార్టీ నష్ట పోతుందని తెలిసిన సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ఇంచ్చిందని అన్నారు. కొట్లాడి తెచుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని మీరు దోచుకొని విద్వంసం చేసి మిగులు రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని తీవ్ర స్థాయిలో మండి పడ్డారు. మీకు అసెంబ్లీ,ఎంపి ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పిన మీ అహంకారం తగ్గడంలేదన్నారు. 10 సంవత్సరాల మీ బిఆర్ఎస్ పాలనలో పేదవాడి బువ్వకోసం ఇచ్చే ఒక్క రేషన్ కార్డు ఇవ్వని దద్దమ్మలు మీరు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు మీకు లేదని ఇంకా పదవిలో ఉన్నమనే భ్రమలోమాట్లాడుతున్నారు. కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టించి బయభ్రాంత్‌లకు గురిచేస్తున్నారని అంటున్న నీవు గతంలో కాంగ్రెస్‌పార్టీ మండల పార్టీ అధ్యక్షున్నిపై దాడిచేశావు భూపాలపల్లి శ్రీనివాస్ పై ఎస్సి, ఎస్టీ అట్రాసిటి కేసి పెట్టించి బెదించిన చరిత్రనీదని,పర్సెంటేజిలగురించి, నామీద భూ అక్రమదారుడని ముద్ర వేసిన మీరు 18 నెలల్లో నానే చేసిన భూదందాను నిరూపించలేదని మాట్లాడావు నీవు అక్రమంగా ఆక్రమమించిన మైలారం గుట్టల్లో నీ ఆయిల్ ప్యాక్టరీ కోసం 157 ఎకరాల భూమిని గుంజుకొని రిటెన్ తెప్పించి అక్కడ ఇండస్ట్రీయల్ పార్క్, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్, కేంద్రయ విద్యాలయం కోసం కేటాయించడం జరిగిందని ఇంకా నీ వద్ద ఉన్న భూముల ను లాగి ప్రభుత్వ ఆఫీసులకు ఇస్తానని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు పిప్పాల రాజేందర్,చల్లూరి మధు,అప్పం కిషన్, దాట్ల శ్రీనివాస్,సాంబమూర్తి రంజిత తదితరులు పాల్గోన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

**ప్రజాపక్షం/జనగామ:** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గం రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలవాలని, అదేవిధంగా అధికారులు కృషి చేయాలని మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల ప్రగతిని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆధ్వర్యంలో సంబంధిత అధికారులతో ఎమ్మెల్యే కడియం శ్రీహరి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ ఆగస్టు 3వ తేదీ వరకు ఇందిరమ్మ ఇళ్లపై మండలాలు, గ్రామాల వారీగా క్షేత్రస్థాయి నివేధిక అందించాలని అధికారులను ఆదేశించారు. అధికారులు అంకితభావంతో పనిచేయాలని, ప్రతి లబ్దిదారుడు ఇంటిని నిర్మించుకునే విధంగా ప్రోత్సహించాలన్నారు. ఇండ్ల నిర్మాణంలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని, అదేవిధంగా ఇతరత్ర సమస్యలు రాకుండా క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్‌లు పింకేష్ కుమార్, రోహిత్‌సింగ్, ఆర్డీవో వెంకన్న, హౌసింగ్ పీడీలు, మాత్రు నాయక్, సిద్దార్థ, మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ, ఎంపీడీవోలు, హౌసింగ్ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనుల్లో ఎలాంటి రాజీపడేది లేదు

ఎమ్మెల్యే కెఆర్. నాగరాజు



**ప్రజాపక్షం/హసన్‌పర్తి:** రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పనుల్లో ఎలాంటి రాజీ పడేది లేదని, దశల వారీగా అభివృద్ధి పనులు పూర్తి చేయిస్తామని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. వర్ధన్నపేట నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లే లక్ష్యంతో భాగంగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పోరేటర్ 56వ డివిజన్ పరిధిలోని పరిమిళ కాలనీ, సురేంద్రపురి ప్రాంతాల్లో రూ. 1.10 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైయిన్ నిర్మాణ పనులలకు శంకుస్థాపనతోపాటు గ్రేటర్ వరంగల్ 1వ డివిజన్ పెగడపల్లిలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజల నిత్య జీవితానికి అవసరమైన మౌళిక వసతుల కల్పనే మా ప్రధాన ధ్యేయమన్నారు. ఏం ఇబ్బందులు పడుతున్నా ప్రజల కోసం పక్కా సీసీ రోడ్లు, డ్రైన్లు, నిర్మిస్తున్నాం, అభివృద్ధి పనుల విషయంలో ఎలాంటి రాజీలేదన్నారు. ఇది మా ప్రామాణికతకు నిదర్శనమన్నారు. ప్రతీ డివిజన్‌లో ప్రజలకు అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు. పీహెచ్సీలు ప్రజారోగ్య సంరక్షణను అందించడం, వ్యాధులను నివారించడం చికిత్స చేయడం, ఆరోగ్య విద్యను సేవలందించడం, సాధారణ వైద్య పరీక్షలు, వ్యాధి నిర్ధారణ, ప్రాథమిక చికిత్స, వ్యాక్సిన్లు, గర్భిణీ స్త్రీలకు సంరక్షణ, పిల్లల సంరక్షణ, ఇతర ఆరోగ్య సంబంధిత సేవలను అందిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో 56వ డివిజన్ కార్పోరేటర్ సిరంగి సునీల్, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొంక హరిబాబు, డీఈ రవికిరణ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజు, కాంట్రాక్టర్ బొక్క కుమార్, నాయకులు మణింద్రనాథ్, రమేశ్‌గౌడ్, విజయనాయక్, పాల్గొన్నారు.

# ఆగస్టు 5లోపు డబుల్ బెడ్రూమ్ ఇండ్ల పంపిణీ





**ప్రజాపక్షం/హనుమకొండ :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధికి మరిన్ని నిధులను ప్రభుత్వం కేటాయించిందని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడారు. నియోజకవర్గంలో ప్రధాన రోడ్ల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందని, హనుమకొండ జిల్లాలో 467 కోట్లతో రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు కావడం జరిగిందని చెప్పారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన అభివృద్ధి వరంగల్ నగరంలో జరగబోతుందని,గతంలో అభివృద్ధి పలుకులు పలికిన నేతలు నేడు కనుమరుగయ్యారని తెలిపారు. నగర అభివృద్ధి కోసం ఏక కాలంలో 205 కోట్ల నిధులను విడుదల చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని అన్నారు. మాజీ మంత్రి కేటీఆర్ జిల్లా పర్యటనకు వచ్చి అబద్దాలు చెప్పారని, బీఆర్ఎస్‌ను బిజెపిలో విలీనం చేస్తాం అని చెప్పిన మాటపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ఏపీ ఎంపి సిఎం రమేష్ ను కలిసిన సమావేశంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఆంధ్ర పాలకుల కంటే ఎక్కువ తెలంగాణ ప్రజానీకాన్ని దోచుకున్నది బీఆర్ఎస్ నాయకులేనని, నిష్పక్షపాత పాలన అందిస్తున్నది తమ ప్రభుత్వం అని అన్నారు. మీ హయాంలో అర్ధరాత్రులు జిఓ తీస్తూ ప్రజలను దోచుకున్నారని, కేటీఆర్, హరీష్ రావు గత ఆస్తులు ప్రస్తుత ఆస్తుల విలువ ఎంత అని ప్రశ్నించారు. వారు మాట్లాడే భాష పద్ధతి మార్చుకోవాలని, లేదంటే తమ కార్యకర్తల సహనాన్ని పరీక్షించవద్దని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఈవి శ్రీనివాస్ రావు, టీపీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాస్ రావు, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు పోతుల శ్రీమాన్, జక్కుల రవీందర్ యాదవ్, వేముల శ్రీనివాస్, అనుబంధ సంఘాల చైర్మన్ లు బంక సరళ, విక్రమ్, అజీజ్ పాల్గొన్నారు.

## పెద్దంపల్లి రోడ్డుకు మోక్షం కల్పించండి



**ప్రజాపక్షం/టేకుమట్ల:** భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారయణ రావు గారూ... మా పెద్దంపల్లి రహదారిని నిర్మించి మా కష్టలు తొలిగించండి అంటూ పెద్దంపల్లి గ్రామ ప్రజలు వేడుకుంటున్నారు. ఎన్నో ఎళ్లుగా వెలిశాల, కిష్టయ్యపల్లి గ్రామ ప్రజల నరకయాతన అనుభవిస్తూ నడుస్తూ ఇబ్బందులకు గరైనా పట్టించుకోనే నాధుడే లేకుండా పోయాడు అని అంటున్నారు. గత 6 సంవత్సరాల క్రితం గత పాలకులు రోడ్డు నిర్మిస్థామని చేప్పి శంకుస్థాపన చేసి మరిచి పోయారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 19 నెలలు గడుస్తూన్నా ప్రస్తుత ఎమ్మెల్యేకు పలు మార్లు రోడ్డు గూర్చి విన్నవిచ్చుకున్నా పట్టించుకోవాడం లేదని గ్రామస్థులు ముచ్చటించుకుంటున్నారు. పెద్దంపల్లి నుంచి వెలిశాల ప్రభుత్వపాఠశాలకు విధ్యార్థులు వెళ్లాలి అంటే అవస్థలు పడుతూ ప్రయాణం చేస్తున్నామని అంటున్నారు. సారూ మాకు రోడ్డు వేసి మా ఇబ్బందులను తొలిగించాలని గ్రామస్తులు, రైతలు, విధ్యార్థులం కోరుతున్నామని అన్నారు.

# ప్రతిష్ఠాత్మక పథకాల అమలు పక్కాగా జరగాలి

కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్



**ప్రజాపక్షం/జనగామ :** ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్టాత్మక పథకాలను పక్కాగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాలు అమలు చేయాలని, ప్రతి శుక్రవారం స్కూల్ డే నిర్వయించాలని, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, క్షేత్ర స్థాయిలో అధికారుల పర్యటన ఉండాలన్నారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని అదనపు కలెక్టర్లు పింకేష్‌కుమార్, రోహిత్‌సింగ్‌తో కలిసి ప్రజల నుండి విజ్ఞప్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రజావాణి లాగనే జిల్లా స్థాయిలో జరిగే ప్రజావాణిలోని ధరఖాస్తులు పెండింగ్‌లో ఉండరాదని, ఎప్పటికప్పుడు ధరఖాస్తులను విచారించి ఇందుకు సంబందించిన సమాచారాన్ని ధరఖాస్తుదారుడికి తెలిపని త్వరగా పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. సీజన్ వ్యాధులపై మండల స్పెషల్ ఆఫీసర్లు వివిధ శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటి కలెక్టర్, ఆర్‌డిఓ గోపిరాం, వెంకన్న, కలెక్టరేల్ ఏఓ పాల్గొన్నారు.

**కలెక్టర్ విస్తృత తనిఖీలు**

జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ సోమవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. జనగామ మండలంలోని ఓబుల్ కేశవాపూర్ పిహెచ్‌సి సందర్శించి ఎఎన్‌సి రిజిస్టేషన్, ఎన్‌సిడి పోర్టల్ అప్డేట్, చిన్న పిల్లల సీజన్ వ్యాధులకు సంబందించిన మెడిసిన్ నిల్వ వంటి వాటిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అభింకాసోని, ఎంపిడిఓ, మెడికల్ ఆఫీసర్ పాల్గొన్నారు.

## 'స్థానిక' ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకోవాలి

టిపిసిసి వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీరెడ్డి

**ప్రజాపక్షం/దేవరుప్పుల:** స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టి అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిదని టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని చిన్నమదూరు గ్రామంలో నిర్వహించిన ఎంపీటీసీ క్లస్టర్ సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొనగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాల్లు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఝాన్సిరెడ్డి మాట్లాడుతూ రాబోయే ఎన్నికలలో కాంగ్రెస్ జెండా ఎగరాలని, గతంలో మోసపోయిన ప్రజలు ఈ సారి తెలివిగా నిర్ణయం తీసుకొని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తేనే పేదలకు భద్రత, రైతులకు న్యాయం, యువతకు ఉపాధి వంటి అంశాలు సాధ్యమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అద్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల యూత్ అద్యక్షుడు వెంకన్న, నాయకులు భాస్కర్, రాజేష్ నాయక్, నాగరాజు, సజ్జన్, గణేష్, రసూల్, ఉమేష్, రమేష్, రవి, యాకయ్య, రాంచందర్, లీనారెడ్డి,నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రీల్

## కామాఖ్య షూటింగ్ షురూ



సముద్రఖని, అభిరామి ప్రధాన పాత్రల్లో అభినయ కృష్ణ దర్శకత్వంలో రూపొందుతున్న థ్రిల్లింగ్ సినిమా 'కామాఖ్య'. మై ఫిల్మ్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వద్దేపల్లి శ్రీ వాణినాథ్, యశ్వంత్ రాజ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.ఈ సినిమా షూటింగ్ ప్రారంభోత్సవం హైదరాబాద్ లో జరిగింది. సినిమా ప్రారంభోత్సవానికి మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముహూర్తపు సన్నివేశానికి మధు యాష్కీ గౌడ్ క్లాప్ కొట్టారు. డైరెక్టర్ అభినయ కృష్ణ ఈ సినిమా కోసం మిస్టీరియస్ థ్రిల్లర్ ఎలిమెంట్స్ ఉన్న కథని సిద్ధం చేశారు.ఈ చిత్రంలో ఆనంద్, శర్వా ప్రదీప్,చైత్రన్, ధనరాజ్, రాఘవ, ఐశ్వర్య కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి గ్యాని సంగీతం అందిస్తున్నారు. రమేష్ కుమార్ రెడ్డి డీవోపీగా వర్క్ చేస్తున్నారు. భూపతి యాదగిరి ఆర్ట్ డైరెక్టర్. ఈచిత్రానికి సంబధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడిస్తామని నిర్మాతల్లో ఒకరైన యశ్వంత్ రాజ్ తెలిపారు.

## మోతెవరి లవ్ స్టోరీ ట్రైలర్

తెలంగాణ గ్రామీణ నేపథ్యంతో 'మోతెవరి లవ్ స్టోరీ' అనే సిరీస్ ఆగస్ట్ 8న రాబోతోంది. అనిల్ గీలా, వర్షిణి రెడ్డి జున్నుతుల ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సిరీస్‌ను శివ కృష్ణ బుర్రా రూపొందించారు. ఏడు ఎపిసోడ్స్‌గా రాబోతోన్న ఈ విలేజ్ కామెడీ, లవ్ సిరీస్ అందరిని ఆకట్టుకునేలా ఉండబోతోంది.




తాజాగా ఈ సిరీస్‌కు సంబంధించిన ట్రైలర్‌ను ముఖ్య అతిథిగా విచ్చేసిన దర్శకుడు తరుణ్ భాస్కర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా తరుణ్ భాస్కర్ మాట్లాడుతూ ''మోతెవరి లవ్ స్టోరీ' ట్రైలర్ చాలా బాగుంది. మై విలేజ్ షో టీం అందరికీ స్పూర్తి. ఇక్కడి వాళ్ల గురించి అమెరికాలో మాట్లాడుకుంటున్నారు. 'పెళ్లి చూపులు' చేసే టైంలోనూ ఏదో చరిత్ర సృష్టించాలని అనుకోలేదు. సింక్ సౌండ్‌తో ఈ మూవీని చేశాం. ఆ టైంలో మధుర శ్రీధర్ మాకు అండగా నిలిచారు. భాష, యాస అందరినీ కలిపేసుకుని పోయేలా ఉండాలి. సినిమాలకు ఎప్పుడూ హద్దులుండకూడదు అని అన్నారు. మధుర శ్రీధర్ మాట్లాడుతూ .. 'తెలంగాణలో ఇలాంటి కొత్త కథలు రావడానికి తరుణ్ భాస్కర్ స్ఫూర్తి. మా కార్యక్రమానికి వచ్చిన ఆయనకు థాంక్స్. తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో అద్భుతమైన ప్రేమ కథగా 'మోతెవరి లవ్ స్టోరీ' రాబోతోంది. ఈ సిరీస్ తరువాత మరెన్నో గొప్ప ప్రేమ కథలు వస్తాయి. ఇది చాలా కొత్తగా ఉంటుంది. అందరినీ అలరిస్తుంది. అందరికీ ముందుగానే కంగ్రాట్స్ చెబుతున్నా' అని అన్నారు.

## కబడ్డీ ఆటగాడి జీవిత కథ
# అర్జున్ చక్రవర్తి





విజయ రామరాజు టైటిల్ రోల్ పోషించిన స్పోర్ట్స్ డ్రామా 'అర్జున్ చక్రవర్తి'. విక్రాంత్ రుద్ర దర్శకత్వం వహించిన ఈ సినిమాని నిర్మాత శ్రీని గుబ్బల నిర్మించారు. ఇప్పటికే ఈ సినిమాకు 46 ఇంటర్నేషనల్ ఫిల్మ్ అవార్డ్స్ వచ్చాయి. డైరెక్టర్ హను రాఘవపూడి సినిమా టీజర్‌ని లాంచ్ చేశారు. ఓ కబడ్డీ ఆటగాడి నిజజీవితాన్ని ఆధారంగా తీసుకొని రూపొందిన ఈ మూవీ టీజర్ ప్రేక్షకులని కట్టిపడేసింది. సినిమాని బిగ్ స్క్రీన్‌పై చూడాలనే క్యురియాసిటీని టీజర్ మరింతగా పెంచింది. టీజర్ లాంచ్ ఈవెంట్‌లో డైరెక్టర్ విక్రాంత్ రుద్ర మాట్లాడుతూ ఒక తల్లి బిడ్డకు జన్మనివ్వడానికి 9నెలలు మోస్తుంది. నేను కూడా ఈ సినిమాని మీకు చూపించడానికి తొమ్మిదేళ్లుగా మోశాను. నేను 12 ఏళ్ల పిల్లాడిగా ఉన్నప్పుడు ఒక పర్సన్ ని కలిసాను. ఆ పర్సన్ పేరు అర్జున్ చక్రవర్తి. ఆయన దగ్గర నేను కబడ్డీ ట్రైనింగ్ కోసం వెళ్ళినపుడు ఆయన ఒక కథ చెప్పారు. అది నా మనసులో అలాగా నాటుపోయింది. ఆ కథని ఎలాగైనా ప్రపంచానికి చెప్పాలని భావించాను. అలా ఈ కథ నేను డైరెక్టర్ కావడానికి డ్రైవ్ చేసింది. నిర్మాత శ్రీనికి కథ చెప్పిన తర్వాత ఆయన నచ్చింది. వెంటనే ఓకే చెప్పారు. నాకు చాలా ఫ్రీడమ్ ఇచ్చారు. నేను అనుకున్న బడ్జెట్ కంటే ఎక్కువైంది. అయినప్పటికీ ఆయన ఎక్కడ కూడా రాజీ పడకుండా ప్రొజెక్టుకు కావలసిన ప్రతిదీ అద్భుతంగా సమకూర్చారు. ఆయన సపోర్ట్ లేకుండా ఈ సినిమా నేను చేసే వాడినే కాదు. ఈ ఆర్ట్ జర్నీలో ఆయన ప్రతి మూమెంట్‌లో సపోర్ట్ చేశారు. ఈ సినిమాని 120 లొకేషన్స్‌లో షూట్ చేశామన్నారు.




## దూసుకెళ్తున్న
# కింగ్డమ్

విజయ్ దేవరకొండ హీరోగా నటిస్తున్న కింగ్డమ్ సినిమా టికెట్స్ హాట్ కేక్స్‌లా అమ్ముడవుతున్నాయి. ఇప్పటికే ఈ సినిమా టికెట్ బుకింగ్స్ ఓపెన్ కాగా...24 గంటల్లోనే 30 వేల టికెట్స్ సేల్ అయ్యాయి. దీంతో కింగ్డమ్ సినిమా టికెట్ బుకింగ్ ప్లాట్ ఫామ్స్‌లో ట్రెండ్ అవుతోంది. ఈ సినిమా మీద ఆడియెన్స్ ఎంత ఇంట్రెస్ట్‌గా ఉన్నారో ఈ టికెట్ బుకింగ్స్‌తో తెలుస్తోంది. మరోవైపు ఓవర్సీస్ లోనూ ప్రీ సేల్స్‌లో కింగ్డమ్ జోరు చూపిస్తోంది. ప్రేక్షకుల నుంచి వస్తున్న ఈ క్రేజ్ చూసిన మేకర్స్ కింగ్డమ్‌కు పెద్ద ఎత్తున ప్రీమియర్స్ వేయాలని ప్లాన్ చేస్తున్నారు. 30న కింగ్డమ్ ప్రీమియర్ షోస్ పడనున్నాయి. రీసెంట్‌గా రిలీజ్ చేసిన కింగ్డమ్ ట్రైలర్‌కు హ్యూజ్ రెస్పాన్స్ వస్తోంది. ట్రైలర్‌కు బ్లాక్ బస్టర్ రెస్పాన్స్ రావడంతో సినిమా మీద మరింత హైప్ క్రియేట్ అవుతోంది. అన్నదమ్ముల అనుబంధం నేపథ్యంగా సాగే గ్యాంగ్ స్టర్ డ్రామా మూవీగా కింగ్డమ్ ప్రేక్షకుల్లో కావాల్సినంత బజ్ క్రియేట్ చేసింది. ఈ సినిమాతో విజయ్‌కు బ్లాక్ బస్టర్ పక్కా అనే అంచనాలు ఏర్పడుతున్నాయి. కింగ్డమ్ సక్సెస్‌పై అటు నిర్మాణ సంస్థ సితార ఎంటర్ టైన్ మెంట్స్, డైరెక్టర్ గౌతమ్ తిన్ననూరి కూడా పూర్తి కాన్ఫిడెంట్‌గా ఉన్నారు.

## సెప్టెంబర్ 12న 'కాంత' విడుదల



దుల్కర్ సల్మాన్ మోస్ట్ అవైటెడ్ పీరియాడికల్ మూవీ కాంత ఆసక్తికరమైన ఫస్ట్ లుక్ పోస్టర్లతో స్ట్రాంగ్ బజ్ క్రియేట్ చేసింది. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వం వహించిన ఈ తమిళతెలుగు ద్విభాషా చిత్రంలో ప్రముఖ నటుడు సముద్రఖని కీలక పాత్ర పోషిస్తుండగా, దుల్కర్ సరసన భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తోంది. స్పిరిట్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్ వేఫేరర్ ఫిలమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్లపై రానా దగ్గుబాటి, దుల్కర్ సల్మాన్, ప్రశాంత్ పొట్లూరి, జోమ్ వర్గీస్ ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. దుల్కర్ సల్మాన్ పుట్టిన రోజును పురస్కరించుకుని, నిర్మాతలు ఈ చిత్ర టీజర్‌ను విడుదల చేశారు. 1950 ప్రాంతంలో మద్రాస్ నేపథ్యంలో సాగే ఈ థ్రిల్లర్ ఎమోషనల్ ఇంటెన్సిటీతో కట్టిపడేసింది. సెట్స్, కాస్ట్యూమ్స్ అన్నీ అప్పటి కాలాన్ని గుర్తు తెస్తాయి. డైరెక్టర్ సెల్వమణి సెల్వరాజ్ కథను అద్భుతంగా డిజైన్ చేశాడు. డాని సాంచెజ్ లోపెజ్ అద్భుతమైన సినిమాటోగ్రఫీ, 1950ల వాతావరణాన్ని అందంగా రిక్రియేట్ చేస్తే.. తా. రామలింగం ఆర్ట్ డైరెక్షన్ విజువల్ గ్రాండియర్ ని మరింత పెంచింది. ఝాను చంథర్ సంగీతం ఇంటెన్సిటీని ఎలివేట్ చేసింది. తమిళ్ ప్రభ అదనపు స్క్రీన్‌ప్లే అందించారు. లెవెలిన్ ఆంథోనీ గోన్సాల్వ్స్ ఎడిటింగ్ పనిలో చేశారు. ఈ సినిమా సెప్టెంబర్ 12న థియేటర్లలోకి రానుంది.

## యముడు ఆడియో ఆవిష్కరణ

మైథలాజికల్, సస్పెన్స్, క్రైమ్, థ్రిల్లర్‌గా 'యముడు' అనే చిత్రాన్ని జగన్నాథ పిక్చర్స్ పతాకంపై జగదీష్ ఆమంచి హీరోగా నటిస్తూ స్వీయ దర్శకత్వంలో రూపొందిస్తున్నారు. ఈ సినిమాకు 'ధర్మో రక్షతి రక్షితః' అనేది ఉప శీర్షిక. ఈ చిత్రంలో శ్రావణి శెట్టి హీరోయిన్‌గా నటించారు. తాజాగా యముడు ఆడియోలాంచ్ ఈవెంట్‌ను హైదరాబాద్ లో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మొదటి పాటను ప్రియాంక, మల్లిక లాంచ్ చేశారు. రెండో పాటను బెక్కెం వేణుగోపాల్ రిలీజ్ చేశారు. మూడో పాటను కే మ్యూజిక్ సీఈవో ప్రియాంక, యముడు నాలుగో పాటను మల్లిక రిలీజ్ చేశారు.



## అమెజాన్ ప్రైమ్‌లో అరేబియా కడలి




భారతదేశంలో అత్యంత ప్రాచుర్యం పొందిన ఎంటర్టైన్మెంట్ ప్లాట్‌ఫామ్ అయిన ప్రైమ్ వీడియో తన తాజా తెలుగు ఒరిజినల్ సిరీస్ 'అరేబియా కడలి'ని ఆగస్టు 8న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. భావోద్వేగాలతో నిండిన ఈ సర్వైవల్ డ్రామాను ప్రముఖ దర్శకులు క్రిష్ జాగర్లమూడి, చింతకింది శ్రీనివాసరావు రూపొందించగా, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్టైన్మెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్‌పై వై. రాజీవ్ రెడ్డి , సాయి బాబు జాగర్లమూడి నిర్మించారు. ఈ సిరీస్‌కు దర్శకత్వం వహించినది వి.వి. సూర్య కుమార్. అరేబియా కడలిలో ప్రముఖ నటులు సత్యదేవ్ , ఆనంది ప్రధాన పాత్రల్లో నటించగా, నాజర్, రఘు బాబు, దలీప్ తాహిల్, పూనమ్ బజ్వా, ప్రభావతి, హర్ష్ రోషన్, ప్రత్యూష సాధు, కోట జయరాం, వంశీ కృష్ణ, భరత్ భాటియా, చంద్ర ప్రతాప్ ఠాకూర్, డానిష్ భట్, రవి వర్మ, అమిత్ తివారి, నిహార్ పాండ్యా, ఆలోక్ జైన్ వంటి నటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ సిరీస్ ప్రైమ్ వీడియోలో భారతదేశంతో పాటు 240కి పైగా దేశాలు ,వివిధ ప్రాంతాల్లో ప్రత్యేకంగా ఆగస్టు 8న విడుదల కానుంది.

## సుమోటోతో కేసులు

(మొదటి పేజీ తరువాయి)

వచ్చిన కథనాలను ఆధారం చేసుకుని టిజిహెచ్‌ఆర్‌సి సుమోటోగా స్వీకరించింది. ఇందుకు సంబంధించిన ఆగస్టు 28వ తేదీ లోపు సమగ్ర నివేదికను అందజేయాలని తెలంగాణ ప్రభుత్వ ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. అదేవిధంగా నాగర్ కర్నూల్ జిల్లా ఉయ్యాలవాడ సమీపంలోని మహాత్మా జ్యోతిబా పూలే బిసి వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో జరిగిన ఫుడ్ పాయిజనింగ్ సంఘటనకు సంబంధించి సోమవారం ప్రచురితమైన వార్తల నేపథ్యంలో టిజిహెచ్‌ఆర్‌సి సుమోటోగా విచారణ చేపట్టింది. ఈ ఘటనకు సంబంధించి కూడా ఆగస్టు 28నాటికి సమగ్ర నివేదిక సమర్పించాల్సిందిగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సూచించింది. ఈ రెండు కేసులను టిజిహెచ్‌ఆర్‌సి చైర్మన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ అధ్యక్షతన సుమోటోగా స్వీకరించారు.

## దివ్యా దేశ్‌ముఖ్

(మొదటి పేజీ తరువాయి)

మిగతా అన్ని రకాల చెస్ టైటిళ్లను తన ఖాతాలో వేసుకున్న హంపి, తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొందని పరిశీలకుల అభిప్రాయం. 38 ఏళ్ల హంపి, తనలో సగం వయసు ఉన్న దివ్యను 'టై బ్రేకర్'లో నిలువరించడానికి శక్తివంచన లేకుండా శ్రమించింది. దివ్య పూర్తిగా రక్షణాత్మక విధానాన్ని అనుసరిస్తూ, పావులను అత్యంత జాగ్రత్తగా ముందుకు కదిలించగా, హింపి తన అపారమైన అనుభవంతో బలగాలను మోహరింప చేసింది. కానీ, దివ్య రక్షణ వ్యవస్థను సమర్థంగా ఛేదించలేకపోయింది. 40వ ఎత్తువద్ద తొందరపాటుతో తీసుకున్న నిర్ణయం ఆమె ఆటను తీవ్రంగా ప్రభావితం చేసింది. 70వ ఎత్తులో ఓటమిని ఎదుర్కొని, రన్నరప్ ట్రోఫీకి పరిమితమైంది. 2002లో హంపి 'గ్రాండ్ మాస్టర్' హోదాను అందుకోగా, దివ్య 2005లో జన్మించింది. వరల్డ్ కప్ టైటిల్‌తో స్వీకరించడంతో పాటు, భారత్ నుంచి 88వ గ్రాండ్ మాస్టర్‌గా కూడా అవతరించింది. అయితే, 84 మంది పురుషులే ఈ హోదాను అందుకోగా, హంపి, ద్రోణవల్లి హారిక, వైశాలి సరసన నాలుగో మహిళగా దివ్య చోటు సంపాదించింది. వరల్డ్ కప్‌ను గెల్చుకున్న ఈ యువ క్రీడాకారిణిపై ప్రశంసల జల్లు కురుస్తున్నది.

# కాంగ్రెస్ ప్రభుత్వం ఫార్మాసిటీని రద్దు చేయాలి

### ఇబ్రహింపట్నం శాసన సభ్యుడు మల్‌రెడ్డి రంగారెడ్డి ఇంటిముందు ప్లకార్డులతో రైతుల ధర్నా





**ప్రజాపక్షం/ యాచారం :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఫార్మాసిటీ రైతులకు ఇచ్చిన హామీలను నిలబెట్టు కొని ఫార్మాసిటీని తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఫార్మాసిటీ గ్రామాలకు చెందిన రైతులు ఇబ్రహింపట్నం శాసన సభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి ఇంటిని ముట్టడించి ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఫార్మాసిటీ బాధిత రైతులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే ఫార్మాసిటీని రద్దు చేస్తామని హామీ ఇచ్చిందని. ఫార్మాసిటీని రద్దు చేసి రైతుల భూములను రైతులకు ఇస్తామని గతంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చెప్పారన్నారు. ఫార్మాసిటీకి భూములు ఇవ్వని రైతుల భూములను ఆన్‌లైన్‌లో ఎక్కించకుండా నానా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాభూములు మాకే కావాలి ఫార్మాసిటీకి, ఫ్యూచర్ సిటీకి ఎట్టి పరిస్థితిలో భూములు ఇవ్వమని రైతులు తెల్చి చెప్పారు. ఎన్నికల ముందు ఫార్మాసిటీ రైతులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలన్నారు. లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ 10 రోజుల్లో రైతుల సమస్యలను పరిష్కరించడానికి తమ వంతుగా కృషి చేస్తామని అన్నారు. జిల్లా కలెక్టర్, ఆర్డిఓతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఫార్మాసిటీ గ్రామాలకు చెందిన ఊరికి ఐదు మంది రైతులు రావాలన్నారు. ఒక వేల రైతులు తమ భూములను ఇవ్వడానికి ఇష్టపడితే నష్టపరిహారం పెంచి ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. ఈ విషయాన్ని రైతులు అర్థం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫార్మాసిటీ ఉద్యమ నాయకులు కానమోని గణేశ్‌తో పాటు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కాల్పుల విరమణకు ఓకే (మొదటి పేజీ తరువాయి)

'ఏసియన్' (ఆగ్నేయ ఆసియా దేశాల సంఘం) కూటమిలో సభ్యదేశాలే. ప్రస్తుతం ఈ కూటమికి అధిపతిగా ఉన్న మలేసియా ప్రధానమంత్రి ఈ రెండు దేశాల మధ్యా చర్చలకు అధ్యక్షత వహించారు. రెండు దేశాలమధ్యా, సరిహద్దుల్లో సాధారణ పరిస్థితులను పునరుద్ధరించేందుకు నాయకులు ఇద్దరూ ఉమ్మడి అవగాహనకు వచ్చినట్లు అన్వర్ ఇబ్రహీం చెప్పారు. కాంబోడియా ప్రధానమంత్రి హన్ మానెట్, థాయ్‌లాండ్ తాత్కాలిక ప్రధానమంత్రి ఫుంథమ్ వెచాయచాయ్ ఈ ముఖాముఖీ చర్చల్లో పాల్గొన్నారు. ఈ రెండు దేశాలమధ్యా కుదిరిన ఉమ్మడి ఒప్పంద పత్రాన్ని అన్వర్ ఇబ్రహీం పత్రికాగోష్ఠిలో చదివి అందరికీ వివరించారు.

ఈ సమావేశ ఫలితాలపట్ల రెండు దేశాల నాయకులూ హర్షం ప్రకటించారు. అటు ఫుంథమ్ వెచాయచాయ్ గానీ, ఇటు హన్ మానెట్‌గానీ చర్చలపట్ల ఎలాంటి అసంతృప్తి వ్యక్తం చేయలేదు. ఈ సంప్రదింపుల తర్వాత పత్రికాగోష్ఠి కూడా చాలా తక్కువ సమయంలోనే ముగిసింది. ఇరుగు పొరుగుదేశాల నాయకులు ఇద్దరు కరచాలనం చేసుకున్నారు. సంక్షిప్త ప్రకటనతో పత్రికాగోష్ఠి ముగిసింది. శనివారం పొద్దుపోయాక ఈ రెండు దేశాల నాయకులతో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఫోన్ సంభాషణలు చేశారు. రెండు దేశాలూ శత్రుత్వం కొనసాగిస్తే వారితో వాణిజ్యం చేసే ప్రసక్తే లేదని ట్రంప్ వారిని బెదిరించారు. దీంతో రెండు దేశాలు బేషరతుగా కాల్పుల విరమణపై చర్చలకు సుముఖత వ్యక్తం చేశాయి. ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా ట్రంప్ ప్రకటించిన తర్వాత కూడా ఆ మాటను ఉల్లంఘించి రెండు దేశాలూ పోరాటాన్ని కొనసాగించాయి. సోమవారం మలేసియాలో చర్చలతో ప్రస్తుతానికి కథ సుఖాంతమైంది. గడచిన గురువారం జులై 24న థాయ్‌లాండ్–కాంబోడియా మధ్య సరిహద్దు ఘర్షణలు ప్రారంభమయ్యాయి. ప్రాణాంతకమైన ఈ ఘర్షణల్లో నాలుగు రోజుల పోరాటంలో 35 మంది సైనికులు, పౌరులు మరణించారు. రెండు దేశాలలోనూ 1.68 లక్షల మంది ప్రజలు సరిహద్దు ప్రాంతాల నుండి దూరంగా పారిపోయారు. 'మీరే మొదట దాడులు ప్రారంభించారంటూ రెండు దేశాల పరస్పర ఆరోపణలతో నాలుగురోజులూ గడిచాయి. 1907లో కాంబోడియా తమ వలసకేంద్రంగా ఉన్నకాలంలో ఆనాటి ఫ్రెంచ్ ప్రభుత్వం సరిహద్దులను నిర్దేశించి ఒక పటాన్ని రూపొందించింది. దీనిని థాయ్‌లాండ్ వ్యతిరేకిస్తోంది. ఈ రెండు దేశాలమధ్యా 817 కి.మీ సరిహద్దు ప్రాంతం ఉంది. ఫ్రాన్స్ నిర్దేశించిన ఈ సరిహద్దులలో అనేకచోట్ల దశాబ్దాలుగా వివాదం కొనసాగుతోంది. తమ దేశానికి చెందిన అనేక చారిత్రక ప్రదేశాలు కాంబోడియాలోకి వెళ్ళాయని థాయ్‌లాండ్ ప్రతిఘటిస్తున్నది.

## ప్రత్యేక ఎస్‌టి కమిషన్

(మొదటి పేజీ తరువాయి)

గోడెం నగేష్, ఆదివాసి గిరిజన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్, స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్, గిరిజన శాఖ కార్యదర్శి శరత్, గిరిజన సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించి తీర్మానాలు చేశారు. ఇందులో ఏజెన్సీ ప్రాంతాల్లో స్థానిక గిరిజన సొసైటీలకు మరింత లబ్ధి చేకూరేలా సాండ్ మైనింగ్ విధానంలో మార్పులు, 18 జిల్లాల్లో నూతనంగా జిల్లా ట్రైబల్ అధికారి పోస్టులను, ఆశ్రమ పాఠశాలలో 1085 టీచర్ పోస్టులను మంజూరు చేయాలని, మైదాన ప్రాంతాల్లో ఐటిడిఎలను ఏర్పాటు, ఆశ్రమ పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడేషన్, ఆదివాసీలు పివిటిజిల కోసం హైదరాబాద్‌లో ప్రత్యేక ఐఎఎస్ స్టడీ సర్కిల్ ఏర్పాటు, 5వ షెడ్యూల్‌లోని 100 శాతం రిజర్వేషన్లు గిరిజనులకు దక్కేలా చర్యలు తీసుకోవాలని, అంబేద్కర్ విదేశీ విద్య స్కాలర్‌షిప్‌ల లబ్ధిదారుల సం ఖ్యను వంద నుంచి 500ల మంది విద్యార్థులకు పెంచాలని తీర్మానించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల్లో రాయ్ సెంటర్ల నిర్మా ణం, ట్రైబల్ దేవాలయాలకు ధూపదీప నైవేధ్య పథకాన్ని వర్తింపచేయాలని, ఎస్‌టిలకు మరిన్ని ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు.

**గిరిజన పనులకు సకాలంలో బిల్లులు చెల్లిస్తాం: మంత్రి లక్ష్మణ్**

మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వం గిరిజన సలహా మండలి సమావేశాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు. గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి కోసం చేసే పనులకు బిల్లులను సకాలంలో చెల్లిస్తామని, బిల్లుల చెల్లింపుల విషయంలో గత ప్రభుత్వ తప్పిదాలను ఎట్టి పరిస్థితుల్లో పునరావృతం కానివ్వబోమని స్పష్టం చేశారు. గిరిజన ప్రాంతాల్లో రోడ్లు, బ్రిడ్జిల నిర్మాణంపైన అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పనులు చేపట్టడానికి కాంట్రాక్టులు రావడంలేదని ఎస్‌టి సబ్ ప్లాన్ నిధులను ఇతర ప్రాంతాలకు తరలించవద్దని సూచించారు.

**ఎస్‌టి సబ్ ప్లాన్ నిధులను పక్కదారి పట్టించిన గత ప్రభుత్వం: మంత్రి సీతక్క**

మంత్రి సీతక్క మాట్లాడుతూ గిరిజన సంక్షేమ విషయంలో గత ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుతున్నామని, గత ప్రభుత్వం ఎస్‌టి సబ్ ప్లాన్ నిధులను పక్క దారి పట్టించిందని ఆరోపించింది. ఎస్‌టిలకు కేటాయించిన నిధులను, వారికే ఖర్చు చేయాలని, కేటాయించిన నిధులను అదే అసెంబ్లీ నియోజకవర్గంలో, అదే జిల్లాలో సర్దుబాటు చేయాలి, తప్ప మైదాన ప్రాంతాలకు తరలించవద్దని మంత్రి సీతక్క తెలిపారు. ఎస్‌టిల ఇండ్ల నిర్మాణానికి బడ్జెట్‌లో నిధులను పెంచే అంశాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు. ఎస్‌టిలకు ఇందిరమ్మ ఇండ్ల విషయంలో కనీస స్థల అర్హతను సడలించాలనే డిమాండ్ ఉన్నదని, ఈ అంశాన్ని సిఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని సీతక్క తెలిపారు.

## జిహెచ్‌ఎంసి

(మొదటి పేజీ తరువాయి)

ద్వారా ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం, సిఆర్‌ఎంపి రోడ్ల నిర్వహణ కూడా జిహెచ్‌ఎంసిపై మోపింది. వీటి నిర్మాణానికి జిహెచ్‌ఎంసి అప్పులు చేయాల్సి వచ్చింది. సుమారు రూ.6553 కోట్లు అప్పులు చేయడంతో జిహెచ్‌ఎంసి ఆర్థికంగా దివాలా తీసింది. దీంతో మిగులు నిధులతో కళకళాడిన జిహెచ్‌ఎంసి గల్లపెట్టే కాస్త ఖాళీగా అయింది. అప్పులకు వాయిదాల చెల్లింపునకు, సిబ్బంది వేతనాలు, నిర్వహణ పనులకు నిధులు సమర్చుకోవడం అధికారులకు తలకు మించిన భారంగా మారింది.

**ప్రతినెలా రూ.400కోట్లు లేనిదే బండి ముందుకు సాగదు..**

జిహెచ్‌ఎంసిలో ఈ నెల నుంచి నెలకు కనీసం రూ.400 కోట్లు లేనిదే ముందు సాగని పరిస్థితి నెలకొందని అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ప్రతి నెల రూ. 100 కోట్ల పైనే చేసిన అప్పులకు అసలు, వడ్డీలను చెల్లించటంతో పాటు మరో రూ. 136 కోట్ల జీతభత్యాలు, పెన్షన్‌ల చెల్లింపులు, మరో రూ. 100 కోట్లు సాధారణ నిర్వహణ పనులకు, ఇతర ఇంధన ఖర్చులతో కలిపి ఇకపై ప్రతి నెల రూ. 400 కోట్ల నిధులు జిహెచ్‌ఎంసికి కావల్సిందే. ప్రస్తుతం జిహెచ్‌ఎంసికి ఉన్న ఆర్థిక వనరులతో అంత పెద్ద మొత్తంలో నిధులు సమకూర్చుకోవటం కష్టతరమేనని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా వచ్చే ఆదాయం రూ.100 కోట్లలోపే ఉండటంతో దిక్కు తొచని పరిస్థితి నెలకొంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతి నెల జిహెచ్‌ఎంసికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 200 కోట్లు చెల్లిస్తుంది. ఈ నెలాఖరు నుంచి సర్కారు మరింత ఎక్కువ సహాయం చేస్తే తప్పా బండి ముందుకు సాగని పరిస్థితులు నెలకొన్నాయి. ప్రధానంగా కొద్ది నెలల క్రితం రూ. వెయ్యి కోట్ల పై చిలుకు పేరుకుపోయిన కాంట్రాక్టర్‌ల బిల్లులు మార్చి మాసం వరకు చేసిన పనుల తాలుకూ బిల్లులను విడుదల చేయడంతో ఈ పరిస్థితి వచ్చిందని అధికారులు చెబుతున్నారు. వచ్చే నెల 1వ తేదీన చెల్లించాల్సిన జులై మాసం వేతనాలు, పెన్షన్ల చెల్లింపులు కూడా సకాలంలో చెల్లించటం కష్టతరమయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. కానీ ఆర్థికంగా ఎంత క్లిష్టమైన పరిస్థితులున్నా, జిహెచ్‌ఎంసికి ఏళ్ల తరబడి సేవలందించిన రిటైర్డ్ ఉద్యోగులకు మొదట పెన్షన్లు చెల్లించాలని, వీరిలో ఎక్కువ మంది రిటైర్డ్ ఉద్యోగులు కేవలం జీతాలపైనే ఆధారపడి జీవిస్తున్నందున, వారికి ముందుగా చెల్లించిన తర్వాతే వేతనాలు చెల్లింపులు జరిపాలని అధికారులు యోచిస్తున్నారు. ఇటీవలే కేంద్ర ప్రభుత్వం జిహెచ్‌ఎంసికి రూ.250 కోట్ల ప్రత్యేక నిధులను రాష్ట్ర ప్రభుత్వానికి కేటాయించింది. కానీ ఇంకా ప్రభుత్వం ఆ నిధులను విడుదల చేయలేదని తెలిసింది.

**ఈ నెల ఆస్తిపన్ను కేవలం రూ.46 కోట్లు మాత్రమే..**

ప్రధాన ఆర్థిక వనరులైన ఆస్తిపన్ను వసూళ్లు, పట్టణ ప్రణాళిక విభాగం(టౌన్ ప్లానింగ్) ఫీజుల ఆదాయంపైనే జిహెచ్‌ఎంసి అధికారులు ఆశలు పెట్టుకున్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం (202526) చివరి కల్లా ఆస్తిపన్ను వసూళ్లను రూ. 2500 కోట్ల లక్ష్యంగా పెట్టుకున్న జిహెచ్‌ఎంసి ప్రతి నెల రూ.100 కోట్ల వరకు వసూలు చేయాల్సిందే. ఇంత మొత్తంలో వసూలు చేస్తేనే వేతనాలు, పెన్షన్లు చెల్లింపులు సాధ్యమవుతోందని అధికారులు అంటున్నారు. ఆస్తిపన్నును మెరుగ్గా వసూలు చేసేందుకు ట్యాక్స్ ఇన్ స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లకు లక్ష్యాలు నిర్దేశించారు. కానీ జూలై మాసం ముగింపునకు వస్తున్నా ఇప్పటి వరకు ఆస్తిపన్ను కేవలం రూ. 46 కోట్లు మాత్రమే వసూలైనట్లు తెలిసింది. ప్రతి నెల మాధిరిగానే ఈ సారి కూడా రాష్ట్ర ప్రభుత్వం రూ.200 కోట్లను విడుదల చేసినా, నెల మొత్తం అయ్యే ఖర్చులకు కావాల్సిన రూ.400 కోట్లలో మరో రెండు వంద కోట్ల ఎక్కడి నుంచి సమకూర్చుకోవాలనే విషయంపై అధికారులు తర్జనబర్జన పడుతున్నారు. ఇక టౌన్ ప్లానింగ్ విభాగం ఆదాయం కూడా కనీసం రూ.100 కోట్లు రాకపోవటంతో జీతాలు, పెన్షన్లు, సాధారణ నిర్వహణ పనులకు మరో రూ. 100 కోట్లను ఎక్కడి నుంచి సమకూర్చుకోవాలనే విషయంలో అధికారులు తలలు పట్టుకున్నారు. సర్కార్ దాయతలిస్తే తప్పా జిహెచ్‌ఎంసి బండి ముందు సాగే పరిస్థితులు కనిపించడం లేదు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com